తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

డిసెంబరు 2020.
వెల రూ.5/-




వినా వేంకటేశం ననాథో ననాథః,
సదా వేంకటేశం స్మరామి స్మరామి ।
హరే! వేంకటేశ! ప్రసీద ప్రసీద,
ప్రియం వేంకటేశ! ప్రయచ్ఛ ప్రయచ్ఛ ॥



తిరుమల తిరుపతి దేవస్థానములు

# భారతరాష్ట్రపతి గౌ॥శ్రీరామ్‌నాథ్ కోవింద్
# సతీసమేతంగా 24-11-2020న
# తిరుమల శ్రీవారిని,
# తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారిని
# సందర్శించుకున్న దృశ్యాలు

















## గీతాశ్లోకార్థసారం

శ్లో : కాశ్యశ్చ పరమేష్వాసః శిఖండీచ మహారథః ।
ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకి శ్చాపరాజితః ॥

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం-17వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** పరమేష్వాసః= గొప్పధనుస్సుగల; కాశ్యశ్చ-కాశ్యః చ= కాశీరాజున్నూ; మహారథః= మహారథుడైన; శిఖండీ చ= శిఖండియును; ధృష్టద్యుమ్నః= ధృష్టద్యుమ్నుడును; విరాటః చ= విరాటుడును; అపరాజితః= అపజయంలేనివాడైన; సాత్యకిః చ= సాత్యకియును; దుధ్ముః= క్రమంగా శంఖాలు ఊదారు.

**భావం:** గొప్పధనుస్సు గలవాడైన కాశీరాజు, మహారథుడైన శిఖండి, ధృష్టద్యుమ్నుడు, విరాటరాజు; అపజయం లేనివాడైన సాత్యకీ క్రమంగా వారివారి శంఖాలను పూరించారు.

## సింగారాల కేమరుదు

చూడరమ్మ సతులాల సోబానఁ బాడరమ్మ
కూడున్నది పతిఁ జూడికుడుతనాచారి,

శ్రీమహాలక్ష్మియట సింగారాల కేమరుదు
కాముని తల్లియట చక్కఁదనాల కేమరుదు
సోముని తోఁబుట్టువట సొంపుఁ గళల కేమరుదు
కోమలాంగి యీ చూడికుడుతనాచారి

కలశాబ్ధికూఁతురట గంభీరాల కేమరుదు
తలఁప లోకమాతయట దయ మరి యేమరుదు


జలజనివాసియట చల్లఁదన మేమరుదు
కొలఁదిమీర యీ చూడికుడుతనాచారి

అమరవందితయట అట్టె మహిమేమరుదు
అమృతము చుట్టమట ఆనందాల కేమరుదు
తమితో శ్రీ వేంకటేశుఁ దానె వచ్చి పెండ్లాడె
కొమెరవయసు చూడికుడుతనాచారి

(సంపుటం.26 - సంకీర్తన.246)

శ్రీగోదాదేవిని స్తుతిస్తూ, శ్రీమహాలక్ష్మిని వర్ణించిన గీతమిది. గోదాదేవి సాక్షాత్తు లక్ష్మీదేవి. ఆమెకు సింగారాలు కొరతా? మన్మథుని తల్లి కనుక చక్కదనాలు కొదవా? చంద్రుని తోబుట్టవు కనుక సొంపైన కళలకు కొదవా? పాలసంద్రపు బిడ్డ కనుక గంభీరాలకు తక్కువా? లోకమాత కనుక దయకు తక్కువా? పద్మనివాసిని కనుక చల్లదనానికి లోటా? దేవవందిత కనుక మహామహిమకు అరుదా? అమృతానికి చుట్టం కనుక ఆనందాలకు కొరతా? ఇన్ని గొప్పలు గల్గీ, స్వయంగా తానే వచ్చి, శ్రీవేంకటేశ్వరుణ్ణి పెండ్లాడింది- ఆ నవయువతి-గోదాదేవి. అన్నమయ్య దృష్టిలో వేంకటేశుడే రంగనాథుడు.

మధురభక్తికి ప్రతీక అయిన శ్రీగోదాదేవిని లక్ష్మీదేవిఅంశంగా భావించి, ఆరాధించాడు- అన్నమయ్య.





తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# శ్రీవేంకటేశ్వర సర్వ శ్రేయస్సు ట్రస్టు

**"మానవసేవయే మాధవసేవ"- అన్న లక్ష్యంతో తి.తి.దేవస్థానములు వివిధ సామాజిక సంక్షేమకార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అనాథ బాలబాలికలకు చేయూతనివ్వాలనే సంకల్పంతో 1943వ సం॥లో శ్రీవేంకటేశ్వర బాలమందిర్(తిరుపతి) ట్రస్టును స్థాపించింది. ఈ శ్రీవేంకటేశ్వర బాలమందిరంట్రస్టు ప్రస్తుతం శ్రీవేంకటేశ్వర జలనిధిపథకం, కల్యాణమస్తుట్రస్టు, శ్రీవేంకటేశ్వర సమాచార సాంకేతికట్రస్టులను కలుపుకుని 'శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు'గా రూపొందింది.**

## శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు లక్ష్యాలు

**01)** అనాథలైన బాలబాలికలు, వృద్ధులు, నిరాశ్రయులు, అభాగ్యులు, నిరుపేద బలహీనవర్గాలవారి అభివృద్ధి, సంరక్షణ, సంక్షేమాలకోసం ధర్మశాలలు, వసతిగృహాల ఏర్పాటు.

అనాథలకు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థినీవిద్యార్థులకు ఆర్థికంగా చేయూతనివ్వడం;

**02)** దివ్యాంగులకు, మానసికరోగులకు తగు వైద్యసదుపాయాలు కల్పించి, వారి జీవితప్రమాణాలను మెరుగుపరచడం. ఈ లక్ష్యంలో కుల, మత, జాతి, వర్గ, వర్ణ భేదాలను పాటించక అందరినీ సమానంగా స్వీకరించడం.

**03)** వరదలు, కరవువంటి ప్రకృతివిపత్తులసమయాల్లో అగ్ని ప్రమాదాలవంటి అవాంఛనీయసంఘటనలు జరిగినపుడు సత్వరసహాయచర్యలు గావించడం.

**04)** వినికిడిలోపం, మాటలురాని శిశువులకు, ఈ లోపాలతో ఎదిగిన పిల్లలకు పునరావాసకేంద్రాల్ని ఏర్పాటుచేయడం.

**05)** గ్రామాలలో పై లోపాలతో ఉన్న బాలబాలికలకు అవసరమైన పరికరాలను అందజేయడంతోపాటు వారిని విద్యావంతుల్ని చేయడం.

**06)** సమాజంలో కనీస అవసరమైన త్రాగునీటిని నిత్యం అందుబాటులో ఉంచడం. తిరుమల పంచాయతి, తిరుపతి కార్పొరేషన్‌కు అవసరమైన నీటివనరులఏర్పాటుకై ఆనకట్టలు,




తొట్టెలను ఏర్పాటుచేయడం. నీటిపొదుపుకు అవసరమైన చర్యలు తీసుకోవడం.

**07)** శ్రేయస్కరమైన వివాహకార్యక్రమాలద్వారా వధూవరులు గౌరవాభిమానాలతో, ఉన్నతకుటుంబజీవితంతో గడిపేలా చేయడం.

**08)** పుస్తకాలతోపాటు, ఇంటర్‌నెట్‌వంటి ఆధునికసాంకేతిక సదుపాయాలతో మనదేశ చారిత్రక, సాంస్కృతికవారసత్వ సంపదను భవిష్యత్తరాలకు అందజేయడం.

**09)** సామాజిక క్రమశిక్షణ, నైతికవిలువల్ని పెంపొందిస్తూ యువతరంలో ఆత్మవిశ్వాసం కలిగించటం.

**10)** పైన పేర్కొన్న ఆశయాలసాధనకు కృషిచేస్తున్న వ్యక్తులకు, సంస్థలకు సహకారమందించడం.

## శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టుకు విరాళాలు ఇలా....

**01)** ఈ పథకంకోసం కనీస విరాళం రూ.1000/- గా నిర్ణయించబడింది.

**02)** రూ.1000/- కంటే తక్కువవిరాళం శ్రీవారి హుండీఖాతాలో జమ చేయబడుతుంది. ఈ విరాళాలన్నీ కూడా ఒకే జాతీయబ్యాంకులో డిపాజిట్ చేయబడతాయి, వాటిమీదవచ్చే వడ్డీ ఈ పథకంకోసం వినియోగింపబడుతుంది. దాతలు తమ విరాళాలను 'ది ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు, తి.తి.దే.,తిరుపతి' వారి పేరిట ఏదైన షెడ్యూల్‌బ్యాంకుమీద తీసిన చెక్కు/ డిమాండ్‌డ్రాఫ్ట్‌ద్వారా 'చీఫ్ అకౌంట్స్ ఆఫీసరు, తి.తి.దే., తిరుపతి-517501' వారికి పంపవచ్చు.

**ఇతర వివరాలకు 0877-2264258ను సంప్రదించగలరు.**



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి॥


50 వసంతాల
1970-2020
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 51 డిసెంబరు, 2020 సంచిక : 07


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| వైకుంఠం వాకిట్లో.... | డా॥పమిడికాల్వ చెంచుసుబ్బయ్య | 07 |
| పాశురమే ప్రభాతం! | డా॥ ముదివేడు ప్రభాకరరావు | 11 |
| శ్రీమద్భగవద్గీత | విద్వాన్, డా॥ ఈ.జి. హేమంత కుమార్ | 15 |
| దేవాలయాలకు వెళ్దాం పదండి!! | డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య | 17 |
| కావ్యమొక్కటే... విశేషాలెన్నో... | శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు | 20 |
| దుఃఖాలను దాటాలంటే... | శ్రీ డి.వి.ఆర్.భాస్కర్ | 22 |
| శ్రీవారిసన్నిధిలో అధ్యయనోత్సవం | డా॥ చిలకపాటి విజయరాఘవాచార్యులు | 24 |
| ఇంతకంటే విలువైన కానుక ఉంటుందా? | శ్రీమతి నీలంరాజు భార్గవి | 26 |
| మొదటి వైద్యునికి వందనం!! | శ్రీ కె.జానకిరామావధాని | 51 |
| ధనుర్మాస వైభవం | ఆచార్య పుల్లూరి ఉమ | 53 |
| భగవంతుని చిరునామా | డా॥ గరికిపాటి నరసింహారావు | 56 |
| ఈ వ్రతం అన్ని సందలనూ ఇస్తుంది.. | డా॥ మేడికుర్తి ఓబులేసు | 58 |
| ఏరేరి తేనా నీపూజకు... | డా॥ గంగిశెట్టి లక్ష్మీనారాయణ | 61 |
| ఆరు మోముల వాడి ఆరుక్షేత్రాలు | శ్రీ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు | 63 |
| అన్నమయ్య జీవితచరిత్ర | డా॥ మన్నూరు శివప్రవీణ్ | 68 |
| మీ పిల్లలకు చెప్పండి..!! | డా॥ కప్పగంతు రామకృష్ణ | 69 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>నిర్వహణ- మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 71 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 74 |


ముఖచిత్రం : అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు
వెనుక చిత్రం : గోదా అలంకారంలో గోవిందుడు


గౌరవ సంపాదకులు
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు
ఆచార్య కె.రాజగోపాలన్, పిహెచ్.డి.,

సంపాదకులు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకులు
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

ముద్రాపకులు
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,



సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360



విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777
2233333

వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

# జీవనవేదం!

సర్వమానవాళిజీవనతత్త్వానికి జీవధాతువు భగవద్గీత. వ్యక్తిశ్రేయస్సునుండి యావత్ప్రపంచశాంతివరకూ, మనిషి చేసే ప్రస్థానంలో అడుగడుగునా మార్గదర్శకంగా నిలిచి దారిచూపే ఆధ్యాత్మికకాంతిపుంజం భగవద్గీత.

శుద్ధసంపూర్ణజ్ఞానమూర్తీ, భగవంతుడూ అయిన శ్రీకృష్ణుడు అర్జునుణ్ణి నిమిత్తమాత్రునిగా పెట్టుకొని బోధించిన యోగశాస్త్రం భగవద్గీత. అందుకనే భగవద్గీత ఒకమతగ్రంథం కాదు– సమస్తమానవాళికి జీవనవేదం, జీవుని నిఘంటువు. పురుషుణ్ణి పురుషోత్తమస్థితికి చేర్చేది–గీత.

గీత మానవజీవనసరళిని నియంత్రిస్తూ జీవనగమనానికి సత్యమైన, చేరువైన గమ్యాన్ని చూపుతుంది. గీతను లోతుగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించేకొద్దీ నిత్యవ్యావహారికజీవితంలోని అనేకసమస్యలకు సమాధానాలు, పరిష్కారాలు గోచరిస్తుంటాయి. అందుకే దానిని 'గీతామృతం' అన్నారు.


గీతలో మొదటిది విషాదయోగం. చివరిది మోక్షసన్న్యాసయోగం. విషాదంతో ప్రారంభమైన మానవ జీవితం భగవంతునిప్రబోధంవల్ల చివరకు మోక్షంపైకూడా కోరికలేనంతటి శుద్ధజ్ఞాన, శుద్ధసత్త్వ, నిష్కామస్థితికి చేరుస్తుంది గీతాజ్ఞానం. ఇదే జీవన్ముక్తి (జీవించి ఉండగానే ఏ బంధాలూ లేక నిత్యమూ ఆనందంగా, హాయిగా ఉండే స్థితి). మానవులందర్నీ దైవత్వానికి చేర్చే ఆధ్యాత్మికమతాన్ని గీత స్థాపించింది. తనకు విధించిన ఆశ్రమధర్మాలతో భగవంతుణ్ణి అర్చిస్తే నిర్మలమైన చిత్తం ఏర్పడుతుంది. అందువల్ల ఫలాపేక్షలేని కర్మయోగం సిద్ధిస్తుంది. దీనిద్వారా నిర్మల నిశ్చల జ్ఞానభక్తి ఏర్పడుతుంది. దీంతో మోక్షం లభిస్తుంది. ఇదే గీతాసారం! నిష్కామకర్మే ఆరాధన ఇదే గీతాహృదయం!

ఈశ్వరార్పణబుద్ధితో చేసేకర్మలు తప్ప మిగిలినకర్మలన్నీ బంధానికి కారణాలవుతాయని తెలిసి ఆచరించడమే మోక్షానికి మార్గమనింది–గీత.

ప్రకృతిలో ఉంటూనే ప్రకృతికి అతీతంగా ఎలా జీవించవచ్చో నేర్పింది గీత. యోగమంటే 'చేసే సత్కర్మను నేర్పుతో చేయడమే!' అనే కొత్త నిర్వచనం చెప్పింది గీత. కర్మ చేయడం మనవంతు. కానీ, ఫలాన్నిమాత్రం కోర కుండా కర్మచేస్తే అది నిష్కామకర్మ అవుతుంది. అదే భగవంతునికి నచ్చే కర్మవిధానం. ఈ సిద్ధాంతాన్ని ప్రతి పాదించింది గీత ఒక్కటే!

ఆధునికజీవితసంఘర్షణలో నలిగిపోతూ, విషాదయోగాన్ని అనుభవిస్తున్న నేటియువతకు భగవద్గీత చక్కటి కరదీపిక. ఇంద్రియాలను, మనస్సును, బుద్ధిని ఏకం చేసి, మానసికప్రశాంతతను కలిగించే ఆదర్శగ్రంథం గీత. జీవితధర్మంగా కర్మను ఆచరించడం ఎలాగో నేర్పేగొప్పప్రణాళిక గీత. సృష్టిలోని ఏ రచనకైనా పరమార్థం– పరమాత్మునితత్త్వాన్ని బోధించడమే! ప్రస్థానత్రయంలోని ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు ఇవన్నీ ఒకస్థాయివారికి మాత్రమే! అయితే, భగవద్గీత మాన్యులకే కాక, సామాన్యప్రజలకూ కల్పవృక్షంలాంటిది.

ఈనాడు జీవితం పూర్తిగా యాంత్రికమైపోయింది. గడియారంతో సమానంగా ప్రజలు పరుగుపెడుతున్నారు. ఎవరిమొహం చూచినా–ప్రత్యేకంగా యువతరాన్ని, ఏదో ఆందోళన, వేగం, అలసట, ఆత్రుత, నిరాశ, నిస్పృహ బ్రతుకుతెరువుకై జరిపే పోరాటంలో మనిషిపొందుతున్న చీకాకు లివి. ఒకనిమిషంకూడా విశ్రాంతిలేని ఈ జీవన సమరంలో అజ్ఞానంతో, అధైర్యంతో డీలాపడిపోయే మనిషికి నూతనోత్తేజం, ధైర్యం, ప్రోత్సాహం ఇవ్వగల దివ్యౌషధం– గీత. అలాంటిగీతను – శ్రవణం చేయాలి. మననం చెయ్యాలి, ధ్యానం చెయ్యాలి. ఈ జీవనరథాన్ని రాగద్వేషాలతో కూడిన ద్వంద్వాలమార్గంలో నడపటమే బంధం! దైవమార్గంలో నడపడమే మోక్షం! ఇదే గీతా రహస్యం! ఇది సర్వఉపనిషత్సారం. కాబట్టి గీత అందరూ గ్రోలదగినమధురక్షీరం!



# వైకుంఠం వాకిట్లో

- డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య,
98481 11794

ఇరవైనాలుగు ఏకాదశుల్లోనూ– సౌరమానంలో, ప్రశస్త మైన ధనుర్మాసంలో (మార్గశిర/పుష్యమాసాల్లో) వచ్చే శుక్ల పక్ష ఏకాదశిని **"వైకుంఠఏకాదశి"**గా కీర్తిస్తున్నాము. దీన్నే **"ముక్కోటి ఏకాదశి"** అంటారు. సౌరమానం ధనుర్మాసం కాగా, అందు వచ్చే 'వైకుంఠ ఏకాదశి' చాంద్రమానాన్ని అనుసరించేది. శ్రీమన్నారాయణునికి సూర్యుడు కుడికన్ను. చంద్రుడు ఎడమకన్ను. కన్నులు వేర్వేరుగా ఉన్నా దృష్టి ఒక్కటే ఐనట్లు. సూర్యచంద్రులు వేర్వేరుగా కన్పిస్తున్నా కాంతితత్త్వం ఒక్కటే అనే మహాతత్త్వాన్ని ఈ పండుగ సూచిస్తుంది.

## ఇందరికీ అభయంబులిచ్చు చేయి.....

వైకుంఠఏకాదశి సామాన్యంగా మార్గశిర పుష్య మాసాల్లో వస్తుంది. రావణునిబాధలు తాళలేనిదేవతలు బ్రహ్మను వెంటబెట్టుకొని, వైకుంఠం చేరారు. హరివాసరమైన మార్గశిరశుక్ల ఏకాదశినాడు శ్రీహరిని ప్రార్థించి, తమబాధను విన్నవించారు. స్వామి బ్రహ్మాదులకు దర్శన మిచ్చి, అభయ మొసగడం జరిగింది. కాగా దేవతలబాధలను నివారించ డానికి ఈ ఏకాదశియే మార్గం చూపింది. మరో వృత్తాంతం మధుకైటభులనే రాక్షసుల్ని మహావిష్ణువు సంహరించినపుడు వారు దివ్యరూపాలు ధరించి, దివ్యజ్ఞానాన్ని పొంది, "దేవా! వైకుంఠంవంటి మందిరాన్ని నిర్మించి, ఏకాదశీపూజ చేసి, నిన్ను దర్శించి, నమస్కరించి, ఉత్తరద్వారమార్గంలో నిన్ను సమీపించేవారికి శ్రీవైకుంఠప్రాప్తి అనుగ్రహించు"మని ప్రార్థించారు. స్వామి 'తథాస్తు' అని సంతోషంతో అనుగ్రహించారు. దీనికి **'మోక్షోత్సవ దిన'** మనికూడా పేరు. ముక్కోటిదేవతలకు బాధలు నివారించినఏకాదశి కనుక "ముక్కోటి ఏకాదశి" అనీ పేరు. (ముక్కోటి అనేది 33 కోట్లకు సంకేతం అంటారు.) వైకుంఠదర్శనం కల్గిస్తుంది కనుక "వైకుంఠఏకాదశి". భగవద్దర్శనం గావించేది కనుక **"భగవదవలోకన దినం"**. మార్గశిరమందలి శుక్లఏకాదశి – 'మోక్షదైకాదశి'. (మోక్షాన్ని ఇచ్చే ఏకాదశి), పుష్యశుక్లఏకాదశి–'పుత్రదైకాదశి'(పుత్రప్రాప్తిని ప్రసాదించే ఏకాదశి).

శుక్లఏకాదశినాడు సూర్యునినుండి వెలువడిన పద కొండవకళ చంద్రుణ్ణి ప్రవేశిస్తుంది. బహుళఏకాదశినాడు చంద్రమండలంనుండి పదకొండవకళ సూర్యమండలాన్ని చేర్తుంది. ఇలా రాకపోకలవల్లే "ఏకాదశి" అనేపేరు సార్థక మయింది. "ఏకాదశ్యా ముపవసేన్న కదాచి దతిక్రమేత్" ఏకాదశినాడు తప్పక ఉపవాసం చేయాలి. "ఉపవాసః స విజ్ఞేయః, సర్వభోగవివర్జితః" ఉపవాసంనాడు పాపకృత్యాలకు దూరంగా ఉండాలి. సకలభోగాలను వదలి, పుణ్య కార్యాలు చేయడమే ఉపవాసం అని పెద్దలమాట! ఇంద్రియ ప్రకోపాన్ని అణచి, 11 ఇంద్రియాలను (పంచకర్మేంద్రియాలు, పంచజ్ఞానేంద్రియాలు, మనస్సు) భగవంతుని సన్నిధిలో వసింపజేసేదే నిజమైన ఉపవాసం. ఏకాదశీవ్రతం దశమిరాత్రితో ప్రారంభమై, ద్వాదశిఉదయంతో పూర్తి అవుతుంది. అందరూ ఈ వ్రతాన్ని ఆచరించవచ్చు!

ఎనిమిదేండ్లలోపు వయస్సున్న పిల్లలూ, ఎనభై యేండ్లు దాటిన వృద్ధులూ ఉపవాసం చేయాల్సినపనిలే దని కాత్యాయనస్మృతి పేర్కొనింది.

## పేరు వెనుక పరమార్థం

పూర్వం కృతయుగంలో చంద్రావతీనగరాన్ని పాలించే 'మురు'డనే రాక్షసు డుండేవాడు. దేవతల్ని జయించి, వేధించేవాడు. విష్ణువు వానితో వెయ్యేండ్లు యుద్ధం చేసి, అలసి, విశ్రాంతికై ఒకగుహలో చేరి, నిద్రించాడు. అట్టి శ్రీహరిని సంహరించడానికి మురుడు సిద్ధపడగా, స్వామిశరీరంనుండి దివ్యతేజస్సులతో ఒకకన్య ఉద్భవించింది. దివ్యాస్త్రాలతో యుద్ధంచేసి, ఆ కన్య మురుణ్ణి సంహరించింది. విష్ణువు మేల్కొని కన్యనూ, మరణించి ఉన్న మురుణ్ణీ చూచి, ఆశ్చర్యపడ్డాడు. కన్య నమస్కరించి, జరిగిందంతా విన్నవించింది. సంతోషించిన విష్ణువు ఆమెను వరం కోరుకొమ్మన్నాడు. ఆమె ఆనందంతో "దేవా! నేను ఏకాదశినాడు నీదేహంనుండి ఉద్భవించాను- కనుక నా పేరు ఏకాదశిగా, నా వ్రతం చేస్తూ, ఈనాడు ఉపవాసం ఉండేవారు సంసారబంధాలనుంచీ తరించేట్లుగా వరమిచ్చి, అనుగ్రహించండి" అని ప్రార్థించింది. స్వామి "అట్లే అగుగాక!" అని వరమిచ్చి, అదృశ్యుడైనాడు. నాటినుండి ఏకాదశీ వ్రతం భక్తితో ఆచరించేవారు సకలపాపాలనుండి విముక్తులై, విష్ణులోకాన్ని పొందుతా రనే ప్రశస్తి ఏర్పడింది.

ఏకాదశీతిథికి అధిదేవత ఏకాదశీదేవి. ఈమె విష్ణుదేహంనుండి రూపొందింది కనుక స్త్రీమూర్తియైన శ్రీవిష్ణుభగవానుడే! సర్వోత్తమతిథి-ఏకాదశి. ఏకాదశీవ్రత ప్రభావాన్ని వివరించేకథలు చాలా ఉన్నాయి.

## ఎంతమందో....

సుకేతు డనేరాజు విశ్వేదేవతల ఉపదేశానుసారం పుష్యశుక్లఏకాదశీవ్రతాన్ని ఆచరించి, భగవదనుగ్రహంవల్ల పుత్రవంతు డైనా డని పద్మపురాణం పేర్కొనింది.

సకలపాపాలనుండి విముక్తి చెంది, శ్రీకైవల్య ప్రాప్తితో పునర్జన్మలేని స్థితిని పొందడానికి వైకుంఠఏకాదశీ వ్రతాన్ని మించినవ్రతాచరణం లేదు.

దేవదానవులు ఈ ఏకాదశిరోజు ఉపవాసంతో రాత్రింబవళ్లూ శ్రమించి, క్షీరసాగరాన్ని మథించారు. ద్వాదశినాడు మహాలక్ష్మి సముద్రంనుండి వెలువడి వచ్చి, దేవతలకు ప్రత్యక్షమై, వారిని అనుగ్రహించింది. నాటినుండి ఏకాదశి నాడు పగలూ, రాత్రి ఉపవాసంతో ఉండి, జాగరణం చేసి, శ్రీహరిని స్తుతించినవారికి స్వామికృపవల్ల ముక్తి కరతలామలక మవుతుందనే నమ్మకం ఏర్పడింది.

కుచేలుడు ఏకాదశీవ్రతాన్ని ఆచరించి, మహైశ్వర్యవంతుడైనా డని చెప్తారు. ధర్మరాజు ఆచరించి, కష్టాల నుండి గట్టెక్కినాడు. రుక్మాంగదుడు ఆచరించి, పుత్రప్రాప్తికి నోచుకోవడమేకాక సకలదేవతాకృపాపాత్రుడై, మోక్షం పొందాడు. క్షీరసాగరమథనం లక్ష్మీఆవిర్భావం ఏకాదశి నాడే జరిగాయి. వైఖానసరాజు ఆచరించి, పితరులకు ఉత్తమలోకప్రాప్తి చేకూర్చాడు. అంబరీషునివ్రతప్రభావం జగద్విదితం.

## ఆధ్యాత్మికస్ఫూర్తి

'వైకుంఠఏకాదశి'లో వైకుంఠ, ఏకాదశి అని రెండు పదా లున్నాయి. 'వైకుంఠ' శబ్దం విష్ణువునూ, విష్ణువుండే స్థానాన్నీకూడా సూచిస్తుంది. చాక్షుషమన్వంతరంలో 'వికుంఠ' అనే ఆమెనుండి అవతరించినందున విష్ణువు "వైకుంఠః" (వైకుంఠుడు) అయ్యాడు. మరియు జీవులకు నియంత, జీవులకు సాక్షి, భూతముల స్వేచ్ఛావిహారాన్ని అణచేవాడు అనీ అర్థా లున్నాయి. 'వైకుంఠము' శ్వేతద్వీపమైన విష్ణుదేవుని స్థానం. పునరావృత్తి లేనిదీ, శాశ్వతమైనదీ అగు విష్ణుదేవుని పరంధామం. జీవులు వైకుంఠుణ్ణి అర్చించి, ఉపాసించి, వైకుంఠాన్ని చేరుటే ముక్తి. శరీరంలోని అన్నిఇంద్రియాలు, ఇంద్రియఅధిష్ఠానారాయణుణ్ణి సేవించడమే భక్తికదా!

ఇట వైకుంఠ మంటే పరంధామం. ఏకాదశి అంటే పదకొండు ఇంద్రియాల సమూహం. ఈ 11 ఇంద్రియాలూ వైకుంఠునికి అర్పించబడి, వైకుంఠుణ్ణి అర్చించి, సేవించి, ఉపాసించినపుడే- అవి పవిత్రవంతాలై- వాటిద్వారా సుఖానుభూతి నొందేజీవుణ్ణి వైకుంఠంలో చేరుస్తాయి. కాగా "ఏకాదశేంద్రియాలను వైకుంఠునికి అర్పణంచేసి, వైకుంఠాన్ని చేరి, శాశ్వతముక్తి నొంది, ధన్యులుకండి" అని బోధిస్తుంది "వైకుంఠ ఏకాదశి". వికుంఠమంటే దెబ్బతిననిది. ఇంద్రియాలు "వికుంఠాలు" అయినపుడే వైకుంఠసమర్చన ప్రశాంతంగా జరుగుతుంది. ద్వాదశి 12వస్థితి. ఇదే ఇంద్రియాతీతదివ్యానందస్థితి.



ఏకాదశినాటి ఉపవాసం సత్త్వగుణానికి సంకేతం. ఒకవస్తువుకు మిక్కిలిదగ్గరగా మరొకవస్తువు నుంచినపుడు మొదటివస్తువుయొక్కగుణం, వాసన రెండోదానిపై ప్రభావం చూపుతాయి కదా! అట్లే ఏకాదశేంద్రియాలతోకూడిన జీవాత్మ, వైకుంఠు నికి ఉప= సమీపంలో, వాసః= నివసించడంవల్ల అత్యంతసామీప్య, సాన్నిధ్యప్రభావం కారణంగా జీవాత్మపై పరమాత్మప్రభావం ప్రసరిస్తుంది. జీవుడు శుద్ధుడవుతాడు. ద్వాదశినాడు చక్రస్నానం గావించి, స్వామిప్రసాదాన్ని స్వీకరించడంతో ద్వాద శాక్షరీమంత్రమయమైన వాసుదేవతత్త్వాన్ని అనుభవి స్తాడు జీవాత్మ. ఈ అనుభవమే కలియుగవైకుంఠ మైన తిరుమల శ్రీపుష్కరిణిలో ముక్కోటిఏకాదశీ చక్రస్నానఫలం.

ఇది ధనుర్మాసం! "ప్రణవో ధనుః" అను టచే ఓంకారమే ధనుస్సు. శ్రీవారిని ప్రణవ మూర్తిగా ఉపాసించుటే ధనుర్మాసపూజ. అందు 'వైకుంఠఏకాదశి' సర్వసమర్పణరూపమైన త్యాగానికీ, శుద్ధసత్త్వగుణానికీ సంకేతం. స్వామి 'పవిత్రాణాం పవిత్రం, మంగళానాం మంగళం' కదా! అట్టి సుదర్శనరూపునిచేతి దివ్యాయుధం సుదర్శనచక్రం. ఇది కాలచక్రానికీ, దర్శన మాత్రంతోనే ముక్తినిచ్చేందుకూ ప్రతీక. సుదర్శనచక్రస్నాన స్పర్శతో కూడినజలంలో(పుష్కరిణీతీర్థంలో)స్నానంచేయడంతో జీవాత్మలు పరిశుద్ధులూ, 'సుదర్శనులూ' అవుతారు. ఇట్టి జీవులకు వైకుంఠద్వారాలు ఒకరోజే కాదు సర్వదా తెరువబడే ఉంటాయి.

ఇంతటి ప్రభావసంపన్నమైన వైకుంఠఏకాదశీ, ద్వాదశీ భక్తిశ్రద్ధలతో ఆచరించినవారికి పునర్జన్మ ఉండదు.

### కలియుగ వైకుంఠంలో.....

తిరుమల-శ్రీవారిఆలయంలో వైకుంఠఏకాదశి మహావైభవంగా నిర్వహింపబడుతుంది. ఈ ఏకాదశికి ముందురోజు అనగా దశమినాటిరాత్రి ఏకాంతసేవానం తరం బంగారువాకిళ్లు మూసేస్తారు. తర్వాత తెల్లవారుజామున వైకుంఠఏకాదశినాడు సుప్రభాతం మొదలుకొని, మరునాడు

## విశేషపూజలు

వైకుంఠఏకాదశినాడు ఉభయనాంచారులతో మలయప్పస్వామి సర్వాలంకారభూషితుడై తిరు వీథుల్లో స్వర్ణరథంపై ఊరేగుతారు. ఆనాడు శ్రీవారిసన్నిధిలో "రాపత్తుతొడక్కం" జరిగి, శ్రీనమ్మాళ్వార్‌వారు సాయించిన "భగవద్విషయం" అనే అపరనామధేయాంకమైన "తిరువాయ్‌మొళి" అనే దివ్యప్రబంధంలోని నాల్గవఆయిరం అధ్య యనం ప్రారంభిస్తారు. వైకుంఠద్వారంద్వారా ఈనాడు వేలకొలదిభక్తులు శ్రీస్వామివారిని దర్శి స్తున్నందున ఈ ఉత్సవాన్ని **"వైకుంఠద్వారస్థ భగవదాలోకనమహోత్సవం"** గా కీర్తిస్తున్నారు. ద్వాదశినాటిచక్రస్నానంతో- తామూ స్నానంచేసి, భక్తులు వైకుంఠఏకాదశీవ్రతఫలాన్ని పరిపూర్ణంగా పొందుతున్నారు.

ద్వాదశిరాత్రి ఏకాంతసేవవరకూ శ్రీవారిగర్భాలయానికి ఆనుకొని ఉన్న ముక్కోటిప్రదక్షిణమార్గాన్ని తెరచి ఉంచుతారు. ఈ ఏకాదశీ, ద్వాదశీ రెండురోజులూ శ్రీవారిదర్శనానంతరం భక్తులు ముక్కోటిప్రదక్షిణ మార్గంలో వెళ్తారు. ఈ ముక్కోటిప్రదక్షిణప్రవేశద్వారాన్ని వైకుంఠద్వార మనీ, ఆ మార్గాన్ని వైకుంఠప్రదక్షిణ మనీ అంటారు.

## వేంకటేశ్వర మంత్రము వెన్నెల

సీ. వెన్నతో నాకబ్బె వేంకటేశ్వర మంత్ర
మన్ని మంత్రంబులిం దావహించె
ప్రహ్లాదుడు జపించె పరగ నృసింహంబు
నారాయణాఖ్యంబు నారదుండు
రావణుతమ్ముండు రామమంత్రము కృష్ణ
మంత్రంబు పాండవ మధ్యముండు
వాసుదేవునిమంత్ర మా సునీతిసుతుండు
శ్రీవిష్ణుమంత్రమ్ము శ్రీశుకుండు

తే. ఇందిరానాథుఁ డే గుఱి యున్న మంత్ర
రాజములు; కిద్దియే పరబ్రహ్మమంత్ర
మమలకృప నాకు గురుడీయ నది లభించె
వేంకటేశ్వరమంత్రంబు వెన్నెల సుమి!

సీ. ఇద్దియే సాధన మిహపరమ్ములకు శ్రీ
వరుని నామమ్ము మాపాలివరము
కలిదోష హరణమ్ము కైవల్యదాయి పా
పవినాశనమ్ము శోభనకరమ్ము
బంధవిమోక్షమ్ము బహుసౌఖ్యదము రమా
రమణునామము సర్వరక్షకమ్ము
స్థాపితధనమిద్ది భూపతినామమ్ము
శ్రీహరి నామమ్ము క్షేమదాయి

ఆ.వె. పరమపావనమ్ము భగవంతు నామమ్ము
హేమరాశి శౌరినామ మిద్ది
నాకు వృషగిరీశు నామమ్ము శరణమ్ము
నిత్యకర్మ మదియె నేమ మదియె.

– శ్రీ ముదివర్తి కొండమాచార్యులు

వైకుంఠఏకాదశీపర్వదినంనాడు ముక్కోటిప్రదక్షిణ మార్గం రంగురంగుల విద్యుద్దీపాలతో, పూలమాలలతో మనోహరంగా అలంకరించబడుతుంది. శ్రీస్వామివారికి అత్యంతసమీపంలో ఉన్న ఈప్రదక్షిణమార్గంలో దర్శనానంతరం వెళ్లినభక్తులు ఒక విశిష్ట ఆశ్చర్యదివ్యానుభూతిని అనుభవిస్తారు.

### వైకుంఠద్వాదశి

వైకుంఠ ఏకాదశి మరునాడు– ద్వాదశి. ఆ రోజు సూర్యోదయవేళ "శ్రీస్వామిపుష్కరిణీతీర్థకోటి" జరుగుతుంది. వైకుంఠఏకాదశినాడు ముల్లోకాల్లో ఉన్న మూడు కోట్ల, యైభై లక్షలపుణ్యతీర్థాలూ, పుష్కరుణులూ తిరుమలలోని 'శ్రీస్వామి పుష్కరిణి'లో దివ్యసూక్ష్మరూపంతో లీనమై ఉంటాయి. అందే సర్వదేవతలూ సన్నిధిచేసి ఉంటారు. కనుక ఈ పండుగరోజు శ్రీవారిఆలయంలో శ్రీవారికి సుప్రభాతం, తోమాలసేవ, అర్చన, నివేదనాదులు యథాశాస్త్రంగా జరుగుతాయి. పిదప ఆనందనిలయంలో ఉన్న 'సుదర్శనచక్రత్తాళ్వార్' పల్లకిని అధిరోహించి, ఊరేగింపుగా తిరుమల తిరువీథుల్లో మహాప్రదక్షిణంగా వచ్చి, శ్రీవరాహస్వామిఆలయప్రాంగణం చేరుకొంటారు. అక్కడ 'చక్రత్తాళ్వార్'కు అభిషేకం జరిగిన తర్వాత పుష్కరిణిలో పవిత్రస్నానం చేయిస్తారు. ఇలా చక్రస్నానం జరిగేసమయంలో అసంఖ్యాకభక్తులుకూడా పుష్కరిణిలో మునిగి, పవిత్రస్నానం చేస్తారు. తర్వాత చక్రత్తాళ్వార్‌కు వస్త్రాలంకారం, నివేదన, హారతులు ఘనంగా నిర్వహిస్తారు. అటనుండి చక్రత్తాళ్వార్‌వారు (సుదర్శనభగవానులు) బయలుదేరి, ప్రదక్షిణంగా వేంచేసి, శ్రీవారిఆలయాన్ని ప్రవేశిస్తారు.

తిరుమల శ్రీస్వామిపుష్కరిణిలో సంవత్సరంలో నాల్గుమార్లు చక్రస్నానం జరుగుతుంది.

1) భాద్రపదశుద్ధచతుర్దశి– అనంతపద్మనాభవ్రతంనాడు.
2) 10 రోజులు జరిగే బ్రహ్మోత్సవాలలో చివరిరోజు.
3) వైకుంఠఏకాదశి మరునాడు ద్వాదశినాటిఉదయం.
4) రథసప్తమినాటిమధ్యాహ్నం.

ఈ నాల్గింటిలో వైకుంఠద్వాదశినాటిఉదయం జరిగే చక్రస్నానంలో భక్తులు అసంఖ్యాకంగా పాల్గొంటారు.

# పాశురమే ప్రభాతం!

- డా॥ ముదివేడు ప్రభాకరరావు

## మంచుకురిసే వేళ

మార్గశిర, పుష్యమాసాలు హేమంత ఋతువు. రాత్రిళ్లు మంచు దట్టంగా కురిసే కాలమది. రాత్రివేళలు నిడివిగా, పగటిపూట కురుచగా ఉంటాయి. అనాదియైన మాయ చేత కప్పబడినజీవులు ప్రతిరాత్రీ విశేషించి, హేమంతఋతువులో సుషుప్తిఅవస్థలోకి తెలియ కనే జారుకొంటారు. 'మమ మాయా దురత్యయా' (గీత-7-14) 'నా మాయను ఎవ్వరూ దాటిపోజాలరు' అని గీతా వాక్యం. దోమతెరలో ముసుగుతన్ని గాఢనిద్రలో ఉంటారు. ఉషోదయానికి పూర్వమే నిద్రలేచి, స్నానం చేసి, స్వామి ఆలయానికి వెళ్లితేనే కదా విన్నపాలు! జీవులది భోగనిద్ర! స్వామిది యోగనిద్ర!! అయితే భక్తులకంటే ముందే యోగ నిద్రాముద్రను వదలి, భక్తజనులను ఉద్ధరించాలని నిలబడి నిరీక్షిస్తున్నాడు శ్రీవేంకటేశ్వరుడు. కన్నతండ్రికి తనబిడ్డలపై గల మమతానురాగాలకు ఏలాంటి విలువ కట్టలేము, స్వామి వారిదయ, రక్షణం అంతులేని క్షీరసాగరం.

తండోపతండాలుగా వస్తున్నభక్తులవిన్నపాలు వింటున్న స్వామివారు సంవత్సరంలో నెలరోజులుమాత్రమే తాను మేల్కోవడమేమిటి? అని చింతించి, అదివరకు ఎన్నో అవతారాలెత్తి ఉన్నా, ద్వాపరయుగంలో జీవులకు మోక్ష మివ్వ గల శ్రీకృష్ణావతారంగా సంపూర్ణంగా ఆవిర్భవించాడు. "మోక్ష మిచ్ఛేత్ జనార్దనాత్"- "మోక్షం కావాలనే కోరికే ఉంటే జనార్దనుణ్ణి ఆశ్రయించండి" అని పెద్దలమాట!

భక్తులకు మోక్షమివ్వగల సామర్థ్యం ఒక్క శ్రీమన్నా రాయణునికే ఉన్నది కాబట్టి, **"నారాయణనే నమక్కే పఱై తరువాన్"** 'నారాయణుడు ఒక్కడే మనకే మోక్షమిస్తాడు' అనే దృఢనిశ్చయంతో గోదాదేవి (ఆండాళ్) తిరుప్పావై తొలి పాశురంలో చెప్పినట్లుగా, వైకుంఠంనుండి పాలకడలికి, పాలకడలినుండి మధురానగరానికి స్వామి అంచెలంచెలుగా దిగి వచ్చి, ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడుగా అవతరించాడు.

## మార్గశీర్షమంటే?

**మాసానాం మార్గశీర్షోఽహం-ఋతూనాం కుసుమాకరః**

అని గీతాచార్యుడైన శ్రీకృష్ణపరమాత్మ నరుడైన అర్జునునికి విభూతియోగం (10-35)లో ఉపదేశించాడు. మాసాలలో నేను మార్గశీర్షాన్ని, ఋతువులలో నేను వసంత ఋతువును. చైత్ర, వైశాఖమాసాలు వసంతఋతువు. మార్గ శిర, పుష్యమాసాలు హేమంతఋతువు.

మానవునిమొత్తం ఆయుర్దాయంప్రకారం చక్కగా ఆలో చిస్తే వసంతఋతువు మానవునియౌవనదశకు, హేమంత ఋతువు మానవునివార్ధక్యదశకు ప్రతీకగా చెప్పవచ్చు. కాల స్వరూపం అనంతమైనది. భగవంతుడు కాలాత్మకుడు. 'తస్మై కాలాత్మనే నమః' అని మహాభారతం. భగ వంతునికి ఏ ఋతువైనా ఒక్కటే! కానీ, మానవునికి వార్ధక్య దశలోనే మోక్షచింతన అంకురిస్తుంది.

మృగశీర్షానక్షత్రం, పౌర్ణమి కలిస్తే మార్గశీర్ష మాస మనబడుతుంది. మార్గ- శీర్ష అనే రెండుసంస్కృత పదాల వికృతిరూపాన్నే 'మార్గళి' అని తమిళంలో వ్యవ హరిస్తారు. జ్యోతిశ్శాస్త్రంప్రకారం **'శరవత్ మృగశిరా త్రయమ్'**. వరుసగా ఉన్నమూడునక్షత్రాలే మృగశిరా నక్షత్రం. *—*—*→ ఇది బాణంఆకారంలో ఉంటుంది. శరమంటే బాణం, నీటిజాలు అని అర్థం. ఇది మార్గళి మాసంలో కురిసేమంచు. సంస్కృతంలో మార్గణం అనే శబ్దానికి వెదకు, యాచించు అనీ అర్థాలున్నాయి. వెదకడం దేనిని? యాచించడం దేనిని? అంటే మోక్షాన్ని వెదకడం, మోక్షాన్ని యాచించడం అని అర్థం. 'మృగశీర్షా' అనే

పేరులో 'మృగ' శబ్దానికి 'వెదకబడేది' అని విశేషార్థం, 'జింక' అని సామాన్యార్థం. మార్గశీర్షంలో 'మార్గమూ', మృగశిరలో 'మృగము', 'మార్గణము' అనే పదము ఇవి మూడూ తెలియనిదారిని వెదకడం అనే అర్థంలో ఉండడం, అందుబాటులో లేని మోక్షాన్ని వెదకడం, అన్వేషించడం అనే అర్థాలలో ఉన్నది. ఈ అర్థంలోనే 'మార్గళి' అని తిరుప్పావై ప్రారంభం కావడంలోని ఔచిత్యం దాగి ఉంది. మోక్ష మార్గాన్ని అన్వేషించేవ్రతం – తిరుప్పావై.

'మార్గశీర్ష'మనే మాటకు, 'తిరుప్పావై' అనే మాటకు అవినాభావసంబంధముంది. ఇవి రెండూ ఒకే అర్థాన్ని, పరమార్థాన్ని ప్రతిపాదించేమాటలు. "మార్గశిరం" అన్నా, "మార్గశీర్ష"మన్నా ఒక్కటే! 'శిర' మే 'శీర్షం'! ఒక విషయానికి 'శీర్షం' పతాకవంటిది. అలాగే దేహానికి 'తల' పతాకాశీర్షిక! అందుకే "సర్వస్య గాత్రస్య శిరః ప్రధానం" అన్నారు.

**'మార్గశీర్ష' మంటే "మోక్షానికి దారిచూపేది" అని అర్థం! మార్గమంటే మోక్షమార్గం!**



**శీర్షం/ శిరం= మోక్షసాధనకై తల ములు సూపుట – మార్గశీర్షం!** (త్రాసులోని ముల్లు బరువెంతో సూచించినట్లు) అక్కడ 'తల' అంటే శిరస్సులోని సంకల్పం. అదే, మార్గ నిర్దేశం చేసేది, దారి చూపేది, మార్గోపదేశిక! **ముముక్షువు లైన జీవులకు మోక్షమార్గనిర్దేశం చేసేమాసమే మార్గశీర్ష మాసం!** పైగా, ఇది ఆరువిధాలైన శరణాగతుల్లో తొట్టతొలి దైన ఆనుకూల్యసంకల్పం. అంటే భగవంతునికి మిక్కిలి ఇష్టమైనకార్యం. అందుకే భగవంతుడు ముముక్షువులకు మోక్షమార్గనిర్దేశం చేసేమార్గశీర్షమాసాన్ని నేను' అని గీతలో అన్నాడంటే తన సంకల్పం, భక్తులమనోభీష్టం రెండూ అను కూలంగా ఉన్నప్పుడే ఆ నెలలో తాను మేల్కొని, ఆయా భక్తులైన మోక్షార్థులను ఉద్ధరిస్తున్నాడని అర్థం. విష్ణుసహస్ర నామభాష్యంలో శ్రీశంకరభగవత్పాదులు 'మార్గః', 'ఓం మార్గాయ నమః' అనే పేర్లకు (365, 397, 398), **'ముము క్షవః తం దేవం మార్గయన్తి ఇతిమార్గః'** (మోక్షార్థులచే వెదక బడువాడు) **పరమానందో యేన మార్గేణ ప్రాప్యతే స మార్గ ఇతి వా** (పరమానందము పొందినవాడు– మార్గుడు) అన్నారు. మోక్షార్థులు ఈ పరమాత్మను తెలుసుకొని, జనన మరణ రాహిత్యరూపమైన మోక్షాన్ని పొందుతున్నారు. కాబట్టి, శ్రీకృష్ణ ఉపాసనమే మోక్షనిర్దేశకం" అని భాష్యం వ్రాశారు. అందుకే **'మార్గశీర్ష వ్రతాన్ని'** భాగవతపురాణం పేర్కొన్నది.

**'తిరుప్పావై' అనే పదంలో –**
**తిరు = శ్రీ, ఐశ్వర్యం, అమృతం, మోక్షం;**
**పావై = వ్రతం, నోము.**

**'అమృతతుల్యమైన మోక్షాన్ని అనుగ్రహించే వ్రతం'** అని 'తిరుప్పావై' శబ్దానికి అర్థం. అదే నిజమైన ఐశ్వర్యం. నిత్య, అనిత్య వస్తువివేకంగలవాడు, ఇహ, పరఫలభోగాలలో వైరాగ్యవంతుడూ, 'శమం' ఆదిగా గల ఆరుగుణాలు గలవాడు, అయిన ముముక్షువు కోరేది మోక్షం! విముక్తి! విడుదల!

## ధనుర్మాస మంటే?

సామాన్యంగా పెద్దలు చెప్పేది మంచు విపరీతంగా మార్గశిరమాసంలో కురుస్తుంది

కాబట్టే, దాన్ని హేమంతఋతువు అన్నారు. ఆ ఋతువులో మనుష్యులు మంచుకు తడిసి, చలికి గడగడ వణుకుతూ వీపు విల్లులాగా వంగిపోగా ఒక మూల ముడుచుకొని పడుకొంటారు. సోమరులై, నిద్రపోతుంటారు. అలాంటివారు తెల్లవారు జామున నిద్రలేచి, స్నానంచేసి, విష్ణుదేవాలయానికి వెళ్లాలనే సంకల్పం కల్గి ఉండడం సాధ్యమా? అందుకే, విల్లులా వంగిపోయిన మానవునివార్ధక్యదశకు సంకేత నామమే 'ధనుర్మాసం' అంటారు- పెద్దలు. జ్యోతిశ్శాస్త్రం ప్రకారం సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించేమాసం ధనుర్మాసం. దీన్నే ధనుస్సంక్రమణం అంటారు.

ప్రకృతిలోని సహజవాతావరణలక్షణాలకు, ద్వంద్వాలకు భయపడి నిద్రపోకుండా జీవుడు 'ధీరుడై' మోక్షగామి కావాలనేదే ధనుర్మాససందేశం! (ఆధ్యాత్మికయోగసాధకుడినే 'ధీరు'డంటారు.)

"ఉపనిషత్తును బలమైన కోదండంగా గ్రహించి, దానిపైన ఉపాసనచే వాడిగా చేయబడిన బాణాన్ని సంధించి, బ్రహ్మచింతన చేస్తున్న మనస్సుతో అల్లెత్రాటిని లాగితే నీవు లక్ష్యాన్ని ఛేదించగలవు" అంటోంది ముండకోపనిషత్తు. ఇదంతా ఏకాగ్రత గల యోగసాధన రహస్యం!

పురుషులు చేయలేనిపనిని భాగవతంలో గోపికలు, తత్పూర్వం కాత్యాయనియైన పార్వతి, 'ఆర్యామహాదేవి'యైన 'ఈశ్వరి'ని ఉపాసించిన రుక్మిణి వీరందరినీ ఆదర్శంగా గ్రహించిన గోదాదేవి, ఆమెచెలికత్తెలు శ్రీకృష్ణపరమాత్మలో లీనమైనారంటే అబలలుగా చెప్పబడినస్త్రీలు సాధించలేని కార్యమంటూ ఈ భూమండలంలో ఏదైనా ఉన్నదా? అని ఆధ్యాత్మికశాస్త్రం పురుషుల్ని ప్రశ్నిస్తూ ఉంది. పురుషులు ఉపనిషత్తులు చెప్పినయోగాన్ని, సాధనచేయాలి! అనింది భగవద్గీత! అందుకే, 'తస్మాత్ యోగీ భవార్జున!" (ఆత్మసంయమయోగం, 6-46) అన్నాడు గీతాప్రవక్త. స్త్రీలకు వ్రతమార్గం, పురుషులకు యోగమార్గం పరమాత్మ నిర్దేశించాడు. ఈ రెండింటికీ పునాది భక్తి శరణాగతి!

శ్రీరంగనాథస్వామి వెలసి ఉన్న శ్రీరంగానికి సమీపంలోనే శ్రీవిల్లిపుత్తూరు అనే శ్రీవైష్ణవదివ్యదేశముంది. శ్రీవిల్లిపుత్తూరుకే 'ధన్వినపురం' అని సంస్కృతనామధేయం.

## అధికారిక వెబ్‌సైట్లలోనే...

**శ్రీవారి దర్శన టిక్కెట్లు,**
**ఆర్జితసేవా టిక్కెట్లు, వసతి గదులను**
**బుక్ చేసుకునేందుకు అధికారికంగా..**
**www.tirupatibalaji.ap.gov.in**
**వెబ్‌సైట్ మాత్రమే ఉంది.**
**తిరుమల తిరుపతి దేవస్థానములకు**
**సంబంధించిన సమాచారం కోసం**
**www.tirumala.org**
**వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.**
**ఈ వెబ్‌సైట్లకు సంబంధించిన**
**సమాచారం, ఇతర వివరాలకోసం**
**తి.తి.దే. కాల్‌సెంటర్ నెంబర్లు**
**0877-2277777, 0877-2233333**
**మరియు తి.తి.దే. టోల్ ఫ్రీ నంబర్లు**
**1800 425 4141, 1800 425 333333**

ఆ క్షేత్రంలోని స్వామి పేరు వటపత్రశాయిపెరుమాళ్. (మఱ్ఱి ఆకుపై పవ్వళించిన పసిబిడ్డ) పాలులేని ఈ పసిబిడ్డ ఒంటరిగా మఱ్ఱాకుపై తెప్పలాగా నీటిపై తేలుతూ ఉన్నాడు. ఇది సృష్టి ప్రారంభంకానప్పటిపరిస్థితి. "తొల్లియును మఱ్ఱాకు తొట్టెలనె యూగె గన చెల్లుబడి నూగీని శ్రీరంగశిశువు" అని అన్నమయ్య, శ్రీరంగనాథుని 'శ్రీరంగశిశువు' అన్నాడు.

కరారవిందేన పదారవిందం ముఖారవిందే వినివేశయంతమ్ ।
వటస్య పత్రస్య పుటే శయానం బాలం ముకుందం మనసా స్మరామి ॥
(2-58)

అని వటపత్రశాయి పెరుమాళ్ల ధ్యానశ్లోకాన్ని లీలాశుకులు శ్రీకృష్ణకర్ణామృతంలో మన కందించారు.

'ధన్వినపురం'లో పుట్టిన గోదాదేవి "ధనుర్మాస వ్రతాన్ని" అనుష్ఠించింది. ఈ 'ధనుర్మాసంలో' యోగనిద్రలో ఉన్న స్వామి మేల్కొని, భక్తుల విన్నపాలు వింటాడని పురా

ణాలు చెబుతున్నాయి. 'ఆషాఢశుద్ధఏకాదశి' నాడు శ్రీమహావిష్ణువు యోగనిద్రలోనికి జారుకొంటాడు. తిరిగి కార్తికశుద్ధ ఏకాదశినాడు మేలుకొంటాడు. నిద్రలోనికి వెళ్లే ఏకాదశిని 'శయనఏకాదశి' అనీ, మేల్కొనే ఏకాదశిని 'ఉత్థానఏకాదశి' అని వ్యవహరిస్తారు. ఈ నాలుగుమాసాలకాలం సన్న్యాసాశ్రమవాసులు 'చాతుర్మాస్య' దీక్షలో ఉంటారు. పురాణకథనం కంటే ముందే శ్రుతిదేవతలు వటపత్రశాయి పెరుమాళ్లకు 'మేలుకొలుపులు' పాడి ఉన్నారు.

*(సంస్కృతభాగవతం స్కం. 10*
*ఉత్తర. అధ్యా. 87శ్లోకాలు1-50)*

జలప్రళయకాలం అంతమైన తర్వాత **ఆ విరాట్పురుషుని నిట్టూర్పునుండి పుట్టిన వేదాధిష్ఠానదేవతలు (శ్రుతిదేవతలు) ఆ పరమాత్ముణ్ణి ప్రతిపాదించే వాక్యాలతో యోగనిద్రలో మునిగి ఉన్న ఆదినారాయణుకి మేల్కొల్పులు పాడారు.**

"ఎల్లప్పుడూ అజేయుడవైన ఓ స్వామీ! నీవు సర్వోత్కృష్టుడవయ్యా! నీకు సర్వదా జయమగుగాక! స్థావర జంగమాలైన ప్రాణులు మునిగిఉన్న అనాదిమాయను నశింపజేయవయ్యా!" **"అనాది మాయయా సుప్తో యదా జీవః ప్రబుధ్యతే"** అని ఉపనిషత్తులు చెప్పాయి. ఏది మొదలో తెలియని మాయచే జీవకోటి సర్వమూ నిద్రలో మునిగిపోతున్నది. ఆ జీవులు మేల్కోవాలంటే ఈ అనాది మాయను నీవు తొలగించాలి.

భౌతికంగా కళ్లుతెరిచి చూడడంకాదు మేల్కోవడమంటే! భగవంతునికి సంబంధించిన ఆధ్యాత్మికజ్ఞానంలో మేల్కోవడమే నిజంగా మేల్కోవడం, ఆ రోజే అసలైన సుప్రభాతం! మంచిరోజు! ఆ శుభదినంకోసమే ఏదో తెలియని ఆరాటాన్ని లోలోపల మూగవేదనగా అనుభవిస్తున్నారు జీవులు. తమను తాము మేల్కొల్పుకోవడమే సుప్రభాత రహస్యం! తమయొక్క ఉనికిని స్వామికి విన్నవించుకోవడమే సుప్రభాతస్తోత్రంయొక్క ఆంతర్యం!

**ప్రణవాన్ని 'ధనుస్సు'గా ధరించి,**
**జీవాత్మను బాణంగా సంధించి,**
**'బ్రహ్మ' మనే లక్ష్యానికి గురిపెట్టి,**
**జాగరూకతతో బాణప్రయోగం చేస్తే-**
**సాధకునిలక్ష్యశుద్ధి సిద్ధిస్తుంది.**
**ఆ సిద్ధియే మోక్షసిద్ధి!!**
**ఇది ధనుర్మాసవైశిష్ట్యం'!**

సృష్టికి ఆదిలోనే సుప్రభాతతత్త్వాన్ని భాగవత **'శ్రుతిగీతలు'** ఆవిష్కరించాయి. ఈ తాత్త్వికసూత్రాన్ని తొట్టతొలిగా పట్టుకొన్న తొండరడిప్పొడి ఆళ్వార్ (క్రీ.శ. 6వ శతాబ్ది) శ్రీరంగనాథునిపై పాడిన 'తిరుప్పళ్లి యెళుచ్చి' అనే పదిపాశురాలు, ప్రకృతిసౌందర్యమనే మాయను జయించిన జీవుని ఆధ్యాత్మికఅనుభూతుల గానం!

**"పాలించి కరుణ చొప్పడ యోగనిద్రc జాలించి శ్రీరంగశాయి మేల్కొనవె!"** అనే ద్విపద, 'అరంగత్తమ్మా! పళ్లియెళుందరుళాయే!' అనే మకుటానికి అనువాదం. 'తిరుప్పళ్లి యెళుచ్చి'ని 33 ద్విపదల్లో తాళ్లపాక అన్నమాచార్యుల మనుమడు, చినతిరువేంగళనాథుడు (చిన్నన్న) పరమయోగి విలాసంలో చక్కగా అనువదించి ఉన్నారు.

తిరుప్పాణ్ ఆళ్వారుల (క్రీ.శ. 7వ శతాబ్ది) 'అమలనాది పిరాన్' అనే పదిపాశురాలు శ్రీరంగనాథుని పాదాది కేశాంతస్తవం. పెరియాళ్వార్ అనబడే విష్ణుచిత్తులవారు (క్రీ.శ. 750) గరుడవాహనారూఢుడై ఆకాశంలో సాక్షాత్కరించిన విష్ణుమూర్తికి తిరుప్పల్లాండు (జయఘోష) అనే మంగళాశాసనం పాడిన మహాభక్తశిఖామణి. ఈయన అడుగుజాడల్లో నడిచిన పెంపుడుకూతురు, ఆండాళ్ (గోదాదేవి) "తిరుప్పావై" అనబడే ఒక విలక్షణ విశిష్టవ్రతాన్ని అవలంబించింది. రోజుకు ఒక పాశురం చొప్పున పాడి, పాలకడలిపై శయనించిన విష్ణుమూర్తి మేల్కొనే ధనుర్మాసంలో, మోక్షసంపదను అనుగ్రహించే వ్రతం (తిరుప్పావై)గా అనుష్ఠించింది. తనవిన్నపాలు విన్నవించి, స్వామిలో లీనమైపోయిన ఒక గొప్పభక్తయోగిని, విదుషీమణి, కారణజన్మురాలు, పదుగురు ఆళ్వారుల జ్ఞానపుత్రిక! జీవులకు మోక్షమార్గాన్ని అనుష్ఠించి చూపిన కరుణామయి గోదాదేవి!

*॥ ఓం శ్రీ ఆండాళ్ తిరువడిగళే శరణమ్ ॥*

# శ్రీమద్భగవద్గీత

1

–విద్వాన్, డా॥ ఈ.జి. హేమంత కుమార్, 94416 45995



**యుద్ధరంగంలో కర్తవ్యవిముఖుడైన అర్జునునికి భగవంతుడు ఆత్మానాత్మవివేకం కలిగించాడు. కర్మ, భక్తి, ధ్యాన, జ్ఞానయోగాలను వివరించాడు. ఒక్క అర్జునుడికే కాదు సమస్తమానవాళికి కలిగే ఎన్నో సమస్యలకు చక్కటి పరిష్కారమార్గంగా అలరారుతున్న శ్రీమద్భగవద్గీత గురించి ఎన్నో అద్భుత విషయాలు ఈ సంచిక నుండీ ప్రారంభం.....**

## 1వ - అధ్యాయం (అర్జున విషాదయోగం)

### అధ్యాయ నామౌచిత్యం

భగవద్గీత సమస్తవేదార్థసారసంగ్రహం. భారతం వేదమైతే వేదసారం భగవద్గీత. భారతంలోని భీష్మపర్వంలోనిది భగవద్గీత. అర్జునునివిషాదయోగంతో భగవద్గీత ప్రారంభమౌతుంది. విషాదం అంటే దుఃఖం, చింత, ఆశలుడుగుట, నిరాశ, ఆశాభంగం, వ్యాకులత, దౌర్బల్యం, కృశత్వం, తెలివిలేమి, స్మృతిలేమి, మనః క్లేశం అని అర్థాలు.

యోగం అంటే కలయిక, కూటమి, ధ్యానం, చిత్తవృత్తినిరోధం, ఇంద్రియనిగ్రహం, జీవాత్మను పరమాత్మలో ఐక్యం చేయటం అని అర్థాలు. దుఃఖం యోగమెట్లా అవుతుంది?

అర్జునుడు యుద్ధం చెయ్యటం అనే కర్తవ్యం నుండి విముఖుడైనాడు. ధనుర్బాణాలు వదలి పెట్టి దుఃఖితుడయ్యాడు. అర్జునుడు మహావీరుడు. కౌరవసైన్యాన్ని ఒక నిమేష మాత్రంలో జయిస్తానని ప్రతిన చేసినవాడు.

కానీ రణరంగంలోకి వెళ్లగానే శత్రుసైన్యంలో ఉన్న స్వజనుల్ని చూచి, వారిని చంపాల్సి వచ్చిందేనని ఆందోళన చెందాడు. దాంతో దుఃఖం, గగుర్పాటు, గద్గదస్వరం, స్మృతిలేక పడిపోవడంవంటి లక్షణాలుకూడా అతడిలో చోటు చేసుకున్నాయి. ఈ లక్షణాలుకూడా తీవ్రభక్తి చిహ్నలే! శ్రీకృష్ణభగవానుడు ఆ లక్షణాలను గుర్తించాడు. ఆ అదను కోసమే ఆయనకూడా నిరీక్షిస్తున్నారు. కనుక అర్జునుడికి జ్ఞానోపదేశానికి ఇదే సరైనసమయం అని భావించాడు. జ్ఞానయోగానికి కావాల్సిన గుణాలన్నీ అర్జునుడిలో కనిపించాయి ఈ మొదటిఅధ్యాయంలోనే. అందువల్లనే విషాదంకూడా యోగమనే చెప్ప బడింది. కాబట్టి ఈ అధ్యాయానికి అర్జునవిషాదయోగం అనేపేరు సార్థకం. ఈ అధ్యాయం చదవడంవల్ల పూర్వ జన్మస్మృతి కలుగుతుంది.

కౌరవ, పాండవసేనలు కురుక్షేత్రరణరంగంలో ప్రవేశించి, ఎదురెదురుగా నిల్చాయి. కురుక్షేత్ర మహాసంగ్రామం ఆరంభం కానుంది. ఆ సమయంలో ధృతరాష్ట్రునికి యుద్ధవార్తలను సంజయుడు ఈ విధంగా నివేదిస్తాడు. ఇక్కడనుండే గీత ఆరంభమైంది.

### ధృతరాష్ట్రుడు అడుగుతున్నాడు

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః ।
మామకాః పాండవాశ్చైవ కి మకుర్వత సంజయ ॥

సంజయా! ధర్మానికి నిలయమైన కురుక్షేత్రంలో యుద్ధం చేయడానికి కుతూహలంతో సమావేశమైనవా వాళ్లూ, పాండవులు ఏం చేశారు?

### సంజయుడు చెబుతున్నాడు

ధృతరాష్ట్రమహారాజా! దుర్యోధనుడు ఆచార్యుడైన ద్రోణునివద్దకు వెళ్లి, భీష్మునిచే రక్షింపబడే తన సైన్యం అపారమైందనీ, ధృష్టద్యుమ్నుని నాయకత్వంలో రక్షింపబడే పాండవసైన్యం పరిమితమైందనీ భావించి, భీష్ముణ్ణి రక్షించటానికి సిద్ధంగా ఉండమని హెచ్చరించాడు.



సరిగ్గా అదే సమయంలో భీష్ముడు రారాజుకు ఉత్సాహం కలిగించటానికి శంఖాన్ని పూరించాడు. తక్కిన వాళ్లందరూకూడా తమతమ శంఖాల్ని పూరించారు. కృష్ణుడు పాంచజన్య మనే పేరుగల తన శంఖాన్ని ఊదాడు. పాండవులు తమ తమ శంఖాలను బిగ్గరగా పూరించారు. తర్వాత అర్జునుడు శ్రీకృష్ణునితో తన రథాన్ని ఉభయసేనలమధ్యలో నిలబెట్టమని కోరతాడు. తండ్రులు, తాతలు, గురువులు, మనుమలు, మిత్రులు, సోదరులు, మేనమామలు, పౌత్రులు, పుత్రులు సర్వవిధాల బంధువులైన అందర్నీ అర్జునుడు తిలకించాడు.

జాలితో నిండిన విషాదంతో అర్జునుడు– "కృష్ణా! వీళ్లందర్నీ చూస్తుంటే వీరితో యుద్ధం చెయ్యాలనే కోరిక నశించింది. వీళ్లను చంపి నేనేం మూటగట్టుకుంటాను? నా మనసు తల్లడిల్లుతోంది. నాలుక ఎండిపోతోంది. దేహం వణకుతోంది. గాండీవం చెయ్యిజారుతోంది. కాళ్లు నిల్వడం లేదు. మనస్సు స్వాధీనం తప్పుతోంది. స్వజనులను చంపటం శ్రేయోమార్గంగా కనిపించటం లేదు. నాకు విజయం వద్దు. రాజ్యం వద్దు. ప్రాపంచికసుఖాలు వద్దు. పురుషులు మరణిస్తే కులస్త్రీలు చెడిపోతారు. నాకు నరకంప్రాప్తిస్తుంది. కనుక కృష్ణా! నేను యుద్ధం చెయ్య"నని ధనువును, బాణాలను పడవేసి, దుఃఖాన్ని పొందిన మనస్సుతో అర్జునుడు రణరంగంలో రథమధ్యంలో చతికిలబడి కూర్చున్నాడని సంజయుడు ధృతరాష్ట్రునికి వివరించాడు.

అర్జునుడు ఈ విధంగా దుఃఖాన్ని పొందినందువల్ల దీన్ని అర్జున విషాదయోగమన్నారు. విషాదంనుండే కదా విచారం పుట్టేది! అర్జునునికి కల్గిన ఈ విషాదమే అతని ధర్మసందేహాల్ని తీర్చి, ఆధ్యాత్మికఉన్నతిని కలిగించింది. కనుక విషాదం యోగానికి మూలం.

## నీ రా జ నం

– శ్రీ ఓలేటి వెంకటసుబ్బారావు

**శ్రీవేంకటేశా! శ్రితపారిజాతా!**
**కరుణించి బ్రోవరా కరుణాంతరంగా!**

**భవబంధనాలెల్ల బాధలను పెంచె**
**భక్తి నమ్మికలెల్ల మృగ్యమై పోయె**
**పంజరపుబ్రతుకే కడురోతగా మారె**
**ఆత్మ కీరమ్మిపుడె స్వేచ్ఛనే కోరె**


**ఏడుకొండలపైన వెలసి ఉన్నావయ్య**
**తరలిరారా తండ్రి! తరలిరమ్మిపుడే**
**నా హృదయమే నీకు నెలవుగా చేసెదను**
**నా తలపు కుసుమాలమాలలే వేసెదను**

**శ్రీదేవిభూదేవి నీచెంతగా చేరి**
**భువనమోహన కడు సొంపార నిలిచేరు**
**మాపైన మెండుగా దయచూపవయ్య**
**నిన్న నేడని కాదు ఏనాటికానాడు**

**సప్తాచలాధీశ శ్రీశ్రీనివాసా**
**కరుణించి బ్రోవంగ కదలిరావయ్య**
**శ్రీవేంకటేశా! శ్రితపారిజాతా!**
**కరుణించి బ్రోవరా కరుణాంతరంగా**
**శ్రీవేంకటేశా..... శ్రితపారిజాతా!**

# దేవాలయాలకు వెళ్దాం పదండి!!

- డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య,
90148 78108



ఈ నేలమీద మానవకృతనిర్మాణాల్లో వాస్తుశాస్త్ర నిబద్ధత, శిల్పకళావైభవం, సౌందర్యశోభ, ఆధ్యాత్మికవాతావరణం రాశీభూతమైన ఒకరమణీయమహాద్భుతనిర్మాణం మనదేవాలయం. అందుకే భారతీయసంస్కృతిలో దేవాలయానికి అంత ప్రాధాన్యం! ఆకాశాన్ని తాకుతున్నట్లుండే ఆలయధ్వజస్తంభం ఉన్నతోన్నతదృష్టినిస్తుంది. ఆలయాల్లో ఉదాత్తమనోహరంగా వినిపించే వేదనాదం విశ్వకల్యాణగీత మనిపిస్తుంది. సమలంకృతదేవతావిగ్రహాలశోభ, పూజావిధానాలవైభవం, వివిధోత్సవాలప్రాభవం నిర్గుణోపాసకుల దృష్టినేకాక, నిరీశ్వరవాదులదృష్టినికూడ ఆకర్షిస్తాయి. ఆలయాల్లో వెల్లివిరిసే ఆధ్యాత్మికతమానవజీవితపరమార్థ సాధనకు మార్గదర్శకంగా ఉంటుంది.

అందుకే దేవాలయాన్ని చూడగానే భారతీయుడిమేను పులకిస్తుంది. హృదయం భక్తిభావంతో పరవశిస్తుంది. శిరస్సు వంగుతుంది. చేతులు నమస్కరిస్తాయి. ఎప్పుడూ కంచం చుట్టూ, మంచంచుట్టూ, ఇంటిచుట్టూ, ఈ నేల చుట్టూ తిరిగే అతనిమనస్సు ఆలయాన్ని ఆలంబనంగా చేసుకొని, ఆకాశాన్నిదాటుకొని, ఆవలి దివ్యలోకాలకు ఎగబ్రాకుతుంది. అందులో కొందరిమనస్సు ఎగబ్రాకి ఎగబ్రాకి, అలోకంబైన పెంజీకటికి ఆవల ఏకాకృతిగ వెలిగేపరమాత్మలో లీనమౌతుంది. మోక్షాన్ని పొందుతుంది.

దేవాలయం మనిషికి పరిశుభ్రతను నేర్పింది. అన్నప్రసాదాలతో మనిషిఆకలిని తీర్చింది. కళావిన్యాసాలతో కనువిందు చేసింది. పామరులకు పురాణపాఠాలు చెప్పింది. హరికథలు వినిపించింది. అందరిచేత హరినామసంకీర్తనం చేయించింది. మానసికఅశాంతులను తగ్గించింది. ఆత్మవిశ్వాసాలను పెంచింది. ధర్మమార్గాన్ని చూపింది. వివిధవర్గాలను ఒకత్రాటిమీదికి తెచ్చింది. పరస్పరసహకారభావస్ఫూర్తికి, జీవితపరమార్థసాధనకు విశేషంగా దోహదంచేసింది. అన్నింటినిమించి హైందవాన్ని ఒకమతంగా కాక, భారతీయుని జీవనవిధానంగా రూపొందించింది. మనజీవితాన్ని ప్రభావితం చేస్తూ, మానవుడు ఉన్నతోన్నతస్థితిని అందుకోవటానికి బలమైన ఆలంబనంగా నిలిచేదేవాలయాన్ని ప్రతి భారతీయుడు దర్శించాలి. దేవుణ్ణి భక్తిభావంతో పూజించాలి. దేవాలయసందర్శనం, దైవపూజ అతనిజీవితంలో భాగం కావాలి. ఒకదైనందిన కార్యక్రమంగా రూపొందాలి. అందుకే మన దేశంలో ఊరూరా దేవాలయాలు! వీథివీథికీ దేవాలయాలు!

మహాద్రష్టలైనభారతీయమహర్షులదృష్టిలో అగుపించే ఈజగత్తంతా పరమాత్మవ్యక్తరూపం. విశుద్ధవిశ్వచైతన్య శక్తి పొందినవికారం. "ఏకో విష్ణుః మహద్భూతం పృథగ్భూతా న్యనేకశః" మొదలైన వేదవాక్యాలన్నీ ఏకత్వం పొందినఅనేకత్వాన్ని తెలియచేప్పేవే! విశ్వవ్యాప్తవిశుద్ధచైతన్య శక్తి సగుణమై వివిధపదార్థరూపాన్ని పొందినవైనాన్ని వివరించేవే!

అందువల్ల, భారతీయులదృష్టిలో అన్నింటా అంతటా నిండి ఉండేది ఆపరమాత్మే! 'ఇందు గలఁ డందు లేఁడని సందేహము వలదు, చక్రి సర్వోపగతుండు' అని అనటంలోని అంతరార్థంకూడ ఇదే! అందుకే భారతీయులు వేపచెట్టుక్రింద బొట్లు పెట్టి నిలబెట్టినరాతిబొమ్మను మొదలు, కైలాసశిఖరంమీది ఆత్మలింగందాకా; గాటి గుంజకు కట్టి ఉంచినగోవును మొదలు, దేవలోకంలోని కామధేనువుదాకా; పుట్టలో ఉన్న నాగుపామును మొదలు, విష్ణులోకంలోని ఆదిశేషునిదాకా అన్నింటినీ దైవస్వరూపాలుగా భావిస్తున్నారు. ఎవరికి ఇష్టమైన దైవస్వరూపాన్ని వారు పూజిస్తున్నారు.

అందుకే హైందవంలో బహుదేవోపాసన; రకరకాల పూజావిధానాలు!

భగవదారాధనవిషయంలో హైందవం వ్యక్తి కిచ్చిన స్వేచ్ఛ ప్రపంచంలో ఏమతమూ ఎవ్వరికీ ఇవ్వలేదని అనిపిస్తుంది.

పైగా, బహుదేవోపాసనకు పరమార్థంగా హైందవం ఒక పరమసత్యమైనమాట చెప్పింది. ఆకాశంనుండి పడిననీరు ఏ విధంగా చివరకు సముద్రాన్ని చేరుకుంటుందో, అదే విధంగా మనం ఏ దేవుడికి నమస్కరించినా, ఆ నమస్కారం చివరకు పరమాత్మను చేరుతుం దని చెప్పింది.

**ఆకాశాత్పతితం తోయం । యథా గచ్ఛతి సాగరమ్**
**సర్వదేవనమస్కారః । కేశవం ప్రతిగచ్ఛతి ॥**

భారతీయుల సువిశాలదృష్టికి, సమన్వయదృష్టికి ఇది ధ్వజప్రాయమైనమాట.

అంతేకాదు. భగవద్భక్తుడు ఎవరైనా సరే ఎంత నిరుపేద అయినా సరే తాను భగవంతునికి విలువైన కానుకలు సమర్పించుకోలేననో, గొప్పగొప్పగా ఖర్చుపెట్టి విశేషసేవలు చెయ్యలేననో న్యూనతాభావాన్ని పెంచుకో నక్కర లేదు; బాధపడ నక్కరలేదు. సాక్షాత్తు శ్రీకృష్ణభగవానుడే

**పత్రం పుష్పం ఫలం తోయం । యో మే భక్త్యా ప్రయచ్ఛతి**
**తదహం భక్త్యుపహృత । మశ్నామి ప్రయతాత్మనః॥ (గీత- 9-26)**

అని అర్జునునితో చెప్పాడు. పరిశుద్ధమైనమనస్సుతో, పరమభక్తితో ఒక ఆకు నిచ్చినా, పువ్వు నిచ్చినా, పండు నిచ్చినా, కడకు కొంచెం నీళ్ళిచ్చినా పరమాత్మ స్వీకరిస్తాడట! అందువల్ల దేవాలయానికి వెళ్ళే భక్తునికి ఉండవలసింది పరిశుద్ధమైన మనస్సు, పరిపూర్ణమైనభక్తేకాని, ధనకనక వస్తుసమూహాలు కాదు.

భారతీయుడు ఏ దేవాలయానికైన వెళ్ళవచ్చు. ఏదేవతామూర్తినైన పూజించుకోవచ్చు. తనమనస్సును అర్పించుకోవచ్చు.

హైందవంలో విగ్రహారాధన ఒక విశేషం. ఇది కూడ కొందరివిమర్శకు తావిచ్చినఅంశమే.

విగ్రహం పరమాత్మకు ప్రతీక. నిర్గుణుడు, నిరాకారుడు, విశ్వవ్యాపి అయిన పరమాత్మను మహాయోగులు దర్శించగల రేమోగాని, సామాన్యులు దర్శించలేరు. మహాయోగులు అర్చించి, తరించగలరేమోగాని, సామాన్యుల కది సాధ్యం కాదు. అట్లని సామాన్యులకు ముక్తే అక్కరలేదా?



వాళ్ళు ఈ జన్మపరంపరలో చిక్కుకొని– జననమరణాలతో, సుఖదుఃఖాలతో, అలజడులతో, అశాంతులతో సతమతమౌతూ జీవితం సాగించవలసిందేనా? వాళ్లల్లో అంతర్లీనంగా ఉన్న ఆధ్యాత్మికశక్తి నిరర్థకంగా ఉండి పోవలసిందేనా? తక్కినప్రాణుల్లా వాళ్ళజీవితాలు తినటానికి, కనటానికి, మరణానికిమాత్రమే పరిమితమై పోవలసిందేనా?

అలా కాకుండ, వాళ్ళమనస్సులు పరమాత్మస్వరూపంగా భావించి, విగ్రహాలమీద లగ్నం కావటానికి, క్రమక్రమంగా వాళ్ళలోని ఆధ్యాత్మికశక్తి ఆవిష్కృతమై ఐహికంగా చిత్తశాంతిని పొందటానికి, సగుణోపాసననుండి నిర్గుణోపాసనకు చేరుకొని, ఆముష్మికంగా మానవజీవిత పరమార్థమైనమోక్షాన్ని పొందటానికి హైందవసంస్కృతి రూపొందించినవే మహిమాన్వితాలైనదేవాలయాలు! మహాశక్తిసంపన్నాలైన విగ్రహాలు!

విగ్రహా లంటే విశేషంగా గ్రహించేవి మనస్సును, దైవశక్తిని విశేషంగా గ్రహించేవి. ఆధ్యాత్మికంగా మనిషి అత్యున్నతంగా ఎదగటానికి అద్భుతంగా ఉపకరించేది దేవాలయం అయితే ప్రాపంచికవిషయాలచుట్టూ పరిభ్రమించే మనస్సు పరమాత్మను చేరుకోవటానికి ఆలంబనంగా నిలిచే అద్భుతదివ్యసాధనం విగ్రహం.

పంచవిధభగవత్స్వరూపాల్లో అర్చాస్వరూపం విగ్రహం. అందుకే మనం అర్చామూర్తి అయిన విగ్రహాన్ని పూజిస్తున్నాము.

కాగా, ఆధ్యాత్మికకేంద్రాలు, మహిమాన్వితాలైన దేవాలయాలను ఎక్కడంటే అక్కడ నిర్మించకూడదు. ఎలాగంటే అలా నిర్మించకూడదు. అలాగే, పరమాత్మకు ప్రతీకలు మహాశక్తి సంపన్నాలైన దేవతావిగ్రహాలనుకూడ దారు, శిలా, లోహ, సుధారూపాల్లో ఎలాగంటే అలా తయారుచేయకూడదు. ఎలా పడితే అలా ప్రతిష్ఠించకూడదు.

అనేకభౌగోళిక, గ్రహ, నక్షత్ర దైవికాంశాలను దృష్టిలో ఉంచుకొని – నిర్మాణాలకు సంబంధించిన అనేకానేకాంశాలను సూక్ష్మంగా, సమగ్రంగా పరిశీలించి, మనమహర్షులు వాస్తుశాస్త్రశిల్పశాస్త్రాలను రూపొందించారు. వాటిలో కాశ్యపశిల్పశాస్త్ర, మయమత, మానసారవాస్తుశాస్త్రాలు అతి ప్రసిద్ధాలు. ఈ మూడింటిని పండితులు రత్నత్రయంగా పేర్కొంటారు.

మనవాస్తుశిల్పశాస్త్రాలు దేవాలయాలకు ఏలాంటి స్థలాలను ఎంపిక చేయాలో, ఏయే పరీక్షలు జరిపి స్థలాన్ని స్థిరీకరించాలో, శంకుస్థాపనలు ఎలా చేయాలో, ఎన్ని అంతస్తుల దేవాలయాన్ని ఎలా నిర్మించాలో, ఆలయగర్భగుడిని, విమానాన్ని ఎలా రూపొందించాలో, ఆలయస్తంభాల ప్రమాణాలు ఎలా ఉండాలో, ఏయే కొయ్యలను, రాళ్లను ఎలా అతికించాలో, స్తంభప్రతిష్ఠలు ఎలా జరగాలో, ఆలయానికి బలము, రక్షణ, శోభ కలుగటానికి, పరివారదేవతలను నిలుపటానికి ప్రాకారాలు ఎలా నిర్మించాలో అన్నింటిని మించి వివిధవిగ్రహాలప్రమాణాలు, లక్షణాలు, మూర్ధాది పాదపర్యంతం అవయవాలకొలతలు, అంతేకాక విగ్రహాలకు అమర్చేఆభరణాలప్రమాణాలు ఎలా ఉండాలో– స్పష్టంగా నిర్దేశించాయి. అన్నిదేవాలయాలు, అన్నివిగ్రహాలు ఆయా శాస్త్రనియమాలప్రకారం ఉండవలసిందే! విశేషించి విగ్రహప్రతిష్ఠ ఒకగొప్పఆగమప్రక్రియ. మంత్రపూతంగా, యంత్రసహితంగా, ఆగమోక్తపద్ధతిలో వివిధపూజలతో, హోమాలతో విగ్రహప్రతిష్ఠలు జరగాలి.

అందుకే మనదేవాలయాలు మహిమాన్వితాలు; విగ్రహాలు శక్తిసంపన్నాలు.

**మానవోద్ధరణ కేర్పడిన మనదేవాలయాలను** మనం పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వాటిపవిత్రతను కాపాడుకోవాలి. కాలక్రమేణ శిథిలమైతే వాటిని మనమే పునర్నిర్మించుకోవాలి. ఆయా దేవాలయాల పౌరాణిక, చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక విశేషాలేమిటో తెలుసుకోవాలి. పదిమందికి తెలియచెప్పాలి. అన్నిదేవాలయాలకు వెళ్లాలి. పుష్కరుణుల్లో, పుణ్యనదుల్లో స్నానాలు చేయాలి. దేవతామూర్తులను పూజించాలి. అంతర్గతంగా ఉన్నఆధ్యాత్మికశక్తిని ఆవిష్కరించుకోవాలి. ఐహికంగా మానసికప్రశాంతతను, ఆముష్మికంగా ఉన్నతోన్నతస్థితిని పొందాలి.

*ఆలయాలకు వెళ్దాం పదండి...!!*



# కావ్యమొక్కటే.. విశేషాలెన్నో...

- శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు,
99896 79681

కర్కటే పూర్వఫల్గున్యాం తులసీకాననోద్భవామ్ ।
పాండ్యే విశ్వంభరాం గోదాం వందే శ్రీరంగనాయకీమ్ ॥

పెరియాళ్వారుల దివ్యవంశం అనే నందనవనంలో కల్పలత వంటిదీ, శ్రీరంగనాయకస్వామివారితో హరి చందనంలా జంటగా కనపడేదీ, గొప్పతనం మూర్తీభవించి అవతరించిందీ, కరుణప్రకర్షమున మరొక కమలా (శ్రీ)దేవి లాంటిదీ అయిన గోదాదేవికి వందనాలు.

నీలాదేవి ఉన్నతస్తనాలనే కొండచరియలలో హాయిగా నిద్రించే శ్రీకృష్ణుణ్ణి మేలుకొలిపినతత్త్వాన్ని తిరుప్పావైలో బోధించింది గోదాదేవి. తాను ముడిచివదలిన పూలమాలలు సమర్పించి, పెరుమాళ్లను తనవశం చేసుకుని ఆనందానుభూతిని పొందింది గోదాదేవి. అలాంటి **ఆముక్తమాల్యద**కు అభివందనాలు.

ఆండాళమ్మవారిని అష్టోత్తరశతనామాలతో అర్చిస్తాం. అయితే కోదై, గోదా, శూడికొడుత్త నాచ్చియార్, ఆముక్తమాల్యద, ఆండాళ్ అనేపేర్లు బాగా ప్రాచుర్యం పొందాయి. తమిళంలో **కోదై** అంటే పూలదండ అని అర్థం. ఆ శబ్దాన్నే **గోదా** అని సంస్కృతీకరించారు. భూమిని **గో** అంటారు. ఆండాళమ్మ భూదేవిఅంశ. కాబట్టి ఆమెకు గోదా అనేపేరు కలిగిందనికూడా వ్యవహారంలో ఉంది. పెరియాళ్వారులు తయారుచేసిన పూలమాలలను ఆండాళమ్మ ముందుగా తాను ధరించి, ఆ తర్వాత ఆ పూలదండలను (పెరియాళ్వారులద్వారా) స్వామికి సమర్పిస్తుంది. ఈ గాథను దృష్టిలో ఉంచుకుని ఆమెకు **శూడికొడుత్త నాచ్చియార్** అనే వ్యవహారం కలిగింది. తమిళంలోని శూడికొడుత్త నాచ్చియార్ అనే పేరుకు సంస్కృతీకరణరూపం **ఆముక్తమాల్యద.** గోదాదేవిని 'ఆముక్తమాల్యద' అని మొట్టమొదట పేర్కొన్నవారు అనంతాచార్యులవారు. వీరు రామానుజులవారికి శిష్యులు. అనంతాచార్యులవారు రచించిన ఆళ్వారాచార్యుల గాథలను తెలిపే **ప్రపన్నామృతం** అనే గ్రంథంలో 'ఆముక్త మాల్యద' అనే పేరు ఉంది. ఆ పేరున్న శ్లోకం -

ఆముక్తమాలికా యేన విష్ణవే గోదయార్పితా
ఆముక్తమాల్యదా నామ తస్యా స్తే నాభవ ద్భువిః.
- ప్రపన్నామృతం-ప్రథమభాగం-19 అధ్యా-37 శ్లోకం.

పై శ్లోకంలోని ఆముక్తమాల్యద అనే పేరును శ్రీకృష్ణదేవరాయలవారు యథాతథంగా స్వీకరించి, తన కావ్యానికి నామకరణం చేశాడు.

రాయలవారు రచించిన ఆముక్తమాల్యద తెలుగు పంచమహాకావ్యాలలో ఒకటి. కథానాయికపేరు కావ్యానికి పెట్టిన తొలితెలుగుకావ్యం రాయలవారి ఆముక్తమాల్యద. ఆళ్వారుల (పెరియాళ్వారులు, ఆండాళ్) గాథలను అందించిన తొలితెలుగు ప్రబంధం ఆముక్తమాల్యద. విశిష్టాద్వైత సిద్ధాంతానుగుణమైన తొలితెలుగుకావ్యం ఆముక్తమాల్యద. కావ్యాశ్వాసాంతాన గద్యానికి బదులు పద్యంలో కవి తన వివరాలు తెలిపిన తొలితెలుగుకావ్యం ఆముక్తమాల్యద. ఏడుకొండలవాడయిన **వేంకటభర్తకు** అంకితమీయ బడిన తొలితెలుగుకావ్యం ఆముక్తమాల్యద.

ఆముక్తమాల్యదను రచించిన కృష్ణదేవరాయలవారు తనజీవితకాలంలో ఏడుకొండలలో వెలసినస్వామివారిని ఏడుపర్యాయాలు దర్శించుకున్నారు. (శాసనాధారాల ప్రకారం) ఏడవ పర్యాయం (క్రీ.శ.1524) నాటికి ఆముక్త

మాల్యదను పూర్తిచేసి, ఏడుకొండలస్వామివారైనవేంకట భర్తకు అంకితం ఇచ్చాడు. 'ఏడుకొండలవాడు', 'ఏడుపర్యా యాలదర్శనం' వీటన్నింటినీ పరిశీలించే కాబోలు ఆరు ఆశ్వాసాలుగా రచితమైన ఆముక్తమాల్యదను కొందరు ఏడు ఆశ్వాసాలుగ చేశారని ఒకభావన.

పూలమాలను పెరుమాళ్లకు సమర్పించిన వృత్తం (చరిత్ర) కలిగిన కావ్యం కాబట్టి, రాయలవారిఆముక్త మాల్యదప్రారంభంలో రాయలవారు **శ్రీకమలావధూటి** అనే ఉత్పల **మాలావృత్తాన్ని** రచించారు సందర్భోచితంగా, ప్రతీకా త్మకంగా.

ఆముక్తమాల్యదలో వైష్ణవకవిత్రయగాథ రచితం, ఆకవిత్రయం పెరియాళ్వారు, గోదాదేవి, యామునా చార్యులు. పెరియాళ్వారులు తిరుప్పల్లాండు, పెరియ తిరుమొళి మొదలైనవీ; గోదాదేవి నాచ్చియార్ తిరుమొళి (143 పాశురాలు), తిరుప్పావై (30 పాశురాలు); యామునా చార్యులు స్తోత్రరత్నం, సిద్ధిత్రయి, ఆగమప్రామాణ్యం, గీతాభాష్యం రచించారు.

**మాసానాం మార్గశీర్షోஉస్మి** అని గీతాచార్యులు శ్రీకృష్ణులవారిమాట. మార్గశీర్షం / ధనుర్మాసం 30 రోజులు గోపికలు కాత్యాయనీవ్రతం చేసి, తమకోరికమేరకు శ్రీకృష్ణణ్ణి పొందారు. గోదాదేవి తిరుప్పావైలోని ముప్పై పాశురాలనూ ధనుర్మాసంలో పారాయణం చేయడం వైష్ణవ సంప్రదాయం. తిరుమలలోకూడ ధనుర్మాసంలో ఆండాళ్ తల్లి రచించిన తిరుప్పావైని పారాయణం చేస్తారు.

భగవద్రామానుజులవారు శ్రీవిశిష్టాద్వైతాన్ని ప్రచారం చేసి, ఒకనూతనాధ్యాయాన్ని ప్రారంభించారు. రామానుజులవారు తిరుప్పావై పాడేవారు. తిరుప్పావై రచించిన ఆండాళమ్మవారు మొక్కుకున్న మొక్కును ఆమె తీర్చలేకపోతుంది. ఆమెమొక్కును యతిరాజులవారు తీరుస్తారు. రామానుజులవారికి **తిరుప్పావైజీయర్** అనే పేరు కలిగింది. గోదమ్మతిరుప్పావైమీద **యతిరాజముద్ర** ఉండడం కూడ తిరుప్పావై ప్రాచుర్యానికి గల కారణాలలో ఒకటి అని భావించడం సత్యదూరం కాదు.




గోదాదేవిరచనలను ఉపనిషదాదిసర్వగ్రంథాల సారంగా అన్వయం చేస్తూ ఎన్నో వ్యాఖ్యానాలు వెలువడ్డాయి.

రాయలవారిఆముక్తమాల్యదకథకు మూలగ్రంథాలు గరుడవాహనపండితబిరుదాంకితుడగు శ్రీనివాసదీక్షితులు రచించిన దివ్యసూరిచరితం, అనంతాచార్యులవారు రచించిన ప్రపన్నామృతం కాగా విష్ణుపురాణం, నాలాయిరదివ్య ప్రబంధం- ముఖ్యంగా నాచ్చియార్తిరుమొళి, విష్ణుచిత్తుల వారి పెరియతిరుమొళి గ్రంథాలలోని కొన్నిపాశురాలలోని భావాలు రాయలవారు గ్రహించి, వినూత్నపథంలో పద్యాలు రచించి, ఆముక్తమాల్యదకు నిండుదనం కలిగించారు.

రాయలవారి ఆముక్తమాల్యదవంటి ప్రౌఢప్రబంధం ఇదివరలో లేదు, ఇప్పుడూ లేదు, ప్రస్తుతపరిస్థితులను గమనిస్తే ఇకమీదటకూడా రాదు. అదీ ఆముక్తమాల్యద ప్రత్యేకత!

**స్వోచ్ఛిష్టమాలికాబంధగంధబంధురజిష్ణవే**
**విష్ణుచిత్తతనూజాయై గోదాయై నిత్యమంగళమ్.**

# దుఃఖాలను దాటాలంటే...

- శ్రీ డి.వి.ఆర్.భాస్కర్,
99121 99394

మనం పూజించే ప్రతిదైవం, తలచే ప్రతినామం అన్నీకూడా సర్వదేవతల సమన్వయమే! ఈ జగత్సత్యం మన మనస్సులలో నాటుకునేందుకే విశ్వశాంతి కోరే మహర్షులు 'సహస్రనామాలు' చెప్పారు. మన ఇష్టదైవానికి సంబంధించిన నామాలను సాధ్యమైతే ప్రతినిత్యం లేదా సంవత్సరంలో ఆయా దేవతలకు సంబంధించినమాసంలో, లేదా వారంలో, ఆయా దేవతలకు ప్రీతిపాత్రమైనరోజున స్మరించడంవల్ల ఇష్టదైవఅనుగ్రహం కలుగుతుందనడంలో సందేహం లేదు.

భగవంతుడు సాక్షాత్తూ విష్ణుస్వరూపుడు. కాబట్టి నదులన్నీ కలిసేది సముద్రంలోనే అన్నట్లుగా మనం ఏ దేవునికి నమస్కారం చేసినా అది ఆ శ్రీమన్నారాయణునికే చెందుతుందని పురాణాలు పేర్కొంటున్నాయి. మార్గశీర్ష మాసం విష్ణువుకు ప్రీతిపాత్రమైన మాసం కాబట్టి ఈ మాసం రోజులూ విష్ణుసహస్రనామపారాయణం చేస్తే విశిష్టఫలితాలు కలుగుతాయి.

"ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే" అన్నాడు శ్రీకృష్ణభగవానుడు. అంటే ధర్మం ఎక్కడుంటే అక్కడ తానుంటానన్నాడు కాబట్టి విష్ణువును స్థితికారుడనీ, సమస్తప్రాణులనూ రక్షించేవాడనీ, ఉపనిషత్తులు పేర్కొంటున్నాయి. విష్ణువు అంటే విశ్వమంతా నిండినవాడని అర్థం.

ఈ సృష్టిలో అత్యుత్తమములైనవిగా పేర్కొనగలిగి నటువంటి జ్ఞానం, అమరత్వం, వాత్సల్యం, సౌశీల్యం మొదలైన సమస్తసద్గుణాలూ, నవరసభరితాలైన వస్తువాహనాభరణాలూ, రాజోపచారాలూ, దైవోపచారాలూ, సమస్తసదాచారాలకు ఆధారభూతమైన చిత్తవృత్తివంటి నశించని సంపదలన్నింటికీ శ్రీహరే ఆధారభూతుడు.

సమస్తదేవగణాదులలోనూ విష్ణువుకంటే మిన్న అనదగ్గవాడు ఏ విధంగా లేడో, అదేవిధంగా 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరిమంత్రంకంటె అధికమైంది లేదు. మంత్రపుష్పం అంతా విష్ణుమయమే!

సర్వత్రా వ్యాపించి ఉన్న ఆ విష్ణుభగవానునివిశేషాలు తెలిపేవే విష్ణుసహస్రనామాలు. ఈ నామాలన్నీ విశ్వవ్యాప్తమైన ఆయనశక్తినీ, అనంతమైన ఆయనలీలలనూ తెలియచేస్తూ, మనం ఏ రూపంలో భగవంతుడిని కొలిచినా దేవుడొక్కడే అనే భావనను కలుగ చేస్తాయి.

'విశ్వం విష్ణు ర్వషట్కారో.....' అంటూ ఆరంభమయ్యే విష్ణుసహస్రనామస్తోత్రపారాయణం విశేషమైన ఫలితాలు ఇస్తుందనడంలో సందేహం లేదు.

లక్షలాదిమంది భక్తులను తనదివ్యబోధలద్వారా, మహిమలద్వారా ప్రభావితం చేసిన ఎందరో మహాత్ములు తమభక్తులను విష్ణుసహస్రనామపారాయణ చేయండని ఉపదేశించడం అందరికీ తెలిసిందే!

## పురుష సూక్తం

పురుషసూక్తంలో ధ్రువుడు విష్ణుమూర్తిని 'సహస్ర శీర్షా పురుష స్సహస్రాక్ష స్సహస్రపాత్... మనోరథో నాథ సఫల స్స త్వయాకృతః, తపశ్చ తప్తం సఫలం యద్ద్రుష్టోஉసి జగత్పతే' అని స్తుతించాడు. అంటే వేయిశిరస్సులు, వేయి కన్నులు, వేయిచేతులు, వేయిపాదాలు గలవాడివి, విశ్వవ్యాపివి, భూమ్యాకాశాలుకూడా నిండిపోయి, ఇంకా పది అంగుళాలపైన విస్తరించినవాడివి, పుట్టనిది, పుట్టబోయేది అవతారం దాల్చనున్నది నీవే కదా పురుషోత్తమా!

అంతా నీ విరాట్‌రూపంనుంచే, నీతత్వం నుంచే ఏర్పడింది. వాసుదేవా! ఈ సర్వభూతాత్మకజగత్తు యావత్తూ నీరూపం ధరించిందే! ఋక్కులు, సామములు, ఛందోరీతులు ఉద్భవించింది నీయందే! నిజానికి నీలో లేనివేవి? అన్నీ నీవే! అంతా నీవే! నీనుంచి సర్వం, ఆ సర్వంనుంచి నీవు ఆవిర్భవించారు. సర్వాత్మకుడవైన నీకు ప్రణామాలు, సర్వజీవుల మనోరథము ఎరిగినవాడవు.

నా కోరిక ఏదో, అది నీవల్లనే సఫలం అయి తీరుతుంది. నా పూజలు ఫలించాలంటే నీ దర్శనభాగ్యం కావాలి' అని స్తోత్రం చేయడంతో మిక్కిలి సంతోషించిన శ్రీమహావిష్ణువు ధ్రువునికి నక్షత్రమండలంలో శాశ్వతస్థానం కల్పించిన సంగతి తెలిసిందే!


అందుకే 'అనాదినిధనం విష్ణుం సర్వలోకమహేశ్వరమ్, లోకాధ్యక్షం స్తువన్నిత్యం సర్వదుఃఖాతిగో భవేత్' అంటే 'ఆది మధ్యాంతాలు లేనివాడు, వికారరహితుడు, బ్రహ్మాదిదేవతలకు ప్రభువు, సర్వలోకాలకు నియామకుడు, సర్వవ్యాపకుడు అయిన శ్రీమహావిష్ణువును నిత్యం స్తోత్రం చేయడంవల్ల అన్నిదుఃఖాలను అవలీలగా దాటగలం.

## శుభఫలితాల సమాహారం



మహాభారతంలో అంపశయ్యపై శయనించి ఉన్న భీష్ముడు ధర్మరాజాదులకు బోధించిన దివ్య స్తుతులే విష్ణుసహస్రనామాలు. వీటిని అనునిత్యం స్మరించడం వల్ల అన్నికష్టాలు తీరిపోయి, సుఖసంపదలు కలుగుతాయని పురాణోక్తి.

కాబట్టి, ఈ మాసంలో వీలున్న ప్రతిఒక్కరూ ఇంటిదగ్గర కానీ, ఆలయంలో కానీ, వ్యక్తిగతంగా లేదా సామూహికంగా విష్ణుసహస్రనామపారాయణ చేయడంవల్ల అన్నిదుఃఖాలు తొలగి, అమోఘమైన ఫలితాలు కలుగుతాయి. విష్ణువు ఎక్కడ ఉంటే లక్ష్మి అక్కడ నివసిస్తుంది. ఆయనపరివారం సరేసరి! ఫలితంగా అనేకానేకశుభాలు చేకూరుతాయి.



# శ్రీవారిసన్నిధిలో... అధ్యయనోత్సవం

**- డా॥ చిలకపాటి విజయరాఘవాచార్యులు**

సప్తగిరీశసార్వభౌములైన శ్రీవేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో మున్నూటఅరవైరోజులు నిత్యబ్రహ్మోత్సవ సదృశమైన ఆధ్యాత్మికపారమ్యమే! దాదాపు వేయేండ్లనాడు భగవద్రామానుజాచార్యులవారు ఏర్పరచిన నిత్య, పక్ష, మాస, వార్షిక, విశేష బ్రహ్మోత్సవ సంరంభాలే తిరుమలగిరు లంతటా ప్రతిబింబిస్తూంటాయి, ప్రతిధ్వనిస్తూంటాయి. వాటిలో అధ్యయనోత్సవం ఒకానొక మనోహరమైన దివ్య ప్రబంధానుసంధాన పూర్వకమైన భవ్యపరీమళం.

సాధారణంగా తమిళభాషలో రచింపబడి, గానం చేయబడ్డ పాశురాలను 'దివ్యప్రబంధం' అంటారు. ఇది 'నాలాయిరం'-అంటే నాలుగువేలు. శ్రీవైష్ణవదేవాలయాలలో దివ్యప్రబంధాన్ని ఆయా సమయాల్లో గానం చేస్తారు. అలా గానం చేయబడే క్షేత్రాలను 'దివ్యక్షేత్రాలు'గా భావిస్తారు. ఇలాంటివి మొత్తం 108గా గుర్తించారు.

ప్రపన్నజనకూటస్థులైన శ్రీనమ్మాళ్వార్ల పరమ పదోత్సవాన్ని అధ్యయనోత్సవమనీ, వైకుంఠోత్సవమనీ, ప్రపన్నోత్సవమనీ, మోక్షోత్సవమనీ పిలిచినా, తిరుమలలో మాత్రం దీన్ని అధ్యయనోత్సవమని మాత్రమే వ్యవహరి స్తారు. తిరుమల శ్రీవారిసన్నిధిలో శ్రీభాష్యకారుల ప్రతినిధిగా పెద్దజీయంగార్‌స్వామివారు, వారికి అధీనులుగా చిన్నజీయం గార్‌స్వామివారు తమ ఏకాంగుల తోడ్పాటుతో ఈ దివ్య ప్రబంధ అనుసంధానాది కైంకర్యాలను నిత్యమూ సమర్పి స్తూంటారు. నాలుగువేలపాశురాలతో శోభిల్లే దివ్యప్రబంధం నాలుగు విభాగాలుగా విస్తరించి ఉంది. ఈ సంపూర్ణ దివ్యప్రబంధపారాయణానికే అనగా సంపూర్ణద్రావిడవేదాధ్య యనానికే "అధ్యయనోత్సవం" అని ప్రసిద్ధి. శ్రీనమ్మాళ్వార్ల జన్మ / అవతరణ స్థలం ఆళ్వారు తిరునగరి. తిరుమంగై ఆళ్వార్ (పరకాలన్) అనే మహానుభావులు ఆ ఊరిలో నమ్మాళ్వార్ల విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ఆ ఉత్సవమూర్తిని శ్రీరంగానికి పల్లకీలో వేంచేపు చేసుకొని వచ్చి, శ్రీరంగనాథ స్వామివారి శ్రీసన్నిధిలో వైకుంఠఏకాదశి మొదలు పది రోజులపాటు తిరువాయ్‌మొళిని అనుసంధానం చేసినట్లు, అప్పటినుండి అధ్యయనోత్సవం ఆరంభమైనట్లు పూర్వాచార్య పరంపర. ఇక ఉత్సవసమాప్తి అయిన రోజున నమ్మాళ్వార్లను శ్రీవారి పాదసన్నిధిలో చేర్చి, మరలా లోకోద్ధరణ నిమిత్తమై "మా ఆళ్వార్లను మాకు ప్రసాదించ"మని ప్రార్థిస్తారు.

తర్వాతి కాలంలో నమ్మాళ్వార్ల అనుగ్రహంతో శ్రీమన్నాథమునులు నాలాయిరాన్ని తిరిగి సంపాదించి, ఈ ఉత్సవాన్ని 22 రోజుల పర్యంతం జరిగేలా ప్రారంభించారు. ఇలా ఈ వరవడి సాగుతోంది.

నాలుగువేల పాశురాలను మొత్తం ఒకేసారి స్థిరా సనంలో పూర్తిచేయడం కనుక, శ్రీవైకుంఠ ఏకాదశికి ముందు పదిరోజులు (పగల్‌పత్తు), మొదటి రెండువేల పాశు రాలను (ముదలాయిరం, పెరియ తిరుమొళి) అనుసంధి స్తారు. ఏకాదశి నుండి పదిరోజుల రాత్రివేళ (రాపత్తు) మిగిలిన రెండు వేలపాశురాలను (ఇయర్పాల, తిరువాయ్ మొళి) అనుసంధానం చేస్తారు.

ఇరవై ఒకటవరోజున రామానుజనూత్రందాది, ఉప దేశరత్నమాల అనుసంధానం చేస్తారు. ఇరవై ఒకటవరోజున రామానుజనూత్రందాది, ఉపదేశరత్నమాల అనుసంధించి, 'శాత్తుముఱై' చేయడం, ఆ మరునాడు తిరుప్పల్లాండు తొడక్కం పూర్తిచేయడం సాధారణంగా జరుగుతుంది. అయితే, తిరు మల శ్రీవారిసన్నిధిలో 22వ రోజున కణ్ణినున్ శిరుత్తాంబు, 23వ రోజున రామానుజనూత్రందాది, 24వ రోజున శ్రీ వరాహస్వామిసన్నిధిలో శాత్తుముఱై, 25వ రోజున తన్నీర్ అముదు ఉత్సవంతో, అధ్యయనోత్సవాలను శుభసమాప్తి చేస్తారు. ఈ సందర్భంగా ఒక నిషేధాన్ని గుర్తు చేసుకోవాల్సి ఉంది. అధ్యయనోత్సవానికి ముందు కార్తికపౌర్ణమి నుండి (కృత్తికాదీపోత్సవం) కూరత్తాళ్వార్ తిరునక్షత్రం (జన్మ దినం) వరకు- అంటే రెండు మాసాలపాటు- దివ్యప్రబంధ పారాయణాన్నిఅనధ్యయన(నిషేధం) కాలంగా పెద్దలు పరి గణించడం జరిగింది.

అయితే, ఈ రెండునెలలకాలంలో తిరువాయ్ మొళికి సార రూపమైన 120 పాశురాలు గలిగిన తిరువాయ్ మొళి నూఱ్ఱందాదిని అనుసంధించాలని పూర్వాచార్య పరంపరగా వస్తోంది. ఈ రెండుమాసాలు తిరుమంగై ఆళ్వార్లు నమ్మాళ్వార్లను శ్రీరంగంలో వేంచేపు చేసినకాలానికి ఒక సంకేతం అన్నమాట!

వైష్ణవాలయాల్లో దివ్యప్రబంధఅధ్యయనం తప్పక జరిగి తీరాలని పారమేశ్వర, శాండిల్య, జయాఖ్య, ఈశ్వర, శ్రీప్రశ్న, పాద్మ, బ్రాహ్మ, నారాయణ, విష్వక్సేనాది సంహితల లోనూ, విష్ణుతంత్రంలోనూ ప్రముఖంగా ప్రస్తావించబడింది.

ఇక తిరుమల విషయానికి వస్తే అధ్యయనోత్సవాన్ని ఏర్పాటుచేసినవారు తొలుత తిరుమంగైఆళ్వార్లు, తదుపరి నాథమునులు, తదనంతరం భగవద్రామానుజాచార్యులు. దీనికి సంబంధించి, 1253 సం॥ నాటి తిరుపతి శాసనం పాక్షిక దివ్యప్రబంధపారాయణాన్ని సూచించగా, 1360 సం॥ నాటికే సంపూర్ణ దివ్యప్రబంధపారాయణం మొదలైనట్లు ఇతర శాసనాలు ఋజువు చేస్తున్నాయి. 1446 సం॥ నాటి శాసనం బ్రహ్మోత్సవాలలో ఈనాటివలే, తిరు వాయ్‌మొళి అధ్యయనాన్ని తెలియజేస్తోంది.

మొదట్లో తిరువాయ్‌మొళిగానం రాజగోపురానికి ముందు తిరువాసన్ దగ్గర, తరువాత ఎంబెరుమానార్ల సన్నిధి ఎదుట, ప్రస్తుతం రంగనాయకమండపంలోనూ ఈ అధ్యయనోత్సవం జరుగుతోంది.

## అధ్యయనోత్సవవిధానం

యథావిధిగా నిత్యఆరాధనాదులన్నీ పూర్తిచేశాక, ఉత్సవమూర్తులను ఒకపల్లకీలో వేంచేపు చేస్తారు. వేరొక పల్లకీలో శఠగోపాది ఆళ్వార్లను వేంచేపు చేసి, శ్రీస్వామివారికి ఎదురుగా ఆళ్వార్లు ఉండేలా సన్నిధిచుట్టూ ప్రదక్షిణం చేసి ధ్వజస్తంభంవరకు వస్తారు. వీరుభయుల మధ్య భాగవతోత్త ములు గోష్ఠిగా రెండువరుసలలో చేరుతారు.

ఆ తర్వాత శ్రీవారికీ, ఆళ్వార్లకూ అర్ఘ్యపాద్యాదిషోడ శోపచారాలు సమర్పిస్తారు. అప్పుడు స్థానాచార్యులవారికి పరివట్టం (తలపాగ వంటిది) ధరింపజేసి, వేదాది విన్నపం (శంగోలం) చేస్తారు. ఆ తర్వాత ఆళ్వార్లకు శఠారి ఇచ్చి, 'అరుళప్పాడు' చెప్తారు. దివ్యప్రబంధం అనుసంధానం ఆరంభించి, భాగవతోత్తములకు శఠారి ఇచ్చి మళ్లీ ఆలయా నికి ప్రదక్షిణం చేసి, శ్రీవారి గర్భగుడిలో చేరుస్తారు. అప్పుడు ఆళ్వార్లను శ్రీవారికి అభిముఖంగా ముఖమండపంలో వేంచేపు చేసి, ఆనాటి దివ్యప్రబంధ భాగాన్ని పూర్తి చేస్తారు. ఇక ఆళ్వార్లను యథాస్థానంలో చేర్చాక, నైవేద్యం, శాత్తుముఱై, తీర్థప్రసాద వినియోగం ఒక క్రమంలో జరుగుతుంది. ఇలా అధ్యయనోత్సవం ప్రతిరోజు జరుగుతూంటుంది.

ఇక చివరిరోజు నమ్మాళ్వార్ల పరమపదోత్సవం. తిరుమలలో మాత్రం అధ్యయనోత్సవం శుభసమాప్తి. శ్రీస్వామివారిని గరుడవాహనంపై / తిరుచ్చిపై వేంచేపు చేసి, వారికి ఎదురుగా ఆళ్వార్లను (తిరుమలలో శ్రీరామానుజుల వారి) సేవగా పురప్పాట్టు (తిరువీథిఉత్సవం) జరుపుతారు. తిరిగి వచ్చాక వేదాది విన్నపం చేశాక, తిరువాయ్‌మొళిలోని చివరిపత్తు (శాత్తుముఱై పాశురాలను విడిచి) అందాదిగా అనుసంధిస్తారు. ఆళ్వార్లను శ్రీస్వామివారి దివ్యశ్రీచరణ సన్నిధిలో చేర్చగా, భక్తులు తులసీ పుష్పాదులను ఆళ్వార్లకు సమర్పిస్తారు. హారతి ఇస్తారు.

ఆపైన ద్వారాన్ని మూసివేసి, ఆళ్వార్లకు తిరు మంజనం, అలంకారం వగైరాలు సమర్పించి, పొంగలి ఆరగింపు చేస్తారు. ఆ తర్వాత ఆళ్వార్లను తిరిగి తమకు అనుగ్రహించమనీ, లోకోద్ధరణకు అవశ్యమనీ ప్రార్థన చేస్తూ, ద్వారం తెరచి, శాత్తుముఱై పూర్తి చేస్తారు. ఆ సందర్భంగా శ్రీవారికి, నమ్మాళ్వార్లకు, ఎంబెరు మానార్లకు, పూర్వాచార్యు లకు సంభావనలు సమర్పిం చడం సంప్రదాయం. చివరకు స్థానాచార్యులకు మాలాపరివేష్టం, శఠారి, తీర్థప్రసాదాదు లతో సత్కారం, ఇతరులకు, తీర్థప్రసాద వినియోగం జరుగు తుంది.

తిరుమలలో పెరియజీయర్‌స్వామివారు, ఎంబెర్ మానార్లకు ప్రతినిధులుగా, సత్సంప్రదాయ పరిరక్షణ ధర్మ కర్తలుగా, 'అరైమర్ల' స్థానంలో ద్రావిడవేదగానాన్ని నిబద్ధతతో నిర్వహిస్తారు.

భక్తామృతం విశ్వజనానుమోదనమ్।




# ఇంతకంటే విలువైన కానుక ఉంటుందా?


శ్రీమతి నీలంరాజు భార్గవి

మేము 2018 నవంబరు నెలలో శ్రీవారిఆర్జితసేవకోసం ఆన్‌లైన్లో బుక్‌చేసుకుంటే మొట్టమొదటిప్రయత్నంలోనే లక్కీడ్రాలో 'సుప్రభాతసేవ'కు నవంబరు 19వతేదీకి టిక్కెట్లు దొరికాయి. వెంటనే మావారు శాంతారావుగారు రైలు టిక్కెట్లు వసతిగదులు అన్నీ బుక్ చేసేశారు. మా ఆనందానికి అవధులు లేవు. ఇరుగుపొరుగువారందరికీ గొప్పగా చెప్పుకున్నాం.

మేము ఒక రోజు ముందే తిరుమల చేరుకున్నాం. సుప్రభాతసేవకదా! వేకువనే అక్కడ రిపోర్టు చెయ్యాలి. ఆ రోజురాత్రి గదిలో పడుకున్నాం అన్నమాటే గానీ ఇద్దరికీ నిద్రపట్టలేదు. అర్ధరాత్రి 12 గం॥లకు లేచి స్నానాదికాలు ముగించుకుని దేవాలయప్రాంగణానికి చేరుకున్నాం.

సుప్రభాతాన్ని కనులారా వీక్షించాం. మంగళవాద్యాలు, పూర్ణకుంభ స్వాగతాల మధ్య తెర తొలగించారు. దైవదర్శనమైంది. ఎంతో సంతోషించాం. తిరిగి క్యూలో వచ్చేటప్పుడు ప్రసాదంపెట్టారు. అది స్వీకరించి ఆ సంతోషంలో కబుర్లు చెప్పుకుంటూ గదికి చేరాం.

మావారు గదిలో ఉన్న టి.వి. పెట్టారు. తి.తి.దే. భక్తి ఛానల్‌లో స్క్రోలింగ్‌లో మరుసటిరోజు (నవంబరు 20వ తేదీ) కైశికద్వాదశి అనీ, ఉగ్రశ్రీనివాసుడు సూర్యోదయానికి పూర్వమే మాడవీథులలో తిరుగుతాడనీ, ఇది ఏడాదికి ఒక్కసారిమాత్రమే జరుగుతుందనీ చెబుతున్నారు. ఇంకేం! మరుసటిరోజు కూడా ఉండి ఎలాగైనా సరే ఆ ఉగ్రశ్రీనివాసునిదర్శనం చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. వెంటనే మావారు గదికి ఎక్స్‌టెన్షన్‌కి వెళ్లారు. భగవదనుగ్రహముంటే జరగనిదేముంది?



19వతేదీ రాత్రి తిరుమల కొండ మీద తిరుగ గలిగనంత కలియతిరిగి గదికి చేరుకున్నాం. తెల్లవారక ముందే స్నానాదికాలు ముగించుకుని మాడవీథిలో ఒక ప్రదేశంలో నిలబడ్డాం. సెక్యూరిటీగార్డు మంచిప్రదేశం చూపించాడు.

భగవదాగమనంకోసం వేచి ఉన్నాం. ఆ దివ్యసమయం రానే వచ్చింది. మేళతాళాలతో శ్రీనివాసుడు గుడిముఖద్వారంనుండి బయటికి వచ్చి, భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహించి, నాలుగుమాడవీథులూ కలియ తిరిగి, సూర్యోదయానికి పూర్వమే ఆలయంలోకి వెళ్లిపోయారు. అక్కడ ప్రసాదాలు పంచిపెట్టారు. మా ఆనందానికి అవధులు లేవు.

సరిగ్గా, ఆ సమయంలోనే ఓ వింత జరిగింది. శ్రీనివాసుడు అటు ఆలయంలోకి వెళ్లగానే మావారు యథాలాపంగా ఆకాశంవంక చూశారు. ఎర్రని ఆకాశంనుండి సూర్యభగవానుడు ప్రత్యక్షదర్శనానికై సమాయత్తమౌతున్నాడు.

ఇక్కడ మరో సంఘటన జరిగింది. శ్రీనివాసుడు ఆలయం బయటికి వచ్చింది మొదలు, తిరిగి లోనికి వెళ్లేంతవరకు ఆకాశంలో ఎక్కడనుండి వచ్చాయో తెల్లనిపక్షుల గుంపు ఒకటి వచ్చి, తిరిగి ఎటో వెళ్లిపోయింది. ఆ దృశ్యం ఇంకా మాకంటి ముందు చెక్కుచెదరలేదు!

కైశికద్వాదశిరోజు శ్రీనివాసదర్శనం కావడం ఆ రోజే మా ముప్పైయ్యవ పెళ్లిరోజు కావడం, యాదృచ్ఛికంగా జరగడంతో ఇంకా ఎంతో పొంగిపోయాం.

పెద్దహోటల్స్‌లో భోజనాలు, చీరలు, నగలు, బహుమతులు ఇవేవీ ఇవ్వలేని ఆనందం శ్రీనివాసదర్శనంలో లభించడంతో ఇంతకంటే పెళ్లిరోజు కానుక మరొకటుంటుందా? అనిపించింది. ఈ జన్మకిది చాలు!

# గోదాదేవి అలంకారంలో తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారు



## 11-11-2020 నుండి
## 19-11-2020 వరకు జరిగిన
## తిరుచానూరు
## శ్రీ పద్మావతీ అమ్మవారి
## కార్తిక బ్రహ్మోత్సవ
## దృశ్యమాలిక !



















## తిరుమల తిరుపతి దేవస్థానములు

**11-11-2020 నుండి**
**19-11-2020 వరకు జరిగిన**
**తిరుచానూరు**
**శ్రీ పద్మావతీ అమ్మవారి**
**కార్తిక బ్రహ్మోత్సవ**
**దృశ్యమాలిక !**

















ఇటీవల తిరుమల శ్రీవారికి, తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారికి జరిగిన
పుష్పయాగమహోత్సవ దృశ్యాలు



తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి వార్షిక కార్తికబ్రహ్మోత్సవాలలో
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన
గౌ॥ ఉపముఖ్యమంత్రివర్యులు శ్రీ నారాయణస్వామి గారు




తిరుమల శ్రీవారి ఆలయంలో
కార్తిక దీపోత్సవం

ధన్వంతరి....సాక్షాత్తు నారాయణాంశసంభూతుడు. అపూర్వమైన వైద్యవిధానాన్ని మానవజాతికి అందించి మహోపకారం చేసిన ఆదివైద్యుడు. ఆధ్యాత్మికతకు, ఆధిదైవికతకు ఆరోగ్యమే అత్యంత అవసరమని చాటిచెప్పిన మహనీయుడు. వృద్ధాప్యానికి, రోగబాధలకు దేవతలు ఏవిధంగా గురికాకుండా ఉంటారో, ఆవిధమైన ఫలితాన్ని ఆయుర్వేదవైద్యంద్వారా సకలమానవాళికి అందించిన ఘనుడు. క్షీరసాగరమథనసమయంలో శ్రీమహావిష్ణు స్వరూపంగా ఆవిర్భవించి, రోగసాగరం నుంచి మనందరికీ విముక్తి కల్పించిన దేవవైద్యుడు **ధన్వంతరి.**

అది క్షీరసాగర మథనం జరుగుతున్న సమయం. దేవతలు, దానవులు మంథర పర్వతాన్ని కవ్వంగా, వాసుకిని కవ్వపుతాడుగా చేసుకుని, పాలకడలిని మథిస్తున్నారు. భూనభోంతరాళాలు అచ్చెరువొందేలా, అతిభీకరయుద్ధాన్ని తలపించేలా సాగుతోంది మథనం. చింతామణి, కల్ప వృక్షం, కామధేనువు, ఐరావతం, చంద్రుడు, శ్రీమహాలక్ష్మి... ఒక్కొక్కటిగా సముద్రంనుంచి బయటకువస్తున్నాయి. ఆ వరుసలో పదోస్థానంలో స్ఫురద్రూపి అయిన మహాపురుషుడు ఆవిర్భవించాడు.



# మొదటి వైద్యుడికి వందనం!



– *శ్రీ కె.జానకిరామావధాని,*
*90320 44114*

పెద్దపెద్ద కళ్ళు, ఒత్తయిన కేశాలు, మహోన్నతమైన ఆకారం, మోముపై చిరుదరహాసం, అఖండమైన దివ్యతేజస్సుతో వెలిగిపోతున్నాడు. పట్టుపీతాంబరాన్ని ధరించాడు. మణికుండలాలు అతని చెవులకు వేలాడుతున్నాయి. మెడలో దివ్యమైన పుష్పమాల మెరుపులీనుతోంది. ఓ చేతిలో సువర్ణభాండం, మరోచేతిలో వనమూలికలు, మరో రెండుచేతుల్లో శంఖ చక్రాలు ధరించి ఉన్నాడు. ఆ మహాపురుషుడిని దేవదానవులంతా అత్యంతఆశ్చర్యంతో తేరిపార చూస్తున్నారు.

సాక్షాత్తు బ్రహ్మదేవుడుకూడా ఆ దివ్యతేజస్సుని చూచి, సంభ్రమానికి గురయ్యాడు. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడిలా ఉన్నాడని అందరూ భావించారు. అవును... నిజమే...అది భావన కాదు.. ఆ మహాపురుషుడు సాక్షాత్తు శ్రీమన్నారాయణాంశతో పాలసముద్రంనుంచి ఉద్భవించిన ఆది వైద్యుడు.... భగవాన్ శ్రీధన్వంతరి.

ధన్వంతరి అంటే శరీరానికి, మనసుకు పట్టిన మాలిన్యాన్ని వదిలించేవాడని అర్థం. 'ధనూ' అనగా చికిత్సకు అందని వ్యాధి, 'అంత' అనగా నాశము, 'రి' అనగా కలిగించువాడు అని అర్థాలు ఉన్నాయి. వీటిఆధారంగా చికిత్సకు లొంగనివ్యాధులను నశింపచేయువాడు అని ధన్వంతరిశబ్దానికి అర్థం చెప్పుకోవచ్చు. సకలలోకాల్లో చికిత్సకు అందని వ్యాధి మరణం ఒక్కటే! మరణాన్నిసైతం జయించగల అమృతాన్ని ధన్వంతరి తెచ్చి, వెంటనే అంతర్ధానం అయ్యాడని భాగవతాదిపురాణాలు చెబుతున్నాయి. ధన్వంతరి అనే మాటకు శల్యశాస్త్రపు ఎల్లలు దాటి, విషయాలను గ్రహించినవ్యక్తి అనే అర్థాన్ని సుశ్రుతసంహిత చెబుతోంది.

## ధన్వంతరి మహామంత్రం

ఓం నమో భగవతే మహాసుదర్శన
వాసుదేవాయ ధన్వంతరయే
అమృత కలశ హస్తాయ
సర్వభయ వినాశాయ
సర్వరోగ నివారణాయ
త్రైలోక్య పతయే
త్రైలోక్య విధాత్రే
శ్రీమహావిష్ణు స్వరూపాయ
శ్రీధన్వంతరి స్వరూపాయ
శ్రీశ్రీఔషధచక్ర నారాయణస్వాహా

*(తీవ్రమైన అనారోగ్యంతో బాధపడేవారు ధన్వంతరిని ధ్యానిస్తూ ఈ మంత్రాన్ని ఉపాసన చేస్తే ఉత్తమమైన ఆరోగ్యం సిద్ధిస్తుంది.)*

కార్తిక బహుళ త్రయోదశిని ధన్వంతరి జయంతిగా జరుపుకునే ఆచారం కొన్నిచోట్ల ఉంది. తెలుగునాట ఆశ్వయుజబహుళ త్రయోదశిని ధన్వంతరిజయంతిగా విస్తారంగా జరుపుకుంటారు. కొన్నిప్రాంతాల్లో మార్గశిర మాసంలో ధన్వంతరి జయంతి జరుపుకునే ఆచారంకూడా వ్యాప్తిలో ఉంది. సూర్య, చాంద్రమానాల్లో వచ్చే భేదాలు ఈ ఆచార భేదాలకు కారణమై ఉండవచ్చు. ధనత్రయోదశి రోజున లక్ష్మీదేవితో పాటు ధన్వంతరిని అర్చించే ఆచారం కూడా కొన్నిచోట్ల ఉంది.

## ధన్వంతరి అర్చన


ధన్వంతరి జయంతి రోజున స్వామిని శాస్త్రోక్తంగా సకలఉపచారాలతో అర్చించాలి. తెల్లనిపూలతో అర్చన చేస్తే విశేషఫలితం కలుగుతుంది. పాయసాన్నం నివేదనచేసి, అందరికీ ప్రసాదం పంచాలి. ఆయుర్వేదవైద్యులకు ధన్వంతరి తొలిగురువు. వీరు ధన్వంతరి హోమం కూడా చేస్తారు.

## ధన్వంతరి ఆలయాలు

కేరళరాష్ట్రంలోని త్రిచూర్ వద్ద ఉన్న ధన్వంతరి ఆలయం అత్యంత ప్రసిద్ధిపొందింది. నూతనంగా ఆయుర్వేద వైద్యవృత్తిని చేపట్టేవారు ముందుగా ఈ ఆలయానికి వెళ్ళి, స్వామికి పూజలు చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా, ఆలమూరు మండలం, చింతలూరు గ్రామంలో, గౌతమీనదీతీరంలో ధన్వంతరిఆలయం ఉంది. ఇది కూడా ప్రసిద్ధిపొందిన దేవాలయం. ఈ ఆలయంలోకి అడుగుపెట్టినంతలోనే వ్యాధులు దూరమవుతాయని భక్తులనమ్మిక. తమిళనాడురాష్ట్రం, శ్రీరంగపట్నంలోని రంగనాథస్వామి ఆలయంలో ధన్వంతరిఉపాలయం ఉంది. ఈ ఆలయంలో వనమూలికలతో చేసిన కషాయాన్ని తీర్థంగా ఇస్తారు. ఈ తీర్థసేవనంతో మొండి వ్యాధులు నయమవుతాయని చెబుతారు. కంచివరదరాజస్వామి ఆలయఆవరణలోనూ ధన్వంతరివిగ్రహం కొలువుదీరి కనిపిస్తుంది. కాలికట్ సమీపంలో కూడా ధన్వంతరి ఆలయం ఉంది. ఈ ఆలయాన్నీ వేటికవే విభిన్న ప్రత్యేకతలతో అలరారుతూ, దేవవైద్యుడి అనుగ్రహాన్ని భక్తులకు అందిస్తున్నాయి.



ఇంద్రియలోలుణ్ణి ఆ ఇంద్రియాలే ఆరగిస్తాయి



# ధనుర్మాస వైభవం

– ఆచార్య పుల్లూరి ఉమ, 095660 17168

దేవతారాధన ప్రజల గృహస్థజీవితంలో ముడి పడింది. కొన్నిమాసాలలో వచ్చే ఆరాధన ఆలయ సంప్రదాయఉత్సవాలకుమాత్రమే సంబంధించింది.

ఈ విషయాన్ని నిరూపించడానికే శ్రీవైష్ణవసంప్రదాయంలో శ్రీ ఆండాళ్‌తల్లికథ, స్తుతిగీతాలు ప్రచారంలోకి వచ్చాయి. కనుక ఆండాళ్ తల్లి ఆచరించిన ధనుర్మాసవ్రతం వైష్ణవులఇండ్లలో, విష్ణ్వాలయాలలో ఇంటిగడపదీపంగా ప్రజ్వరిల్లుతోంది. గోదాదేవిగా ప్రశస్తిగాంచిన ఆండాళ్ తల్లి రచించిన పాశురాలలోని విషయసారమే మార్గశీర్ష మాసమహిమగా, ధనుర్మాసవ్రతంగా గ్రహించాలి. తమిళ ప్రాంతంలో దీనికి విశేషప్రచారముంది. దీనికి 'పావైనోంబు' అనే వ్రతనామం ప్రసిద్ధం! ఆంగ్లనెలలప్రకారంగా మార్గశీర్షపుష్యమాసాలు డిశంబరు, జనవరికి సమానంగా వస్తాయి.

శ్రీఆండాళ్‌తల్లి అందించిన విషయాల్ని బట్టి ధనుర్మాసవైభవం మూడుకోణాలలో నుంచీ దర్శించవచ్చు.

1)ప్రకృతి రామణీయకం, 2)మానవునినైమిత్తికజీవితవృత్తి, 3)ఆధ్యాత్మిక మార్గోపదేశం. ఈ మూడుకోణాలూ ఒక దానితో ఒకటి సంబంధంకలిగి, ముక్కోణంగా అవగతం కాగలదు. ప్రకృతి తనసహజ స్వభావంతో దర్శనమిచ్చేకాలమిది. సూర్యోదయానికి ఒకటిన్నరగంటకు పూర్వం బ్రహ్మముహూర్తంగా గుర్తించారు మన పూర్వశాస్త్రజ్ఞులు. ఈ సమయం దేవతోపాసనకూ, ధ్యాననిష్ఠాదియోగాభ్యాసాలకు, సముచితమూ సముత్కృష్టమూ అయిన సమయం. ధనుర్మాసానికి సరియైన ఆంగ్ల మానం డిశంబరు 14 నుండి జనవరి 14 వరకు గల కాలం. మంచుతెరలు క్రమ్మినఆకాశం, దానితో కలిసిన చల్లనిచిరుగాలి, శరీరానికి హాయి కలిగించే స్పర్శానుభవం, ప్రతివ్యక్తికీ బ్రాహ్మీకాలంలో కలిగిస్తుంది.

'గోపకులంలో పెరుగుచిలికే గొల్లపడుచుల గాజుల సవ్వడి, కవ్వపు ధ్వనులు, ఇంటి ముందు గింజల్ని ముక్కుతో గ్రుచ్చి తింటుండే కోళ్ల సవ్వళ్లు, విష్ణ్వాలయంనుంచి వినిపించే శంఖధ్వని, కావివస్త్రాలు ధరించి హరినామ సంకీర్తనలు చేస్తూ వేగంగా ఆలయంవైపు నడుస్తున్న తాపసులు, పశువులు మేతకై పరుగులు తీస్తున్నప్పుడు మెడల కట్టిన గంటల గణగణనాదంతో ప్రాతఃకాలం ప్రకృతి శోభతో అలరారుతూంద'ని గోదాదేవి పాశురాలసారం.

ధనుర్మాస ప్రభాతవేళ ప్రకృతి సర్వసౌందర్యాన్ని ప్రసాదించడం వాస్తవం.

ఈ సమయంలో మానవుడు ఆచరించాల్సిన నైమిత్తికవిధుల్ని నిర్దేశించారు పెద్దలు. మృగశిరనక్షత్రంతో కూడిన పౌర్ణమివిశిష్టమైంది. సర్వసంపదలతో కూడిన భగవంతునిఅనుగ్రహం కలిగిన కాలమిది. వైకుంఠఏకాదశీ వ్రతం ఈ మాసంలోనే వస్తుంది. గోదాదేవి ప్రభాత వేళలో లేచి, ఇరుగుపొరుగున నున్న సమవయస్కులైన కన్నె

పిల్లల్ని నిద్రనుంచి లేపటం, తదనుగుణంగా కోనేటిలో స్నానం ఆచరించి నోము నోచవలెనట! ఈ నోము తమ ప్రాణసఖుణ్ణి, కాత్యాయనిని ఉద్దేశించి చేసే వ్రతమని పురాణోక్తి. కానీ, శ్రీఆండాళ్ తల్లి తన ప్రాణవల్లభుడగు శ్రీకృష్ణునికొరకై ఆచరించే దేవి అనుగ్రహంకై నోముగ గుర్తించి, పాటలు పాడింది. ఇందులో మనం గమనించాల్సిన విషయాలు నిత్యజీవితవిధానానికి సంబంధించినవి. అవి నోమును ఆచరించడానికై ఏర్పరచిన కొన్నినియమాలు.

'తెల్లవారుజామున స్నానం చేయాలి. పాలు నేయి పరిహరించాలి, అంజనాదులవంటి అలంకరణాలు కూడదు. పూలు పెట్టుకోకూడదు. గడుసు పనులేవీ చేయకూడదు. ఒకరినొకరు నిందించుకోకూడదు' అని శ్రీఆండాళ్ విధినిషేధాలు నిర్దేశించింది.

ధనుర్మాసమున వీటిల్ని ఆచరించడం సులభతరం. తదితరమాసాలలో ప్రజలు ఆచరించే ప్రత్యేక దేవతను ఉద్దేశించిన వ్రతాలున్నాయి. వినాయకచతుర్థి, విజయదశమి, కేదారగౌరీవ్రతం వంటివి. మార్గశీర్షమాసంలో శ్రీకృష్ణునికై ఉద్దేశింపబడిందీ, ప్రజలనందరినీ ఏకసూత్రంతో బంధింపగల ప్రణయ తత్త్వానికి చక్కనైన సమయమిది. కనుకనే శ్రీకృష్ణుడు 'మాసాలలో మార్గశీర్షం నేను' అని పేర్కొన్నాడు.

ప్రఖ్యాతవిష్ణ్వాలయాలలో ధనుర్మాసంలో 21 రోజులు అధ్యయనఉత్సవములు జరుపుతారు. నాల్గువేల దివ్యప్రబంధాలుగ వాసిగాంచి, పండ్రెండుగురు ఆళ్వారులు రచించినపాశురాల్ని శ్రుతి లయలతో పఠిస్తుంటారు. పదిపగలు, పదిరేయి అనుస్యూతంగ దివ్యప్రబంధాన్ని సమగ్రంగా అభ్యసించిన పండితులు ఆలయప్రాంగణాలలో పాడుతుంటారు. వైకుంఠఏకాదశికి పూర్వాపరంగా ఈ అధ్యయనోత్సవాన్ని నిర్వహిస్తారు. పదవరోజు వైకుంఠఏకాదశి తరువాత స్వర్గద్వారం తెరువబడుతుంది. ఇది ఆలయకార్యక్రమం.



ఇక ఆధ్యాత్మపరంగా చూస్తే మాయానిద్రలో సుషుప్త్యవస్థలో ఉన్న జీవుణ్ణి ఆచార్యుడు తట్టి లేపుటయే 'తిరుప్పావై'లోని రహస్యార్థం. ప్రతివిషయంలోను అంతరార్థం ఇమిడ్చడానికై మన పండితకవులు పురాణకథలను ఆధారంగా గ్రహించి, వాటినేపథ్యంలో తత్త్వార్థాలు అందించారు.

అట్లే ధనుర్మాసమహిమకు సంబంధించిన కథనం ఉంది. ఒకనాడు దక్షిణాయనంలో దేవలోకవాసులందరూ కూడి, మేరుపర్వతంలో ఉన్న మహావిష్ణువునుగురించి స్తుతించారు. స్వామి సాక్షాత్కరించగా, రాత్రి తమను చుట్టుముట్టుతూందనీ, తమ తమ స్థానాలకు తాము వెళ్లుటకు అనుగ్రహించాలనీ కోరారు. అప్పుడు దక్షిణాయనకాలానికి అధిదేవతయగు రాత్రి దేవతా స్త్రీగా వచ్చి, శ్రీవిష్ణుమూర్తిని వినయవిధేయలతో శరణుపొందింది.

"స్వామీ! ప్రజలందరు దక్షిణాయనాన్ని ఒకచెడుకాలంగా భావిస్తున్నారు. ఈ కాలంలో శుభకార్యాలు ఆచరించడం లేదు. నన్ను అందరూ దూషిస్తున్నారు. నీ అనుగ్రహం పొందడానికి నేను తపస్సు చేస్తాను. నేను నా లక్ష్యాన్ని పొందకపోతే

ఆ నిందతోనే జీవితం చాలించుకొంటాను" అని ప్రార్థించింది. ఈ విషయాన్ని దేవతలు శ్రీమన్నారాయణునికి విన్నవించారు. భగవంతుడుకూడా నియమాల్నిబట్టి అనుగ్రహించాడు "ఓ రాత్రిదేవి! నీ కాలం రెండేసినెలలతో మూడుఋతువులుగ ఉంటుంది. మొదటి రెండుఋతువులు నాకు ప్రీతిపాత్రమై ఉంటాయి. రెండుఋతువులలోను నాల్గునెలల్లో వచ్చే కార్తికం, ఆశ్వయుజం, భాద్రపదం, శ్రావణం మిక్కిలి శ్రేష్ఠమైనవై ఉంటాయి. ఈ కాలాన్ని గుర్తించి చేసే కార్యాలన్నీ విశిష్ట ఫలాలు అందిస్తాయి. ఈ శుభకాలంకోసం ప్రజలు ఎదురుచూస్తుంటారు. నీపై ఏర్పడిన అపనింద తొలగిపోవుగాక!" అని పలికి, స్వామి అదృశ్యుడయ్యాడు.



కథా సంగ్రహాన్నిబట్టి శ్రీమన్నారాయణుడే సర్వకాలాన్నీ, నియమం చేశాడనే విషయం తెలుస్తూంది. అంతేకాదు ప్రశస్తంగా విష్ణువుకుగల పంద్రెండునామాలు, పంద్రెండుమాసాలకు చెందిన వనీ, ధనుర్మాసానికి సంబంధించిననామం 'కేశవ' అనేదనీ, ఈ పేరు మిక్కిలి శ్రేష్ఠమైందనీ పెద్దలమాట!

వైష్ణవాచారాల్ని అనుసంధించేవాళ్లు నిత్యమూ విష్ణునివాసకేంద్రాలైన తమశరీరాంగాలలో పంద్రెండుస్థానాల్లో ఊర్ధ్వపుండ్రాలు నైమిత్తికవిధిగా ధారణ చేసుకొంటారు. ఈ సమయంలో ఒక్కొక్క పుండ్రానికి శ్రీమన్నారాయణుని ద్వాదశనామాలను ధ్యానిస్తూ ధరిస్తారు. ఈ విషయమై నమ్మాళ్వారు తమ తిరువాయ్‌మొళిలో చక్కగా వివరించారు. నామాలవరుసక్రమంలో 'కేశవ' నామమే ప్రథమం. ప్రధానం. కేశవ శబ్దానికి గల వ్యుత్పత్తులు మూడు. "కేశవః= శోభనాః కేశాః యస్య సః – మంచికేశాలు కలవాడు. "కేశినం అసురం హతవాన్ ఇతి"– కేశి అనే రాక్షసుణ్ణి చంపినవాడు, "క శ్చ ఈశ శ్చ కేశౌ, తావస్మిన్ స్తః ఇతి" బ్రహ్మరుద్రులు ఈయనయందు జనించారు. అంటే బ్రహ్మవిష్ణురుద్రులు కలిసి, కేశవ స్వరూపం అని అమరం.

ఈ నామజపంవల్ల ఏడుతరాలవారికి ఇటు అటూ మోక్షంప్రాప్తిస్తుందని ఫలశ్రుతి. ఇట్టి గొప్పఫలాన్ని కలిగించే కేశవనామం ధనుర్మాససంకేతమవుతూంది.

*కేశవా! నీదైన కృపచేత నాదగు / ప్రేమయు నీయందు వెలిగె కాద*

*.... .... .... .... .... .... .... .... .... .... ....*

*ఏడుతరములకు నిటునటు మోక్షంబు / మావంటివారికి మహిని కలుగు*

***(శ్రీ వాగ్వైభవము 2258)*** అనేది– ఫలితార్థం.

ఈ విషయాన్ని గుర్తించి, ప్రతివ్యక్తీ ధనుర్మాసవ్రతాన్ని తనశక్తికొలదీ ఆచరించి, భగవంతుని కృపతో సర్వశ్రేయస్సులూ పొందాలి అనేది పెద్దలఆశయం!!

# భగవంతుని చిరునామా

– డా॥ గరికిపాటి నరసింహారావు

చాలామందికి భగవంతుడిమీద విశ్వాసం లేక పోయినా, ఉన్నట్లు మాట్లాడుతారు. నిజమైన విశ్వాసం ఉన్నవాడెవడూ భగవంతుణ్ణి తప్ప వేరొకరినాశ్రయించడు. ప్రగాఢమైన భగవద్విశ్వాసంతో బమ్మెరపోతనలా జీవి స్తాడు. అలా జీవించడం మనకిష్టం లేదు. ఈ భోగాలేవీ వదులుకోకుండానే దేవుడు మనకు రోజూ కనిపించి రోజూ హాజరు వేయించుకోవాలని మనఆలోచన. అలా రావ డానికి, పోవడానికి ఆయన ఒకచోట ఉండి మరోచోట లేకపోతే గదా!

ఆయన ఎక్కడ ఉన్నాడో మన పూజాపురస్కారాల్లో ముఖ్యభాగమైన మంత్రపుష్పంలో పటంగీచి భాగాలు గుర్తించినంత స్పష్టంగా ఉంది.

మన శరీరంలోనే గొంతుకు దిగువ, నాభికి పైనగల ప్రదేశంలో పన్నెండు అంగుళాల ఎడంగా హృదయకమలం ఉంది. అది ఆయన నివాసస్థానమని వేదం స్పష్టం చేస్తోంది.

సృష్టికి మూలమైన ఆ మహాశక్తి అగ్నిమాలికలా ప్రకాశిస్తోందనీ, ఎల్లప్పుడూ అనేక నాడీసమూహంతో వేలా డుతూ అమితతేజోవంతంగా ఉందనీ దానిస్వరూపాన్ని విస్పష్టం చేస్తోంది.

"తస్యాంతే సుషిరగ్ం సూక్ష్మం తస్మిన్ సర్వం ప్రతిష్ఠితం
తస్య మధ్యే మహానగ్నిః విశ్వార్చిర్విశ్వతో ముఖః"

**ఎడమచేతితో కరోనాను ఓడించవచ్చు**

**బయటికి వెళ్లినప్పుడు ఏ పనైన గాని ఎడమ చేతితో మాత్రమే చేయండి. నోట్లు తీసుకోవడం, లిఫ్ట్ డోరు తెరవడం ఇలా ఏ పనైన ఎడమ చేతితో చేస్తే పొరపాటునైన మనం కుడిచేతితో కళ్లు, ముక్కు, ముఖం, తాకడం లాంటివి చేస్తే వైరస్ సోకే ప్రమాదం చాలా తక్కువ.**

ఆ జ్వాలామాలిక చివర్లో అతిసూక్ష్మమైన రంధ్రం ఉంది. దానిలోనే ఈ విశ్వరహస్యమంతా ఇమిడి ఉంది. ఆ రంధ్రం మధ్యలో గొప్పఅగ్ని ఉంది. అదే విశ్వాన్ని వెలి గింపజేస్తోంది. అదే విశ్వమంతా వ్యాపించి ఉంది.

దాని మధ్యలో అపూర్వమైన వహ్నిశిఖ ఉంది. అది ఊర్ధ్వముఖంగా ప్రకాశిస్తోంది.

ఆ అగ్నిశిఖ నీలమేఘం మధ్యలో ఉండే మెరపు తీగలా ప్రకాశిస్తోంది. నివ్వరిధాన్యపుముల్లులా బంగారు రంగులో కాంతులు విరజిమ్ముతోంది. అది అణువువలే అతిసూక్ష్మమైంది.

అతిసూక్ష్మమైన ఆ అగ్నిశిఖకొస నడుమ భగ వంతుడున్నాడు. అతడే బ్రహ్మ. అతడే శివుడు, విష్ణువు, ఇంద్రుడు. అతడే అక్షరుడు. అతడే సర్వస్వం.

ఇంత స్పష్టంగా ఇంటినెంబరు, వీథిపేరు చెప్పి నంత వివరంగా మనదేహంలోనే భగవద్దర్శనం చేయి స్తోంది వేదమాత మంత్రపుష్పం రూపంలో. శరీరం అంటే కాలకృత్యాలకో, కామకృత్యాలకో ఉపయోగపడే భోగ సాధనం అనుకుని వృథాగా ఇంతకాలం గడిపేశాం గానీ దీనివెనుక ఇంతకథ ఉందని తెలీదే! పూజానంతరం మంత్రపుష్పం చదవడం అంటే అదేదో మొక్కుబడిగా పది మంది అటూ, పదిమంది ఇటూ నిలబడి కంఠస్వరం పెంచేసి, ఒకరిమీద ఒకరు పోటీపడి చదివేయడమే అనుకున్నాం కానీ ఆ మంత్రపుష్పంఅర్థం ఇంతలోతుగా ఉంటుందని మనం ఊహించలేకపోయాం కదా!

అందుకే పుణ్యంకోసం పూజలు చెయ్యకూడదు. పురుషార్థంకోసం చెయ్యాలి. పరమార్థాన్ని అందుకోవడం కోసం చెయ్యాలి. అప్పుడుగాని మనలో దాగిన 'అమూ ల్యాన్ని' కనిపెట్టలేం.



ఇప్పుడీ సారాంశాన్ని భాగవతంలోని వామనచరిత్రలో ఒక పద్యానికి అన్వయించి చూస్తే వామనుడు మూడుఅడుగుల నేలే ఎందుకడిగాడో అర్థమౌతుంది.

"ఒంటివాడ నాకు ఒండు రెండడుగుల
మేర యిమ్ము; సొమ్ముమేర యొల్ల
కోర్కెదీర బ్రహ్మ కూకటి ముట్టెద
దానకుతుకసాంద్ర దానవేంద్ర!"

మూడడుగులనేల ఇస్తే దాన్ని ఆసరాగా చేసుకుని బ్రహ్మశిఖ అందుకొంటానంటున్నాడు వామనుడు. ఆబ్రహ్మశిఖయే మంత్ర పుష్పంలో పేర్కొన్న అతిసూక్ష్మమైన అగ్నిశిఖ. అది మనశరీరంలోనే ఉంది. దాన్ని అందు కోవడానికి ఏకాగ్రతతో తపస్సు చేయాలి. కాళ్లు ముడుచుకుని కూర్చొని చేసే తపస్సుకు మూడడుగులు చాలు. మనిషి చనిపోవాలన్నా ఆరడుగులనేల కావాలి. కానీ బతికి బాగుపడాలంటే ముక్తి పొందాలంటే మూడడుగులనేల చాలన్నమాట. ఇదే 'సూక్ష్మంలో మోక్షం' అంటే.

## శ్రీస్వామిపుష్కరిణీతీర్థముక్కోటి



"స్వామిపుష్కరిణీతీర్థ ముక్కోటి"రోజు సూర్యోదయసమయంలో శ్రీవారి ఆలయంనుండి శ్రీసుదర్శన భగవానుడు పల్లకిలో ఊరేగింపుగా ఆలయమహాప్రదక్షిణమార్గంలో బయలుదేరి, శ్రీవరాహస్వామి ఆలయప్రాంగణానికి చేరుకొంటారు.

అక్కడ పాలు, పెరుగు, కొబ్బరినీరు, చందనం, పసుపు మున్నగువాటితో సుదర్శనచక్రత్తాళ్వారుకు తిరుమంజనం అయినతర్వాత సుదర్శనభగవానునికి స్వామి పుష్కరిణిలో మూడు మార్లు పవిత్రస్నానం చేయిస్తారు. ఆ సమయంలో కోనేటిచుట్టూ ఉన్న భక్తులు కూడా సుదర్శనచక్రంతో పాటు పుష్కరిణిలో మునుగుతూ స్నానంచేసి, పునీతులవుతారు. ఈ రోజే "స్వామి పుష్కరిణీతీర్థముక్కోటి". ఈ రోజున తిరుమల కోనేటిలో స్నానంచేసినవారికి సమస్త తీర్థయాత్రాఫలం దక్కుతుంది.

శ్రీవైకుంఠవిరక్తాయ, స్వామిపుష్కరిణీతటే ।
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్ ॥

గృహలక్ష్మి

# ఈ వ్రతం అన్ని సంపదలనూ ఇస్తుంది..

- డా॥ మేడికుర్తి ఓబులేశు

శ్రీవిల్లిపుత్తూరులో గోదాదేవి అర్చామూర్తి శ్రీవటపత్రశాయిని సాక్షాత్ శ్రీకృష్ణభగవానునిగా, ఆలయాన్ని నందగోపభవనంగా, తనస్నేహితురాండ్రను గోపికలుగా, తానూ ఒక గోపికగా త్రికరణశుద్ధిగా భావించి, ఈ వ్రతం చేసింది. ఆమె కోరినఫలంగా శ్రీరంగనాథుణ్ణి పొందింది.

ఈ శ్రీవ్రతం ఇహపరఐశ్వర్యాన్ని, (ప్రేమను), భగవదనుభవాన్నీ, కైంకర్యాన్నీ (శ్రేయాన్ని) ప్రసాదిస్తుంది. ఈ నెలంతా రోజూ సుప్రభాతానికి ముందే బ్రహ్మ ముహూర్తంలో లేచి, స్నానాదులు చేసి, శుచిగా శ్రీకృష్ణునికి, గోదాదేవికి (రంగనాయకికి) పూజలుచేసి, 'తిరుప్పావు' లోని పాశురాలు అనుసంధిస్తూ, అందరూ ధనుర్మాసవ్రతం చేస్తారు. భగవంతునికృపకు పాత్రులవుతారు.

## ధనుర్మాసవ్రతం- ఒక కీలకఘట్టం

గోదా, గోపికలు సిరినోము ప్రాశస్త్యాన్నిగురించి అందరికీ చెప్పి, ఇంకా నిద్రలేవని పదిమందిగోపికలను మేల్కొలిపి, అందరూ కలిసి, వ్రతంలో 16వ రోజున సుప్ర భాతవేళలో నందగోపుని భవనానికి వచ్చారు.

'మణిమయద్వారంపుగడితీయవయ్యా' అంటూ భవనంతలుపులు తెరవమని ప్రార్థించారు. ఎందుకు? ఏమిటి? అని ద్వారపాలకులడిగితే, గోదాగోపికలు ఇలా చెప్తున్నారు. 'కన్నయ్య నిన్ననే మమ్మల్ని కలిశాడు. వ్రతానికి 'పర'వాద్యాన్నిస్తానని మాకు మాట ఇచ్చాడు. అందువల్ల మేమిప్పుడు చిన్నికృష్ణునికి సుప్రభాతం పాడి, నిద్రలేపి, ఆ 'పర'ను తీసుకువెళ్ళడానికి వచ్చాము. నీవు కాదన కుండా వెంటనే ఆ తలుపులు తెరిస్తే మేము లోపలికి వెళ్ళి, ఆ మాయావిని, మణివర్ణుణ్ణి కలుస్తాం. జగతికి మంగళం కూర్చే శ్రీవ్రతాన్ని పూర్తిచేస్తాం.'

జీవులను పరమపదానికి చేర్చేనాయకుడు ఆచార్యుడు. ఆయనే నందగోపుడు. నందగోపభవనమే మంత్రము. దానిలోపల కృష్ణభగవానుడున్నాడు. 'ఆచార్యవాన్ పురుషో వేద' ఆచార్యుణ్ణి గలవాడే భగవానుణ్ణి పొంద గలడని ఛాందోగ్యఉపనిషత్తువాక్కు.

భగవానుడు గోదాగోపికలకిచ్చే 'పర'వాద్యమే పరమపురుషార్థం భగవత్కైంకర్యం. మనోజయం (ద్వార పాలకుడు) మనఅహంకారమమకారాలు అనే తలు పుల్ని తెరుస్తుంది. గోపికలు (జీవాత్మలు), లోనికి వెళ్ళి, నంద గోపుని (ఆచార్యుని) అనుమతితో శ్రీకృష్ణభగవానుణ్ణి కలు స్తారు. ఆండాళ్, 'తిరుప్పావై' దివ్యప్రబంధంలో ఇది కీలక ఘట్టం. ఇది ప్రపన్నులు వారిఆచార్యులను ప్రీతితో సేవించే రోజు.



## ధనుర్మాసవ్రతవిధానం - నియమాలు


- తెల్లవారుజామున నాలుగుగంటలకు ముందే లేచి, స్నానాదులు చేసి, శుచిగా ఆరవేసిన తెల్లనివస్త్రాల్ని ధరించి, శుభకరమైన ఊర్ధ్వతిలకాన్ని పెట్టుకొని, ఇంటిలోని దైవసన్నిధికి చేరాలి.
- శ్రీరంగనాథుడు, శ్రీగోదాదేవి లేదా శ్రీకృష్ణుడు, శ్రీగోదా దేవిపటాలను, అర్చామూర్తులను ప్రత్యేకపీఠంపై వేంచేపు చేసి, అలంకరించి, వారిని మనస్సులో నిలుపుకొని, ఆరాధన ప్రారంభించాలి.
- అర్ఘ్య, పాద్య, ఆచమనాలను, స్నానాన్ని, చందనాన్ని, సమర్పించి, పుష్పాలతో, తులసీదళాలతో, ప్రీతితో, కేశవాదినామాలతో, శ్రీకృష్ణాష్టోత్తర, శ్రీగోదాష్టోత్తర శతనామావళులతో అర్చన చేయాలి.
- ఆ పైన ధూప, దీపాలు, ఆచమనాలు సమర్పించి, పొంగలి నైవేద్యం పెట్టాలి.
- 'లక్ష్మీచరణలాక్షాంక...., 'స్వోచ్ఛిష్టమాలికా' అనే రెండు శ్లోకాలతో మంగళనీరాజనం సమర్పించాలి.
- తర్వాత, ధనుర్మాసమహావ్రతసేవాకాలం చేయాలి. అనగా ఆళ్వార్, ఆచార్యప్రార్థన, తిరుప్పళ్ళి యెళుచ్చి (శ్రీరంగనాథసుప్రభాతం), తిరుప్పావై తమిళపాశురా లను, తెలుగుగేయాలను శ్రద్ధగా చదవాలి. 1, 3, 16, 18, 23, 24, 27, 28, 29, 30 పాశురాలను రెండుసార్లు పఠించాలి.
- తిరుప్పావైలోని 28 పాశురాలు పఠించిన తర్వాత (అనగా 'కఱవైగళ్' వరకు), అర్ఘ్య, పాద్య, ఆచమ నీయాలు సమర్పించి, ప్రత్యేకఆరగింపు (దధ్యోదనం ఫలాదులు; ఇంకా విశేషపాశురాలు వచ్చినప్పుడు పులిహోర, చక్కెరపొంగలి, భక్ష్యాలు చేయాలి). 1, 3, 16,18, 23, 24, 27, 28, 29, 30 (మొత్తం పది) పాశురాలు విశేషపాశురాలు. 'కరవైగళ్' పాశురంరోజు వ్రతంచేసేకుటుంబాలతో కలసి, 'వన విహారం' వెళ్లి రావచ్చు.
- తాంబూలం సమర్పించిన తర్వాత, నిల్చొని, కర్పూర హారతి వెలిగించి, 'మంగళాశాసన' శ్లోకాలు చదవాలి. మొదట 'అన్ఱివ్వులగం' అనే తిరుప్పావైలోని 24వ పాశురం రెండుసార్లు అనుసంధించాలి.
- ఇపుడు సువర్ణమంత్రపుష్పం సమర్పించి, చామరం వీస్తూ శాత్తుముఱై పాశురాలు-అనగా 29, 30 'శిత్తంశిరుకాలే, వంగక్కడల్' పాశురాలను రెండు సార్లు అనుసంధించాలి. హారతిస్తూనే 'కర్కటే పూర్వ ఫల్గున్యాం, తులసీకాననోద్భవామ్। పాండ్యే విశ్వం *భరాం గోదాం, వందే శ్రీరంగనాయకీమ్॥*' అనే శ్లోకాన్ని, 'నీళాతుంగస్తనగిరితటీ' అనే ఆండాళ్ ప్రార్థన శ్లోకాన్ని విన్నపం చేయాలి. తర్వాత నమస్కరించి, మంగళకరమైన మీకోరికలను మనసుతో విన్న వించాలి.
- అనంతరం ఆండాళ్ తిరునామాలను తమిళంలోను, తెలుగులోను మొదటిరెండుపాశురాలనుమాత్రం అనుసంధించాలి. వెంటనే, అందరికీ తీర్థాన్ని, ప్రసా దాలను వినియోగం చేస్తూ, 'సర్వదేశదశాకాలే'తో ప్రారంభమయ్యే ఆళ్వారాచార్యుల మంగళాశాసన శ్లోకాలు చదవాలి.
- తర్వాత ఆండాళ్వాళితిరునామాల్లోని 3, 4 శ్లోకాలు చదవాలి.
- ఇప్పుడు, 'శ్రీగోదాచతుఃశ్లోకి' అనుసంధించాలి. తుదిగా, 'క్షమాప్రార్థన' శ్లోకాలు చదవాలి.
- ఇప్పుడు, 'మంగళము శ్రీరంగమన్నారురాణికిని' అనే మంగళం, 'ఊంజల్‌సేవ' పాట మొ॥ పాడుకోవచ్చు. స్వామిసన్నిధిలో సాష్టాంగదండప్రణామం (ఆలయంలో అయితే రెండుచేతులు జోడించాలి) చేసి, 'కోయిల్ ఆళ్వార్' తలుపులు వేయాలి. ఈ కార్యక్రమం అంతా ఉదయం ఆరుగంటలలోపే పరిసమాప్తం కావాలి.
- మార్గశిరమాసంవచ్చిన రోజునుంచి, ధనుర్మాసం ప్రారంభం అయ్యేవరకు ఈ వ్రతవిధానం బాగా అధ్య

యనం చేసి, అన్నిఏర్పాట్లు చేసుకోవాలి. ముందుగా సత్సంగసభ్యులకు, బంధువర్గానికి, ఇరుగుపొరుగులకు, మిత్రులకు, భాగవతోత్తములకు, ఆచార్యులకు ఈ వ్రత సంకల్పాన్ని వినయపూర్వకంగా తెలియజేసి, వారిని ఆహ్వానించాలి.

❖ మొత్తం పదినియమాలు శ్రీ గోదాదేవి తిరుప్పావై రెండోపాశురం 'వైయత్తువాళ్వీరుగాళ్'లో సూచించారు. ఆ నియమాలు విధిగా పాటించాలి. ఇవి జీవితాంతం పాటిస్తే మరీ మంచిది. ఈ పది నియమాలలో రెండు నెయ్యి తినకుండా ఉండడం, పాలు త్రాగకుండా ఉండడం. అయితే ఆరాధనపూర్తికోసం పాయసంలో పాలు, పొంగలిలో నెయ్యి ఉపయోగించి, దైవనివేదితప్రసాదంగా తీసుకోవచ్చు. అట్లే అన్నిభోగాలకు, భోగ వస్తువులకు దూరంగా ఉండాలి.

❖ విశేషపాశురాలరోజులలో నివేదితభోగాలను ప్రసాదప్రతిపత్తితో కొద్దిగా చేతిలో ఉంచుకొని స్వీకరించాలి. వ్రతంరోజుల్లో సాత్త్వికాహారాన్ని వీలైతే ప్రసాదాన్నే మితంగా స్వీకరించాలి.

❖ సాయంకాలం శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రం పఠించి, మీ ఊరిలో జరిగే తిరుప్పావైప్రవచనం విని, రాత్రి ఇంటికి వచ్చి, పెరుమాళ్లకు అర్ఘ్య పాద్యాదికాలు సమర్పించి, ధూపదీపాలు ఇచ్చి, పండ్లు, పాలు ఆరగింపు చేసి, మంగళాశాసనం సమర్పించాలి.



❖ ఈ విధంగా 30 రోజుల శ్రీవ్రతం పూర్తిచేసి, భోగి పండుగరోజు, ఇంటిలోనే శ్రీగోదాకల్యాణం నిర్వహించాలి. లేదా మీఊరిఆలయంలో జరిగే గోదాకల్యాణానికి వెళ్లి, అక్షతలు, తీర్థప్రసాదాలు స్వీకరించి, ఇంటికి వచ్చి, కల్యాణాక్షతలు కుటుంబసభ్యులకు అందించి, వ్రతపరిసమాప్తి చేయాలి.

❖ ధనుర్మాసం ముందుగాని, తరువాత గాని కుటుంబసభ్యులు, సత్సంగసభ్యులతో కలసి, మొదట శ్రీవిల్లిపుత్తూరు, తర్వాత శ్రీరంగం– ఒకే యాత్రలో దర్శించితే– భక్తిశ్రద్ధలతో మనం ఆచరించినధనుర్మాసమహావ్రతం సుసంపన్నమౌతుంది.

గోదాదేవి శ్రీరంగనాథునితో భోగైక్యం పొందినరోజే భోగిపండుగ. అంతకుముందు సంక్రాంతిపండుగే విశేషపర్వదినం. 'భోగం' అంటే సుఖం. గోదావిషయంలో భోగం శారీరకం కాదు. ఆమె శ్రీరంగనాథునిలోనే సశరీరంగా ఐక్యమైంది.

జీవాత్మ శరీరంతోపాటు పరమాత్మలో ఐక్యకావడం గోదాదేవి మధురభక్తిలోనివిశిష్టత. ఆమె కల్యాణం ఇతరుల కల్యాణంవంటిది కాదు.

కానీ, లోకశ్రేయస్సు దృష్ట్యా రుక్మిణీకల్యాణంవలె **'గోదా శ్రీరంగనాయకులకల్యాణం'** భోగిపండుగ నాడు నిర్వహించడం సంప్రదాయమైంది. దేవతలకల్యాణాలు లోకకల్యాణం కోసమే!

# ఏరేరి తేనా నీ.. పూజకు...

- డా॥ గంగిశెట్టి లక్ష్మీనారాయణ,
94942 48348



మన పుణ్యవృక్షాలలో మహిమాన్వితమైనవృక్షం 'మారేడు' వృక్షం. సంస్కృతంలో మారేడును 'బిల్వ' అంటారు. మారేడుకు సంస్కృతంలో 39 పేర్లు. లక్ష్మీదేవిని 'బిల్వనిలయా' అనే నామంతో అర్చిస్తారు. లక్ష్మీదేవి నివసించడంవల్ల మారేడుకి విశేషమైనశక్తి వచ్చింది.

శివంకరుడైన శివుణ్ణి బిల్వపత్రాలతో పూజించడం భారతీయసంస్కృతిలో అనాదిగా ఉంది. కార్తికమాసంలో ప్రతిరోజూ శివుణ్ణి మారేడుపత్రాలతో పూజిస్తే విశేషమైన ఫలాలు కలుగుతాయి. మారేడు మూడుఆకులు కలిసి, త్రిశూల ఆకారంలో ఉంటుంది. త్రిశూలాకృతితో ఉన్న ఈ మారేడుదళమంటే శివునికి చాలాప్రీతి.

భక్తులు మూడుపత్రాలున్న ఈ మారేడు ఆకుల్ని ముక్కంటి మూడు కన్నులుగా సంభావించి, పవిత్రపత్రంగా కళ్లకు అద్దుకుంటారు.

*త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రం చ త్రియాయుధమ్, త్రిజన్మ పాపసంహారం ఏకబిల్వం శివార్పణమ్* మొదలైనశ్లోకాలు గల బిల్వాష్టకం మహిమాన్వితం. బిల్వోపనిషత్తు, శివోపనిషత్తు మహాశివునికి బిల్వవృక్షానికి గల సంబంధాన్ని చక్కగా వివరిస్తున్నాయి. సిద్ధివినాయక వ్రతం, శ్రీసత్యనారాయణవ్రతం, శ్రీవరలక్ష్మీవ్రతం అనేకవ్రతాలలో బిల్వ పత్రపూజ ఉంది.

మారేడుచెట్లను ప్రత్యేకంగా పెంచడం అనే పద్ధతి భారతదేశంలో కన్పిస్తుంది. నక్షత్రవనంలో మారేడు పెంచబడుతుంది. ఒక్కొక్క నక్షత్ర జాతకులు ఒక్కొక్కవృక్షాన్ని పెంచడంవల్ల శుభఫలాలను పొందవచ్చునని జ్యోతిశ్శాస్త్రగ్రంథాలు వివరిస్తున్నాయి. 27 నక్షత్రాలను శాస్త్రోక్తదిశలలో నాటి, ఏర్పాటుచేసేవనమే నక్షత్రవనం. ప్రాచీనకాలంలో ఋషులు. తమ ఆశ్రమాలలో నక్షత్రవనాలను పెంచేవారు.



శివపంచాయతనవనంలోని ఐదు దివ్యవృక్షాలలో మారేడు మధ్యలో ఉండి, ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. కర్ణాటక రాష్ట్రంలో చిక్కమంగుళూరు దగ్గర బిల్వపత్ర ఉద్యానవనం ఉంది. అక్కడికి దగ్గరలోనే గట్టపురగ్రామంలో మరొక బిల్వవృక్షవనం ఉంది. నల్లమల్ల కొండలలో జ్యోతిర్లింగంగా, శక్తిపీఠంగా వాసికెక్కిన శ్రీశైల క్షేత్రంలో బిల్వవనం ఉంది. కార్తికమాసంలో వనభోజనాలను భక్తులు ఈ బిల్వవనంలోనే చేస్తారు.

సాధారణంగా శివాలయాలలో మారేడువృక్షాలు పెంచబడతాయి. బిల్వవృక్షంతో ఆయా ఆలయాలకు ప్రత్యక్ష సంబంధం ఉన్న క్షేత్రాలున్నాయి. తమిళనాడు రాష్ట్రంలోని తంజావురు జిల్లాలో తిరువైకావూరులో బిల్వేశ్వరఆలయం ఉంది. తిరువారూరుజిల్లాలో కుడుమురుత్తునదికి దగ్గర కోదండపురంలో విషహరేశ్వరదేవాలయం ఉంది. ఇక్కడ స్వామి బిల్వవృక్షంక్రింద ఉంటారు. అలాగే గుజరాత్‌లోని మహదేవ్‌ఆలయం, ఒరిస్సాలోని లోకనాథ్‌ఆలయం, అస్సాం లోని బిల్వేశ్వరఆలయం ప్రసిద్ధి చెందినవి.

భారతీయసంప్రదాయ వైద్యవిధానమైన ఆయుర్వేద వైద్యంలో మారేడుకు ప్రాధాన్యం ఉంది. తిక్తపంచకంలో, గురుపంచమూలంలో, బిల్వపంచకంలో, పంచవటంలో, బిల్వాష్టకంలో బిల్వం ఒకటిగా చెప్పబడింది.

శారీరకంగా పుష్టిని కలిగి ఉంటేనే ధర్మసాధన సాధ్యం. కాయకల్పచికిత్స, వనమూలికావైద్యం, ప్రజా వైద్యాలలో మారేడును అనేకరోగాలను నిర్మూలించడానికి బలమైన ఔషధంగా వినియోగిస్తారు. మారేడు లేతఆకులు, చిగుళ్లను నీళ్లవిరేచనాలు ఆగడానికి వాడతారు. అలాగే నేత్ర వ్యాధులకు, జలుబు, ఉబ్బసం, రక్తపోటు, కామెర్లువంటి వ్యాధిచికిత్సలో మారేడు చిగుళ్లని ఉపయోగిస్తారు. మారేడు ఆకుల్ని కాన్సర్, చర్మరోగాలు, శరీరదుర్గంధం, మధుమేహం ఊబకాయం మొదలైన రోగాల తగ్గుదలకు ఉపయోగిస్తారు.



మారేడుపువ్వుల్ని కంటివ్యాధులచికిత్సలో, మారేడు కాయల్ని విరేచనాలు, ప్రసవవేదనల్ని తగ్గించడానికి, మారేడుగింజల్ని బలవర్ధకఔషధంగాను, మారేడుపండ్లను మలబద్ధకం, అల్సర్లు, ఎక్కిళ్లు, చెవిపోటు తగ్గడానికి ఉపయోగిస్తారు.

తెలుగుసాహిత్యంలో మారేడు మాహాత్మ్యాన్ని ఎందరెందరో కవులు అక్షరీకరించారు. మహామహోపాధ్యాయ కొక్కొండ వేంకటరత్నంపంతులుగారు బిల్వనాథశతకాన్ని, బిల్వేశ్వరీయమనే మహాప్రబంధాన్ని రచించారు.



బిల్వమంగళ లీలాశుకుడు సంస్కృతంలో రచించిన శ్రీకృష్ణకర్ణామృతాన్ని వెలగపూడి వెంగనామాత్యుడు తెలుగులోకి అనువాదం చేశాడు. కన్నప్ప తనస్వామి అయిన శివుడికోసం బిల్వపత్రాలను తెచ్చాడు. కన్నప్ప శ్రద్ధను బసవపురాణంలో పాల్కురికి సోమనాథుడు చక్కగా చిత్రించాడు.

మారేడు (రాజు) నువ్వని శివుడిని మారేడు పత్రాలతో పూజిస్తే అనేకశుభఫలాలు కలుగుతాయి. ఆధ్యాత్మికచైతన్యాన్ని పారమార్థికదృక్పథాన్ని కలిగించి మారేడు మానసికసంతోషాన్ని, పరిపూర్ణఆరోగ్యాన్ని, జీవశక్తిని కలిగించి, శారీరకవికాసాన్నిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఐహికఆముష్మికఫలసిద్ధికి మారేడు మహిమాన్వితమైన సాధనం.

# ఆరు మోముల వాడి ఆరుక్షేత్రాలు

**- శ్రీ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు**

*తారకాసురుడిసంహారంకోసం ఆవిర్భవించిన శ్రీసుబ్రహ్మణ్యస్వామి వివిధప్రాంతాల్లో కొలువుదీరి, అశేషభక్తుల ఆరాధనలు అందుకుంటున్నాడు. శివపార్వతుల గారాల పుత్రుడు అయిన స్వామివారు తమిళనాడురాష్ట్రంలోని వివిధ క్షేత్రాలలో స్వతంత్రదేవతామూర్తిగా కొలువుదీరి, పూజలు అందుకుంటూ ఉన్నాడు. శ్రీసుబ్రహ్మణ్యస్వామి కొలువు దీరిన క్షేత్రాలలో ఆరు ప్రధానక్షేత్రాలు. ఈ ఆరుక్షేత్రాలకు “**ఆరుపడైవీడు**” అని పేరు. వీటిస్మరణం పుణ్యదాయకం. దర్శనం మోక్షదాయకం.*

## కావడి మొక్కులదేవుడు - పళని స్వామి

పూర్వం త్రిలోకసంచారి అయిన నారదుడు కైలాసం చేరి, ఒక ఫలాన్ని శివుడికి ఇచ్చి, అమూల్యమైన బ్రహ్మజ్ఞాన ఫలాన్ని ముక్కలు కోయకుండా భుజించండి అని పలికాడు. ఫలాన్ని స్వీకరించిన శివుడు దానిని ప్రక్కనే ఉన్న పార్వతీదేవికి ఇచ్చాడు. పార్వతీదేవి దానిని కుమారులకు ఇవ్వాలని భావించింది. అయితే ఇద్దరిలో ఎవరికి ఇవ్వాలనే సమస్య ఏర్పడిన పార్వతి ఎవరైతే ముందుగా భూప్రదక్షిణ చేసి వస్తారో వారికి ఇస్తానని కుమారులకు తెలిపింది. నెమలివాహనం ఎక్కి సుబ్రహ్మణ్యస్వామి భూప్రదక్షిణకు వెళ్ళగా వినాయకుడు కైలాసంలోనే తల్లిదండ్రులకు ప్రదక్షిణాలు చేసి, భూప్రదక్షిణ చేసిన ఫలంపొంది, తల్లివద్దనుంచి జ్ఞానఫలాన్ని పొందాడు. అనంతరం భూప్రదక్షిణ చేసి, కైలాసం చేరుకున్న సుబ్రహ్మణ్యస్వామి జరిగినవిషయం తెలుసుకుని అలిగి, కైలాసం వదలి, ప్రస్తుతం పళనికొండపైకి చేరి కొలువుదీరినట్లు స్థలపురాణం చెప్తోంది.



పళనిలో ఆలయం కొండమీద ఉంది. ఈ కొండ సుమారు 485 అడుగుల ఎత్తు కలిగి “శివగిరి” పేరుతో పిలువబడుతూ ఉంది. 695 మెట్లు ఉన్న సోపాన మార్గంద్వారాగాని, రోప్‌వేద్వారాగాని, రైలుద్వారాగాని కొండమీదికి చేరుకునేందుకు సౌకర్యాలు ఉన్నాయి. విశాలమైనప్రాంగణంలో వివిధమండపాలు కలిగిన ఈ ఆలయ ప్రధానగర్భాలయంలో శ్రీసుబ్రహ్మణ్యస్వామి నిలుచుని, ద్విభుజాలతో కటిహస్తుడై మరోచేతిలో దండాన్ని ధరించి, కౌపీనధారిగా దర్శనం ఇస్తాడు. స్వామివారిని మురగన్, దండాయుధపాణి అని భక్తులు పిలుస్తారు.

నవపాషాణం అనే విశిష్టమైనశిలతో తయారుచేసిన స్వామివిగ్రహంనుంచి ధూప, దీప సమర్పణసమయంలో మూలికాపదార్థాలు వెలువడుతాయని, వాటిని పీల్చడంవల్ల వ్యాధులు నశిస్తాయని చెప్పబడుతోంది. ఈ స్వామి కావడిప్రియుడు. పూలు, పాలకావళ్లను భక్తులు స్వామివారికి సమర్పిస్తారు.



పళనిలో భక్తులకు వసతిసౌకర్యాలు లభిస్తాయి. చెన్నైనుంచి 445, మదురైనుంచి 119, కోయంబత్తూరు నుంచి 119, కన్యాకుమారి నుంచి 157 కిలోమీటర్లదూరంలో ఉన్న పళనికి అన్నిప్రాంతాల నుంచి బస్సుసౌకర్యాలు ఉన్నాయి.



## బ్రహ్మచారిగా పూజలందుకుంటున్న.. తిరుచెందూరు స్వామి

తారకాసురుడిని అంతమొందించడంకోసం ఆవిర్భవించిన శ్రీసుబ్రహ్మణ్యస్వామి తారకాసురుడు, అతనిసోదరులైన సింహబలుడు, శూరపద్ముడు నివసిస్తున్న తిరుచెందూరుకు చేరుకొని, ముందుగా శివుడిని ఆరాధించి, యుద్ధం ప్రారంభించి, ఆరురోజులు యుద్ధం చేసి, తారకాసురుణ్ణి, సింహబలుణ్ణి, అంతమొందించాడు. అనంతరం శూరపద్ముడితో యుద్ధాన్ని ప్రారంభించగా, అతను వివిధఅవతారాలు ధరించి, యుద్ధం చేశాడు. అయినా స్వామివారిధాటికి తట్టుకొనలేక మామిడిచెట్టురూపాన్ని ధరించి నిలువగా, స్వామిచెట్టును రెండుగా చీల్చిసంహారం చేశాడు. చీలినరెండుభాగాలు నెమలి, కోడిపుంజులుగా మారి, స్వామితో యుద్ధం చేయసాగాయి. అయితే స్వామివారిబాణాలధాటికి తట్టుకొనలేక నెమలి, కోడిపుంజులు శరణువేడగా, ప్రసన్నుడైన స్వామి నెమలిని వాహనంగా, కోడిపుంజును ధ్వజంగా చేసుకుని తారకాసురుణ్ణి సంహరించినచోటనే కొలువుదీరినట్లు స్థలపురాణం వెల్లడిస్తూ ఉంది. తిరుచెందూరు ఆలయం సముద్రముఒడ్డున ఉంది.





విశాలమైన ప్రాంగణంలో వివిధమండపాలను కలిగి ఉన్న ఆలయప్రధానగర్భాలయంలో శ్రీసుబ్రహ్మణ్యస్వామి చతుర్భుజాలతో కొలువుదీరి ఉన్నాడు. పుష్పమాల, కుక్కుట ధ్వజం, అక్షమాల, కటిహస్తాలతో స్వామివారు దేదీప్యమానంగా దర్శనమిస్తాడు.

స్వామివారు బ్రహ్మచారిగా కొలువుదీరిన ఈ క్షేత్రాన్ని శ్రీశ్రీశ్రీఆదిశంకరాచార్యులవారు దర్శించి, స్వామివారిని సేవించి, *'సుబ్రహ్మణ్యభుజంగప్రయాత'* స్తోత్రాన్ని రచించారు.

తిరుచెందూరులో భక్తులకు వసతిసౌకర్యాలు లభిస్తాయి. తిరునల్వేలినుంచి 53, కన్యాకుమారినుంచి 85, రామేశ్వరంనుంచి 205 కిలోమీటర్ల దూరంలో తిరుచెందూరు ఉంది. బస్సుసౌకర్యాలు ఉన్నాయి.

## దేవసేనను వివాహం చేసుకున్న... తిరుప్పరకుండ్రం

దేవసేనాధిపతిని వివాహం చేసుకోవాలనే కోరిక పూర్వం విష్ణువు కుమార్తెలైన అమృతవల్లి, సుందరవల్లులకు కలిగి, వారు స్వామిని ప్రార్థించారు. అందుకు అమృతవల్లి ఇంద్రుడికుమార్తెగాను, సుందరవల్లి శివమునికుమార్తెగాను జన్మిస్తారని, అప్పుడు నేను వివాహం చేసుకుంటాను అని వరం ప్రసాదించాడు.

దీనితో అమృతవల్లి చిన్నపిల్లగా మారి, స్వర్గం చేరగా, దేవసేన అని నామకరణం చేసి, ఇంద్రుడు పెంచి పెద్ద చేసాడు. తారకాసురుడిని అంతమొందించి తనను రక్షించిన సుబ్రహ్మణ్యస్వామికి తనకుమార్తెను ఇచ్చి వివాహం చేయాలని సంకల్పించిన ఇంద్రుడు తిరుచెందూరులో ఉన్న స్వామివారివద్దకు వెళ్లి కోరగా, అందుకు అంగీకరించిన స్వామివారు దేవతలందరిని వెంట పెట్టుకుని వచ్చి, తిరుప్పరకుండ్రంలో






వివాహం చేసుకుని అక్కడే దేవసేనతో కలిసి ఉండిపోయినట్లు కథనం. తిరుప్పరకుండ్రంలో ఆలయం శివమలై అనే కొండపై ఉంది. వివిధ మండపాలు కలిగిన ఆలయప్రధానగర్భాలయంలో స్వామివారు పెండ్లికుమారుడిగా చతుర్భుజాలతో దర్శనం ఇస్తాడు. ఈ క్షేత్రంలో అభిషేకం మూలవిరాట్టుకు కాకుండా స్వామివారిఆయుధం అయిన దండంకు చేయడం విశేషం. స్వామివారితోపాటు గర్భాలయంలో దేవసేన, విష్ణువు, దుర్గాదేవి, లక్ష్మివంటి దేవతామూర్తులు కొలువుదీరి ఉన్నారు. కాగా, మధురైలోని శ్రీమీనాక్షి సుందరేశ్వర స్వాములు తమ కుమారుడివివాహం జరిగిన ఈ క్షేత్రాన్ని ఎప్పుడూ చూస్తూ ఉంటారని కథనం.

మధురైకి కేవలం 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ క్షేత్రానికి మధురై నుంచి బస్సుసౌకర్యాలు ఉన్నాయి.

## తండ్రికే గురువైన స్వామిమలైస్వామి

పూర్వం సృష్టికర్త బ్రహ్మ ఒకసారి కైలాసానికి వెళ్ళగా చిన్నపిల్లవాడుగా ఉన్న సుబ్రహ్మణ్యస్వామి **'ఓం'** అనే ప్రణవమంత్రానికి అర్థం వివరించమని కోరాడు. బ్రహ్మ సుబ్రహ్మణ్యస్వామిని పట్టించుకోలేదు. సమాధానం ఇవ్వలేదు. దీనితో బ్రహ్మదేవుణ్ణి సుబ్రహ్మణ్యస్వామి బంధించాడు. దీనితో సృష్టి ఆగిపోయింది. దేవతలందరూ బ్రహ్మను విడిపించమని కోరారు. శివుడు కుమారుడికి సృష్టి ఆగిపోయిన విషయాన్ని వివరించి, బ్రహ్మను వదిలిపెట్టమని



చెప్పడంతో పాటు "ప్రణవమంత్రఅర్థాన్ని నేనుకూడా తెలుసుకోవాలనుకుంటూ ఉన్నాను. నాకు దానిఅర్థాన్ని బోధించు" అని పలికాడు. తండ్రిమాటమేరకు స్వామి బ్రహ్మను విడిచిపెట్టి... "మీరు శిష్యుడిగా మారి, నన్ను గురువుగా అంగీకరిస్తే ప్రణవమంత్రఅర్థాన్ని బోధిస్తాను అని పలికాడు. అందుకు శివుడు అంగీకరించి, సన్యాసి వేషం ధరించి, సుబ్రహ్మణ్యస్వామివారిని గురువుగా అంగీకరించడంతో, శ్రీసుబ్రహ్మణ్యస్వామి శివుడికి ప్రణవమంత్రం అర్థాన్ని బోధించి, అనంతరం శ్రీస్వామినాథుడు పేరుతో స్వామిమలైలో కొలువు దీరినట్లు స్థలపురాణం వెల్లడిస్తూ ఉంది.



స్వామిమలై ఆలయం చిన్న కొండపై ఉంది. ఆలయానికి వెళ్లే సోపాన మార్గంలో ఉన్న 60 మెట్లు అరవై సంవత్సరాలకు ప్రతీకగా చెప్పబడుతున్నాయి.

మూడుప్రాకారాలున్న ఆలయం ప్రాంగణంలో, మూడవప్రాకారంలో ప్రధానఆలయం ఉంది. ప్రధానగర్భాలయంలో స్వామివారు ద్విభుజాలతో కొలువుదీరి ఉన్నాడు. ఒకచేతిలో దండమును ధరించిన స్వామివారు మరోచేతిని కటిహస్తంగా ధరించి దర్శనం ఇస్తాడు. స్వామివారిని భక్తులు స్వామినాథుడు, గురునాథుడు, శివగురునాథుడు అనేపేర్లతో పిలుస్తారు. ఇంకా ఆలయంలో వినాయకుడు, శ్రీమీనాక్షీసమేతశ్రీసుందరేశ్వర స్వామి, వజ్రతీర్థంగా పిలువబడే ఆలయపుష్కరిణులను దర్శించుకోవచ్చు.

స్వామిమలైలో భక్తులకు వసతిసౌకర్యాలు ఉన్నాయి. కుంభకోణంనుంచి కేవలం 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న స్వామిమలైకి కుంభకోణంనుంచి బస్సుసౌకర్యాలు ఉన్నాయి.

## శ్రీవల్లిని వివాహం చేసుకున్న తిరుత్తణి స్వామి

పూర్వం ప్రస్తుత తిరుత్తణి ప్రాంతంలో వల్లమలై అనే కొండమీద శ్రీవల్లి సుబ్రహ్మణ్యస్వామిని భర్తగా కోరి, తపస్సు చేయడం ప్రారంభించింది.

ఆమె తపస్సును మెచ్చి, వల్ల మలైకి చేరుకొని శ్రీవల్లిని వివాహం చేసుకుని శ్రీదేవసేన, శ్రీవల్లి సమేతుడై అక్కడే నివాసం ఏర్పరచుకుని శాశ్వతంగా ఉండిపోయినట్లు, అదే తిరుత్తణి క్షేత్రమని స్థలపురాణం వెల్లడిస్తూ ఉంది.




తిరుత్తణి క్షేత్రంలో ఆలయం కొండమీద ఉంది. 360 మెట్లు ఉన్న సోపానమార్గంద్వారాగాని, ఘాట్‌రోడ్ ద్వారాగాని ఆలయంకు చేరుకోవచ్చు. మూడుప్రాకారాలు, విశాలమైనమండపాలు కలిగిన ఆలయంలోని ప్రధాన గర్భాలయంలో శ్రీసుబ్రహ్మణ్యస్వామివారు ద్విభుజాలను కలిగి, జ్ఞానదండం, కటిహస్తములతో ఇరువైపులా దేవేరులతో స్వామివారు దివ్యమనోహరరూపంతో దర్శనమిస్తారు.

తిరుత్తణిలో భక్తులకు వసతిసౌకర్యాలు లభిస్తాయి. చెన్నైనుంచి 86, తిరుపతినుంచి 65 కిలోమీటర్ల దూరంలో రేణిగుంట చెన్నై ప్రధానరైలు మార్గంలో ఉన్న తిరుత్తణికి బస్సు, రైలు సౌకర్యాలు ఉన్నాయి.


## తపస్సు చేసిన పఝుముదిల్ సోలై స్వామి

తారకాసురసంహారంకోసం శివపార్వతుల కుమారుడుగా జన్మించిన శ్రీసుబ్రహ్మణ్యస్వామి దేవసేనాధిపత్యం వహించి, తారకాసురుణ్ణి, అతనిసోదరులను అంతమొందించి, దేవతలతో పాటు సర్వలోకాలను రక్షించి, అనంతరం దేవసేన-శ్రీవల్లి, దేవులను వివాహం చేసుకొని కొంతకాలం తిరుత్తణిలో నివాసం ఉన్నాడు.

అనంతరం తన కర్తవ్యం పూర్తి కావడంతో ఈ ఐహిక సుఖాలకు దూరంగా ఉండాలని భావించి,







వైయైనదీతీరంలో అటవీప్రాంతానికి చేరుకొని, నదిలో స్నానం ఆచరించి, అక్కడే తపస్సు చేసుకుంటూ ఉండిపోయి నట్లు స్థలపురాణకథనం.

ఈ క్షేత్రాన్నే పఝముదిల్‌సోలై. దీనినే పళముదిల్ శులై, అఝుగర్ కోయిల్ అనేపేర్లతోకూడా పిలుస్తారు.

## వైకుంఠపాళి
### :: 60 – సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 ప్ర | తి | 2 విం | ద్యు | డు | | 3 తా | ట | క |
| | | దు | | | | ర | | |
| 4 రా | ధ | | 5 తు | 6 ల | సి | | 7 ర | తి |
| త్రి | | 8 త్రి | | జ్జ | | 9 హి | | |
| | 10 స్మృ | తు | లు | | 11 సు | తు | డు | |
| 12 తం | | డు | | 13 సు | | డు | | 14 మా |
| 15 తు | ష్టి | | 16 సం | క | ల్పి | | 17 ర | మ |
| | | 18 దా | | న్య | | 19 ధ | | |
| 20 మం | ద | ర | ము | | 21 పు | ర | జి | త్తు |

అటవీప్రాంతంలో ఆలయం ఉంది. చిన్న ఆలయం. ప్రధానగర్భాలయంలో శ్రీసుబ్రహ్మణ్యస్వామి అందమైన రూపంతో చతుర్భుజుడుగా ఇరుదేవేరులతో కొలువుదీరి ఉన్నాడు. స్థానికులు స్వామివారిని కల్వఘర్ అని పిలుస్తారు. స్వామివారు ధరించిన ఆయుధం పాషాణంతో చేసి ఉండడం విశేషం. ఈ స్వామివారిని దర్శించి పూజించడం వల్ల విద్య, విజ్ఞానం వృద్ధి చెందుతాయి.

ఈ క్షేత్రంలో భక్తులకు పెద్దగా వసతిసౌకర్యాలు లభించవు. మధురైనుంచి వెళ్లి రావడం మంచిది. మధురై నుంచి కేవలం 19 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈక్షేత్రానికి మధురైనుంచి బస్సుసౌకర్యాలు ఉన్నాయి.

ఈవిధంగా శ్రీసుబ్రహ్మణ్యస్వామివారు కొలువుదీరిన ఆరుపడైవీడును దర్శించడంవల్ల ఇహంలో సౌఖ్యం, పరంలో మోక్షం సిద్ధిస్తాయని నమ్మకం.

## అన్నమయ్యకు వైష్ణవయతి పంచసంస్కారాలు చేయుట..

భక్తసులభుడైన ఆ భగవంతుడు ఈ భక్తశిఖామణి గానమాధుర్యానికి పరవశించాడు. ఒకనాడు తిరుమలలో నివసించే 'ఘనవిష్ణు'వనే వైష్ణవయతికి స్వప్నంలో సాక్షాత్కరించి "తాళ్లపాక అన్నమయ్య నాభక్తుడు. చిన్నవాడు. బ్రహ్మచారి. చెవిపోగులు ధరించి ఉంటాడు. నేను అడగకుండానే పట్టునూలు కుచ్చులతో అలంకరించిన తంబురను మీటుతూ నాపై సంకీర్తనలు పాడుతూ, నన్ను ఆనందింపచేస్తున్నాడు. రేపు నీ దగ్గరకు వస్తాడు. కాలయాపన చేయక నాకు మారుగా నీవు అతనిని శంఖచక్రాంకితునిగా చేయు" మని ఆజ్ఞాపించి, అంతర్ధానమయ్యాడు. వెంటనే నిద్రనుండి మేల్కొన్న ఘనవిష్ణువు స్వామికృపను వేనోళ్ళ కొనియాడాడు.

స్వామిఆనతిని పాటించాలన్న తొందరలో మరుసటి ఉదయం నిత్యకర్మలను వేగంగా ముగించి, చేతిలో శంఖచక్రముద్రలు పట్టుకొని వాకిట్లోకి వచ్చి, అన్నమయ్య కోసం ఘనవిష్ణువు ఎదురుచూడసాగాడు. అదే సమయంలో శ్రీహరిసంకీర్తనలు చేసుకొంటూ ఘనవిష్ణువునివాసప్రాంతానికి వచ్చాడు అన్నమయ్య. ఆ బాలునిరూపాన్ని అపురూపంగా చూశాడు ఘనవిష్ణువు. కలలో స్వామి చెప్పిన ఆనవాళ్ళు గ్రహించాడు. స్వామి ఆజ్ఞ పాటించపోతున్నందుకు సంతోషపడ్డాడు. ఆ బాలుడిని దగ్గరకు పిలిచాడు. పేరడిగాడు. అతను తన పేరు చెప్పి, ఆ మునికి సాష్టాంగనమస్కారం చేశాడు. గాఢాంధకారాన ఉన్నవాడికి వెలుతురును ఒకరు పరిచయం చేయాలా? తుమ్మెదలకు పుష్పాలను ఒకరు పరిచయం చేయాలా? జ్ఞానార్థికి సద్గురువును ఒకరు పరిచయం చేయాలా?





తనపట్ల బాలుడు చూపించిన భక్తిప్రపత్తులకు ఘనవిష్ణువు పొంగిపోయాడు. *'మునినాథుఁడాతని ముద్దు సేయుచును । తనచేత నీవు ముద్రాధారణంబు । గొనకని సేయించుకొనఁగ నోపుదువె'* అని అన్నమయ్యఅభిమతాన్ని కనుక్కొని, స్వప్నంలో రమాపతి చెప్పినవిధంగా వేదోక్త ప్రకారంగా ఘనవిష్ణువు అన్నమయ్యను శంఖచక్రాంకితుడిని చేశాడు. అలా అన్నమయ్య ఘనవిష్ణువనే వైష్ణవయతిచేత పంచసంస్కారవంతుడయ్యాడు.

### తాళ్లపాకకు తిరుగుప్రయాణం

అటు తమపుత్రుడు కనపడక నారాయణసూరి, లక్కమాంబలు ఊరంతా వెతికి, చుట్టుప్రక్కల గ్రామాలను గాలించారు. తమకు పుత్రభాగ్యాన్ని కలిగించిన వేంకటేశుడే తమకు పుత్రుణ్ణి తిరిగి ఇప్పించగలడని నమ్మి తిరుమలకు చేరుకున్నారు. ఆ దంపతులు తిరుమలలో స్వామిని సంకీర్తనలతో అర్చిస్తున్న అన్నమయ్యను చూశారు. తల్లి బిడ్డను చూచి కరిగిపోయింది. ఇంటికి రమ్మని బ్రతిమాలింది. అన్నమయ్య ఇంటికి రానన్నాడు. తల్లిమనసు విలవిలలాడింది. అర్చక స్వాములుకూడా ఆ తల్లిబాధ చూడలేక అన్నమయ్యకు నచ్చజెప్పారు. ఇక్కడిస్వామి మీఊరిలోకూడా ఉన్నారన్నారు. అయినా అన్నమయ్య వినలేదు.

ఆరోజురాత్రి అన్నమయ్యకు కలలో స్వామి సాక్షాత్కరించాడు. "నాయనా! మీ వంశంవారు వేద, ఉపనిషత్తుల సారాన్ని ఇతరులకు చెప్పగలిగిన నేర్పుగలవారు. దేహం (శరీరం), దేహి (శరీరాన్ని పొందినది) వేరని తెలుసుకో. సమస్తప్రాణులను నీతో సమానమైనవనే విషయాన్ని దృష్టిలో ఉంచుకో. నీ అన్ని బరువుబాధ్యతలను నాపై వేసి, నన్ను శరణువేడు. నేను నీకు శుభం కలుగజేస్తాను" అని బోధించి, "కుమారా! తల్లి చెప్పిన మాటను నిరాకరించక ఆమెవెంట వెళ్ళిరా!" అని ప్రబోధించాడు. అన్నమయ్య నిద్రనుండి మేల్కొని, ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పాడు. ఆ స్వప్నాన్నే ఆజ్ఞగా భావించి, తల్లిదండ్రుల వెంట తనఊరు చేరుకున్నాడు.

*(ఇంకా ఉంది)*



# మీ పిల్లలకు చెప్పండి..!!

– డా॥ కప్పగంతు రామకృష్ణ, 90320 44115

**చదువు అంటే కేవలం అక్షరాల జ్ఞానం మాత్రమే కాదు. అదో అంతులేని విజ్ఞాన సాగరమథనం. దానికోసం కష్టాలు పడాలి. కన్నీళ్లకు ఎదురీదాలి. పరీక్షలకు నిగ్గుతేలాలి. అవాంతరాలను అధిగమించాలి. అయినా ఇష్టంతో సాధన చేస్తే సిసలైన సంపద మీ సొంత మవుతుందని.. మీ పిల్లలకు చెప్పండి.. జ్ఞానార్జన కోసం తపించిన ఈ విద్యార్థుల గురించి వివరించండి.**

## తలకెక్కితే తిప్పలే!

*ఎంత నేర్చుకున్నా విద్యార్థికి గర్వం ఉండకూడదు ఈ ఒక్క దుర్లక్షణంవల్ల నేర్చుకున్నదంతా నిరుపయోగమై పోతుంది.*

యాజ్ఞవల్క్యుడు జైమినివద్ద సామవేదం, అరుణి మహర్షివద్ద అథర్వణవేదం అధ్యయనం చేశాడు. ఆ తర్వాత వైశంపాయనుడి వద్దకు యజుర్వేదం నేర్చుకోవటానికి వెళ్ళాడు. ఆ ఋషి వద్ద వేదంతో పాటు మరెన్నో విషయాలు నేర్చుకున్నాడు. తనను మించిన విద్యావంతుడలేడనే అహంకారం అతడిలో ఏర్పడింది. ఓసారి వైశంపాయనుడికి బ్రాహ్మణుణ్ణి కాలితో తన్నినదోషం తగిలింది. అతడిపాపాన్ని పోగొట్టేశక్తి తన వద్దమాత్రమే ఉందంటూ గురువుతో గర్వంగా పలికాడు యాజ్ఞవల్క్యుడు. దీంతో ఆగ్రహించిన గురువు తాను నేర్పిన విద్యను పూర్తిగా వదలి వెళ్ళిపొమ్మని అతడిని శపించాడు. దీంతో నేర్చుకున్న విద్యను రక్తపుముద్దల రూపంలో అక్కడే వదలి వెళ్ళాడు. వాటిని స్వీకరించిన తిత్తిరి పక్షులు వేదాల్ని పలికాయి. అవే కృష్ణ యజుర్వేదంగా ఆవిర్భవించాయి. ఆ తరువాత యాజ్ఞవల్క్యుడు సూర్యుడిని ఉపాసన చేసి, ఆయన ద్వారా శుక్లయజుర్వేదం నేర్చుకోవాల్సి వచ్చింది.



## దేవతలే దిగిరారా..

*ఆటంకాలకు లొంగితే జ్ఞానశూన్యుడిగానే మిగిలి పోవాల్సి వస్తుంది. కష్టాన్ని తట్టుకుంటేనే విజ్ఞాన లోకానికి దారి తెలుస్తుంది.*

జాబాలికి తండ్రి ఎవరో తెలియదు. తల్లి జాబాల అతడికి ఉపనయనసంస్కారం చేసి, గురువు హరిద్రుమతుడివద్దకు విద్యాభ్యాసానికి పంపింది. తండ్రి ఎవరో తెలియకపోవడంతో అవమానాల పాలయ్యాడు. విద్య నేర్చుకునే సమయం వచ్చేవరకు గోవుల్ని మేపుతూ అడవిలోనే ఉండమని ఆదేశించాడు గురువు. మరోమాట మాట్లాడకుండా అడవికి చేరుకున్నాడు జాబాలి. కానీ, మనస్సుమాత్రం నిత్యం జ్ఞానాన్వేషణ కోసం పరితపిస్తూనే ఉంది. అతడిసత్య నిష్ఠకు మెచ్చుకున్న దేవతలే స్వయంగా అతడు మేపుతున్న గోవుల్లో చేరి, బ్రహ్మ జ్ఞానాన్ని ఉపదేశం చేస్తారు. ఆశ్ర



మానికి చేరుకున్న జాబాలిముఖంలోని దివ్యతేజస్సు చూచి గురువు ఆశ్చర్యపోతాడు. అప్పటినుంచి సత్యకామజాబాలిగా జాబాలి లోకప్రసిద్ధి పొందాడు. విద్యార్థికి నేర్చుకోవాలన్న తపన, స్థిరచిత్తం ఉంటే దైవమే దిగి వస్తుందనటానికి ఇతని కథ చక్కటి ఉదాహరణ.

## ప్రలోభాలకు లొంగకుండా...

*తాను నేర్చుకోదలచిన విషయంమీద విద్యార్థికి పట్టుసడలనిశ్రద్ధ ఉండాలి. ఎన్నిఆకర్షణలు వచ్చినా వాటికి బందీ కాకూడదు.*

తండ్రి వాజశ్రవుడు కోపంతో 'నిన్ను యముడికి దానం చేస్తా'నని అనటంతో అతనిమాట నిలబెట్టడం కోసం నచికేతుడు నేరుగా యమలోకానికి వెళ్ళాడు. యమ దర్శనంకోసం ద్వారంవద్ద మూడురోజులు నిరీక్షించాల్సి వచ్చింది. దివ్యతేజస్సుతో ఉన్న బాలుడు తనకోసం నిరీక్షించిన విషయం తెలుసుక్ను యమధర్మరాజు దర్శన మిచ్చి, ముచ్చటపడి వరాలు కోరుకోమన్నాడు అప్పుడు నచికేతుడు వరాలుగా తనప్రశ్నలకు సమాధానం ఇమ్మని అడిగాడు. మరణంతర్వాత మనిషి ఏమవుతాడు? జనన మరణచక్రాలసంచారం ఎందుకు?... అనేవి ఆ ప్రశ్నలు.



అప్పుడు యముడు ఇదంతా బ్రహ్మజ్ఞానం. నీ వయస్సు చిన్నది. నీకు అర్థం కాదు. నీకు మణులు, బంగారం, ఇంకా చాలా ఇస్తానని ప్రలోభపెట్టాడు. నాకు ఇవేమీ వద్దు. ఆత్మజ్ఞానమే ముద్దు అంటూ పట్టుబట్టాడు నచికేతుడు. బాలుడిశ్రద్ధకు అబ్బురపడిన యముడు అతడికి ఆత్మజ్ఞానాన్ని బోధిస్తాడు. ఇదే కఠోపనిషత్‌గా అవతరించింది.

## హనుమకథ వినుమా!

*చదువు సుఖంగా అందదు. ఇందుకోసం తపించాలి. వేగం, పట్టుదల, ధారణ, కష్టానికి తట్టుకునేశక్తి విద్యార్థికి చాలా అవసరం. ఇవన్నీ ఉంటేనే నేర్చుకోవటం సాధ్యమవుతుంది.*

తల్లి ఆదేశంతో సూర్యభగవానుడివద్ద విద్య నేర్చుకునేందుకు వెళ్ళాడు హనుమ. నేను ప్రతిక్షణం సంచరిస్తూ ఉంటాను. నా దగ్గర చదువుకోవటం సాధ్యం కాదన్నాడు సూర్యుడు. అయినా పట్టువదలకుండా తూర్పు, పశ్చిమ పర్వతాలమీద చెరో కాలు ఉంచి, సూర్యగమనానికి అనుగుణంగా ముఖంవరకు తన శరీరాన్ని తిప్పుతూ విద్యాభ్యాసం చేశాడు ఆంజనేయుడు. ఇంతటిసాధన చేశాడు కాబట్టే నవవ్యాకరణ పండితుడయ్యాడు.



ఎవరెన్నివిధాలుగా నిరుత్సాహపరిచినా, చివరకు ఎంచుకున్న గురువే వద్దని వారించినా నిరుత్సాహపడకూడదు. విద్య నేర్చుకునే విషయంలో ఏర్పడేవిఘ్నాలే ఇవన్నీ అనే స్పృహ కలిగి ఉండాలి. వాటిని తీర్చుకునేందుకు ప్రత్యామ్నాయాలు ఆలోచించాలి. అప్పుడే ఆశించిన లక్ష్యాన్ని చేరుకోవచ్చని హనుమ నిరూపించాడు.

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-02

రచన - మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య

నిర్వహణ - మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

## పాఠకులకు కొన్ని సూచనలు

01) ప్రతిపాఠములోని పదాలను కంఠస్థము చేయాలి.

02) చదివిన పాఠములను నిత్యము ఐదు (లేక) ఆరుసార్లు చింతన చేయాలి.

03) ప్రతిపాఠము క్రింద అభ్యాసార్థము సంస్కృతములో వ్రాయబడిన వాక్యాలను తెలుగులోకి, తెలుగులో ఉన్న వాటిని సంస్కృతములోకి సరిగా మార్చి చెప్పాలి.

04) మార్చునపుడు ఆయా పాఠంలోని పదాలను చూడరాదు.

05) మీ ఇంటిలోని వారితోను/తోటివారితోను సిగ్గుపడక వచ్చినంతవరకు సంస్కృతంలో మాట్లాడాలి. వారిని కూడా మాట్లాడమని ప్రోత్సహించాలి.

06) అభ్యాసములో ఇచ్చిన వాక్యముల వంటి వాటిని అనేకములు కల్పించుకొని ప్రయత్నించాలి.

07) చిన్న చిన్న కథలను చిన్న చిన్న సంస్కృత వాక్యములో చెప్పుచు వ్రాయుచు ఉండాలి.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ते | = | వారు | कदा? | = | ఎప్పుడు | सन्ति | = | ఉన్నారు |
| यूयं | = | మీరు | तदा | = | అప్పుడు | स्थ | = | మీరున్నారు |
| वयं | = | మేము | इदानीं | = | ఇప్పుడు | स्मः | = | ఉన్నాము |

**అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?**

01) त्वं तदा तत्रासि
02) ते सन्ति
03) यूयं स्थ
04) वयं स्मः
05) ते इदानीं कुत्र सन्ति?
06) यूयं कदा अत्र स्थ?
07) वयं तदा अत्र स्मः
08) सः इदानीं कुत्रास्ति?
09) अहं इदानीं अत्रास्मि
10) यूयं कुत्र स्थ?

**అ) జవాబులు**

01) నీవు అప్పుడక్కడ ఉన్నావు 02) వారున్నారు
03) మీరు ఉన్నారు 04) మేము ఉన్నాము
05) వారిప్పుడు ఎక్కడనున్నారు? 06) మీరు ఎప్పుడు ఇక్కడ ఉన్నారు?
07) మేము అప్పుడు ఇక్కడ ఉన్నాము 08) వాడు ఇప్పుడెక్కడ ఉన్నాడు?
09) నేను ఇప్పుడిక్కడ ఉన్నాను 10) మీరు ఎక్కడ ఉన్నారు?

**ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?**

01) నేనిపుడక్కడ ఉన్నాను
02) మీరిపుడక్కడ ఉన్నారు
03) మేము అప్పుడెక్కడ ఉన్నాము?
04) వారిపుడక్కడ ఉన్నారు?
05) మీరిపుడక్కడ ఉన్నారు?
06) మేమపుడున్నాము
07) వారున్నారు
08) మీరున్నారు
09) మేమున్నాము
10) వారెక్కడ ఉన్నారు?

**ఆ) జవాబులు**

01) अहं इदानीं तत्रास्मि 02) यूयं इदानीं तत्र स्थ
03) वयं तदा कुत्र स्मः? 04) ते कदा तत्र सन्ति?
05) यूयं कदा तत्र स्थ? 06) वयं तदा स्मः
07) ते सन्ति 08) यूयं स्थ
09) वयं स्मः 10) ते कुत्र सन्ति?

# తిరుప్పావై

**రచన-శ్రీదేవీమురళీధర్, పుటలు-130, సైజు-1/8 డెమ్మీ, వెల- రూ.300/-(పోస్టల్ ఛార్జీలతో కలిపి), ప్రతులకు- శ్రీదేవీ మురళీధర్, 1503, ఫోయినిక్స్-ఏ, మీనాక్షి స్కైలాంజ్, కొండాపూర్, ఖాన్‌మెట్, హైదరాబాదు - 500 081. (తెలంగాణా) ఈ-మెయిల్:** vbrsht@gmail.com


శ్రీమతి శ్రీదేవీమురళీధర్ రచించిన తిరుప్పావై లఘువివరణ పండితపామరపఠనయోగ్యంగా ఉంది. ఆనందరసానుభూతికి ఉనికిపట్టై ఉంది. ఇందులో ముందుమాట అత్యంతసంగ్రహంగా ఉండి, రచయిత్రి స్వోత్కర్ష లేకుండా పాఠకులకు తిరుప్పావై పరిచయం కల్గిస్తూ అందులోని విశిష్టతను, పూర్వాచార్యులు ప్రశంసించిన వైనాన్ని విన్నవించారు. ముందుమాట చివరలో "చేతను లందరికీ (మానవులకు) ప్రేమమార్గంలో పురోగమించి ఆధ్యాత్మికసమాగమాన్ని అందుకునే ఉపాయం విడమరచి చెప్పింది గోదాదేవి" అనే వాక్యం ఫలశ్రుతివంటిదై ఉంది.

ఆండాళ్ విష్ణుచిత్తులచరిత్రకు ముందుగా గోదా చతుశ్శ్లోకీశీర్షికన నాలుగుశ్లోకాలు ఇచ్చారు రచయిత్రి. వీటిలో మొదటిది "గోదాదేవి ఎప్పుడు? ఎక్కడ? అవతరించిం"దనే విషయంతో 'గోదాం వందే' అంటూ నమస్కారం, తక్కినమూడుశ్లోకాలు "నిత్యమంగళం" అంటూ గోదా తల్లికి 'మంగళాశాసనం' చేసేవి. ఈ శ్లోకానుక్రమణిక లోనూ చతుర్విధపురుషార్థప్రాప్తినీ, అంతశ్చతుష్టయ శుద్ధినీ రచయిత్రి స్ఫురింపజేశారు. 12, 13 పుటల్లో యతివరేణ్యులైన రామానుజులవారు తిరుప్పావైనీ, గోదాదేవినీ ఎంతగా అభిమానించి, ఆ తల్లిని సోదరిగా భావించి, గౌరవించారో స్పష్టం చేశారు. 14వపుటలోని 'గోదాచరితం' సంగ్రహంగా చెప్పినా, పాఠకులు తిరుప్పావై పాశురాలను పఠించేముందు మరోమారు ఇందులోని విశిష్టతను గుర్తించుకునేటట్టుగా ఉంది. 15వ పుటనుండి 25వ పుట వరకు ఉపోద్ఘాతంలో తిరుప్పావై విశిష్టతలు, వ్యాఖ్యాతలవిశేషాలు, స్త్రీల అభ్యున్నతికీ, ఆధ్యాత్మిక జీవనవికాసానికీ గోదాదేవి ఆరోజుల్లో తనపాశురాలద్వారా చేసినకృషిని శ్లాఘించారు రచయిత్రి. 'తిరుప్పావై' నిర్మాణవిధానాలు, విషయవిభాగం, అర్థపంచకవిశేషాలూ చక్కగా వివరించారు. 26వ పుట నుండి పాశురాల వ్యాఖ్యానం మొదలౌతుంది. పాశురాలకు ముందుగా అందులోని అర్థాల్ని స్ఫురింపజేసే వర్ణచిత్రాలు కూడా ఉండడం ముఖానికి తిలకంలాగా ప్రకాశిస్తున్నాయి. ప్రతిపాశురంలో అవతారిక, భౌతికార్థం, అంతరార్థం, దివ్య సందేశం ఉండేటట్టుగా విషయాన్ని విభాగించి చెప్పడం అనే సత్సంప్రదాయాన్ని పాటించారు రచయిత్రి.

పాశురవ్యాఖ్యానం రెండు, మూడుపుటలకు మించకుండా ముక్తసరిగా, ముచ్చటగా చదువుకోవడానికీ, హృదయానికి హత్తుకునేందుకూ పునఃపునః స్మరించుకుని భక్తిరసామృతాన్ని ఆస్వాదించేందుకూ ఉత్తమకృషిచేసిన శ్రీదేవీమురళీధర్ అభినందనీయ! వందనీయ!

ముద్రణ, వ్యయం విషయాలలో రచయిత్రి ఎక్కడా రాజీపడలేదు. మంచి ఆర్టుపేపరుపై ముద్రించడం, అక్షరాలను ముత్యాల్లాగా పంక్తులలో కూర్చడం ఆహ్లాదకరంగా ఉంది. పుస్తకాన్ని చదవడంలో పాఠకులకు విసుగు రానీకుండా చాలాజాగ్రత్తలు తీసుకున్నారు రచయిత్రి. చాలా పుస్తకాల్లోవలే ఇతరుల అభిప్రాయాలూ, ప్రశంసలూ, దీవెనలు మొదలైనవి ఈ పుస్తకంలో లేవు. ఈరోజుల్లో ఇలాంటి పుస్తకాలు చాలా అరుదు.

## గ్రంథసమీక్ష




భక్తిబంధురమైన వ్యాఖ్యానమిది. ఇంకా ఎన్నో స్తోత్రాలకు వ్యాఖ్య ఈ రచయిత్రిద్వారా లోకానికి అందాలని, శ్రీగోదారంగనాయకులు అలాంటి శక్తిసామర్థ్యాలు ఈ రచయిత్రికి ప్రసాదించాలనీ ఆకాంక్ష!

- డా॥ కంపల్లె రవిచంద్రన్.

# శ్రీకృష్ణశ్శరణం మమ

(డా॥ టి.శ్రీరంగస్వామి విరచిత నీలమోహనాష్టకానికి వ్యాఖ్యానం)

వ్యాఖ్యాత - డా॥ కంపల్లె రవిచంద్రన్, పుటలు-180, సైజు-1/8 డెమ్మీ, వెల- రూ.150/-, ప్రతులకు- శ్రీ టి.శ్రీరంగస్వామి, ఇ.నెం.27-14-53, మండల కార్యాలయం ఎదురుగా, హసన్‌పర్తి- 506 371, వరంగల్. సెల్-99498 57955.

## గ్రంథసమీక్ష

సాహిత్యాన్ని రెండురకాలుగా విభజించి చూడవచ్చు. అవి బహిరంగసాహిత్యం, అంతరంగ సాహిత్యం. సమాజాన్నుద్దేశించి రాసిందంతా బహిరంగ సాహిత్యమే. అలాగాకుండా తన స్వీయఘోషను, ఆధ్యాత్మికచింతనను తెలిపేదంతా అంతరంగసాహిత్యం.

సంస్కృతంలో జయదేవుని గీతగోవిందం, లీలాశుకుని శ్రీకృష్ణకర్ణామృతంవంటివి ఇలాంటి అంతరంగచింతనకు చెందినవి! కృష్ణభక్తి సారామృత స్వరూపంగా సాగిన ఇలాంటి సాహిత్యం కొంతకాలం అరకొరగా ఉన్నా, ఆధునిక కాలంలో ఆ ప్రక్రియకు ప్రాధాన్యతనిచ్చి, ఛందోసంకెళ్లను కాస్త సడలించి, వచనకవితారూపంలోకి లలితంగా వంపుకున్న ప్రసిద్ధ కవి డా॥ శ్రీ టి.శ్రీరంగస్వామి. ఈయన 'నీలమోహనాష్టకం' పేరుతో వచన అష్టకాలను రచించారు. దీనికి మరో ప్రసిద్ధ సాహితీ సహవాసి, విశ్లేషకుడు అయిన డా॥కంపల్లె రవిచంద్రన్ 'శ్రీకృష్ణశ్శరణం మమ' పేరుతో అద్భుతమైన వ్యాఖ్యానం రాశాడు.

ఈ అష్టపదుల అక్షరార్థమంతా జగమంతా కృష్ణమయమేనని చాటి చెప్పడమే. దాని కాలంబనంతా మధురభక్తితత్త్వసారమే. "మోహనవంశీ భావభూమి కనై" అని ఆరంభమయ్యే ఈ వచన అష్టకం యొక్క విశిష్టతను, అందులోని గాఢతను డా॥ కంపల్లె విశ్లేషించిన వైనం పాఠకుల్ని అబ్బురపరుస్తుంది.

ఈ ఆరంభాష్టకభాగంలో శ్రీరంగస్వామి తన అష్టకసాహిత్యాన్ని తన నాలుగుదృఢభావస్తంభాలతో ఎలా నిలబెట్టారో చెబుతూ రవిచంద్రన్ అష్టకసాహిత్యం అష్టప్రకృతితో కూడిన ప్రపంచానికి సంకేతమని విశ్లేషిస్తాడు. అందరికీ తెలిసిన పంచభూతాలతో బాటు మనస్సు, బుద్ధి, అహం అనే ఎనిమిది ప్రకృతుల ప్రకృష్ట సమ్మిళిత నిర్మాణంగానే భౌతికసృష్టి ఏర్పడిందని భగవద్గీతశ్లోకం(7-4)తో నిరూపిస్తాడు. కంటితో చూసిన శ్రీకృష్ణమూర్తిమత్వం నయనాలవాహికతో కవి యొక్క అంతఃప్రపంచంలోకి వెళ్లి, హృదయంలోకి ఇంకి పోయిన ఆ దివ్యలోకాతీత ఆత్మికసౌందర్యానికి ముగ్ధుడైపోయి శ్రీరంగస్వామి అష్టకాక్షరరూపంలో దాన్ని ఎలా వ్యక్తం చేశాడో డా॥ కంపల్లె చెప్పిన తీరు ఆధ్యాత్మికోల్లాసాన్ని కలిగిస్తుందనడంలో సందేహం లేదు.

పరమాత్మతత్త్వభావుకులకు ఈ సుందర ప్రకృతి అంతా ఒక సుందరాంగిలాగాను, దాన్ని తన కరుణాచరణాలకు చేర్చుకునే మహాపురుషుడు పరమాత్మేనని, ఆ పరమాత్మ ప్రతిదేహంలోను జీవాత్మ రూపంలో ఉండి, దేహం వదిలిన తర్వాత తిరిగి పరమాత్మగా ఉన్నతి పొందుతాడని శ్రీ టి. శ్రీరంగస్వామి అష్టకాల్లో ఉన్న అద్వైతాన్ని అందమైన విశ్లేషణతో అలరిస్తాడు రవిచంద్రన్.

ఈ పుస్తకమంతా ఇలాంటి విశేషవ్యాఖ్యానాలే నిండి ఉన్నాయి. ఇలా శ్రీరంగస్వామి రాసిన చిన్న అష్టకసాహిత్యరూపాన్ని తీసుకుని జయదేవుడు, లీలాశుకుడు, భారత, భాగవతాది బహుకావ్యపద్యాలను, శ్లోకాలను ఉపనిషత్ శ్లోకాలను, సందర్భానుసారంగా తన విస్తృత సాహిత్యాధ్యయన సంపత్తితో, ఫలవంతమైన ప్రతిభా వ్యుత్పత్తులతో విశేషంగా వ్యాఖ్యానిస్తూ రవిచంద్రన్ చేసిన 118 పేజీల సుదీర్ఘ విశిష్టవిశ్లేషణే ఈ ***'శ్రీకృష్ణశ్శరణం మమ'.*** ఇంతమంచి వ్యాఖ్యానం అందించి నందుకు డా॥ కంపల్లె రవిచంద్రన్‌ను, ప్రచురించిన అన్నమయ్య గ్రంథాలయం (గుంటూరు)వారిని, ఇంతటికీ కారకులైన డా॥ టి. శ్రీరంగస్వామిగారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను!

*- డా॥ వి.ఆర్.రాసాని.*


## కార్తికపున్నమి వేళలో...



తి.తి.దే. 30-11-2020న కార్తికపౌర్ణమిని పురస్కరించుకుని మహాదీపోత్సవాన్ని నిర్వహించింది. తి.తి.దే. పరిపాలనాభవన మైదానం (తిరుపతి)లో కోవిడ్ నిబంధనలను పాటిస్తూ ఈ దీపోత్సవం ఘనంగా జరిగింది. శోభాయమానంగా తీర్చి దిద్దబడ్డ వేదికలో వేదపండితులు మంత్రాలు పఠిస్తుండగా మహిళలు భక్తిశ్రద్ధలతో దీపారాధన చేశారు. కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి అనుగ్రహభాషణం చేశారు. తి.తి.దే. ఈ.ఓ. కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్., చిత్తూరు జిల్లా కలెక్టర్ నారాయణ భరత్‌గుప్త, ఐ.ఏ.ఎస్., తి.తి.దే. పాలక మండలి సభ్యులు శేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, వైద్యనాథన్, అదనపు ఈ.ఓ. ఏ.వీ. ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., జే.ఈ.ఓ. బసంతకుమార్, ఐ.ఏ.ఎస్., జే.ఈ.ఓ. శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., సీ.వీ. ఎస్.ఓ. గోపీనాథ్ జెట్టి, తదితరులు పాల్గొన్నారు.



## 60 వైకుంఠపాళి



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

1)ఉపపాండవులలో ఒకడు(5); 3)రాక్షసి(3); 4)ఇదొకవృక్షం(2); 5)పవిత్రమైనదళాలు(3); 7)మన్మథునిభార్య(2); 10)ధర్మశాస్త్రాలను ఇలా అంటారు(3); 11)కొడుకు(3); 15)దక్షపుత్రిక ధర్మదేవునిఅర్ధాంగి(2); 16)దక్షప్రజాపతిపుత్రిక(3); 17)లక్ష్మి(2); 20)దీనితో పాలసముద్రాన్ని చిలికారు(4); 21) వసుదేవుని తమ్ముడగు కంకునిమూడవకొడుకు(4)

### నిలువు

2)శుభకార్యాలలో ఏర్పాటు చేసేది(2); 3)వాలిఅర్ధాంగి(2); 4)నెలరోజులో సగం 6)సాగరపుత్రిక(2); 8)గౌతమునికుమారుడు(3); 9)శ్రేయోభిలాషి(3); 12)విశ్వామిత్రునికుమారుడు(2); 13)చ్యవనుడిభార్య(3); 14)రాముడికి జనకుడు(2); 18)భార్య(4); 19)వెల(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

\- ప్రధాన సంపాదకుడు



Edited and published on behalf of T.T.Devasthanams by Prof. K.Rajagopalan, Ph.D., Chief Editor, T.T.D. and printed at T.T.D. Press by Sri P.Ramaraju, M.A., Special Officer (Publications & Press), T.T.D. Press, Tirupati - 517507.

## తిరుమల తిరుపతి దేవస్థానములు

శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని
(బూరగమంద, సదుం మండలం, చిత్తూరుజిల్లా)
20-11-2020న తిరుమల తిరుపతి దేవస్థానం
తన అనుబంధ ఆలయంగా స్వీకరించింది.
శాస్త్రోక్తంగా నిర్వర్తించిన ఈ కార్యక్రమం
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రపంచాయితీ రాజ్‌శాఖ మంత్రివర్యులు
గౌ॥ శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గారి ఆధ్వర్యవంలో జరిగింది









తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి ఆలయంలో
ఘనంగా జరిగిన లక్షకుంకుమార్చన మహోత్సవ దృశ్యం



SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY
Published by Tirumala Tirupati Devasthanams.   printing on 25-11-2020.
Regd. with the Registrar of Newspapers under "RNI" No.10742,
Postal Regd.No.TRP/10 - 2018-2020
Licensed to post without prepayment No.PMGK/RNP/WPP-04/2018-2020